అపరాధ పరిశోధన

రు. 6.50 | నవంబరు '85

Blank Page

సంపుటి: 41
సంచిక: 4

వెల:
6-50

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాసపత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 78 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

నవంబరు, 1985

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

అపరాధ పరిశోధన పోటీ-206

[ఫలితాలు]

సెప్టెంబరు '85 నెల "అపరాధ పరిశోధన పోటీ - 206"కు సరియైన సమాధానాలు:

1. తెలుగు గంగ.
2. కారంచేడు.
3. మృగరాజు.
4. దారిద్ర్యం.
5. ఆకాశహర్మ్యాలు.

పై జవాబుల ప్రకారం ఆరుగురు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి డిసెంబరు '85 నెలనుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీమతి కె. సరోజిని, 10-34-15 సి, కో-ఆపరేటివ్ కాలనీ, కావలి, (నెల్లూరు జిల్లా)

(2) శ్రీమతి గుండా భారతి, D/o ఈజర్ల సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రభ ఏజెంట్, పామిడి - 515 775.

(3) శ్రీమతి ఎన్.పి. ప్రతిమ, జూనియర్ లెక్చరర్, విద్యానగర్, హైద్రాబాదు.

(4) శ్రీ యర్రా జగపతిరావు, శ్రీ చెన్నకేశవ స్టోర్సు, నిడదవోలు - 534 301, ప. గో. జిల్లా.

(5) శ్రీ వి. శ్రీనివాస్, 8-4-32, శ్రీకిషన్ కాలనీ, వరంగల్—506 002.

(6) శ్రీ బొడ్డు వెంకటారావు, S/o బి. కేశవరావు, తాడితోట, రాజమండ్రి.

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. నేరస్తుడికి శాపం—ప్రతాప రవిశంకర్

18. తగిన వరుడు—జొన్నలగడ్డ రామలక్ష్మి

36. సిండికేట్ గేమ్—నీలూ

51. పూజగూడు—'సరసి'

72. అద్భుత దీపం—ఎమ్. వి. వి. సత్యనారాయణ

93. శవం పక్క అగ్గిపెట్టె—వసుంధర

114. ప్రేరణ—కర్నాటి నాగభూషణం

135. లాటరీలో లక్ష—భీమవరపు పురుషోత్తం

148. నిలువుదోపిడి—బి. రాజేశ్వరి

162. నరసింహావతారం—(సీరియల్) వసుంధర

నవలలు (సప్లిమెంట్)

3. అల్లుడు!?—వసుంధర

49. హిమబిందు—ఎమ్.డి. చైతన్య

87. అన్వేషణ?—బొమ్మిడి అచ్చారావు

167. విషకన్య(సీరియల్)—బొమ్మిడి అచ్చారావు

ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

నేరస్థుడికి శాపం

ప్రతాప రవిశంకర్



బేంక్ దోపిడీ చెయ్యటం అంత సులభమైన పనికాదు. అందుకు ఎంతో రిస్క్ తీసుకోవాలి. ఎంతోమంది దొంగలు బేంక్‌లను దోచుకుని తక్కువ కాలంలోనే పోలీసులకు దొరికిపోయిన సంఘటనలు ఎన్నో తెలుసు నాకు.

అందుకే పటిష్టమైన ప్లాను లేనిదే తొందరపడి బేంక్ దోపిడీకి ప్రయత్నం చెయ్యకూడదని నిర్ణయించుకున్నాను.

న్యూస్ పేపర్లలో బేంక్ దొంగతనాలు—దోపిడీల గురించిన వార్తలు ఏ కార్నర్‌లో వున్నా నా కళ్ళు క్షణాల్లో కనిపెడతాయి. ఆ దోపిడీలో లేక దొంగతనంలో నేరస్తులు దొరికిపోయారని చదివినప్పుడు వాళ్ళమీద ఎంతో జాలి కలుగుతుంది.

ఎందుకంటే—బేంక్ దోపిడీ ఎంతో కష్టమైన టాస్క్. ఎంతో రిస్క్ తీసుకుని డీల్‌చేసి చివరకు అనుభవించకుండానే కడ్డీలను లెక్కపెట్టవలసిరావటం నిజంగా విషాదకరమైన సంఘటన.

అటువంటి సంఘటన నా జీవితంలో జరక్కూడదు.

నేను కోరుకునేది యిదొక్కటే.

బేంక్‌ను విజయవంతంగా దోపిడీ చెయ్యాలి.

కొన్ని నెలలుగా బేంక్ దోపిడీ గురించే నా మెదడు తీవ్రంగా ఆలోచిస్తోంది.

ఇంతకీ నేను దొంగను కాదు. దోపిడీ మనిషిని కూడా కాదు.

బేంక్ ఉద్యోగిని—

ఆశ్చర్యం ఏమిటంటే-చదువుకునే రోజులనించీ నేను బేంక్‌లో ఉద్యోగం రావాలని కోరుకునేవాడిని. అందుకోసమే డిగ్రీలో చేరినప్పుడే బేంక్ పరీక్షలకు అవసరమైన ఎన్నో పుస్తకాలను ఎంతో దీక్షగా చదివాను. చివరకు విజయం సాధించాను.

బేంక్‌లోనే ఉద్యోగం రావాలని నేను కోరుకోటానికి కారణం ఏమిటంటే—అందులోనే లక్షల కరెన్సీ ప్రవహిస్తూవుంటుంది. అంకెల గారడీతో—హస్తలాఘవంతో

కొంత డబ్బును సులభంగా సంపాదించే అవకాశం వుంటుంది కాబట్టి....

ఐతే—బేంక్‌లో చేరిన కొన్ని రోజులు ఆ వ్యవహారాలన్నింటినీ పరిశీలించాక అంకెలగారడీతో డబ్బు కాజెయ్యాలనుకునే ప్రయత్నం అనుకున్నంత సులభమైనదిగా కనపడలేదు. అంతేకాదు, ప్రత్యేకంగా ఎవరైనా ఆ గారడీ చేసిన మనిషిని నేనే అని తెలుసుకునే అవకాశం బాగా వుంది. అప్పుడు పూర్తిగా నేను మునిగిపోయినట్టే.

కాబట్టి—ఆ మార్గాన్ని నేను వదులుకున్నాను.

ఇంకొక్కటే మార్గం మిగిలివుంది.

అదే—దోపిడీ.

ఒకే ఒక్క మనిషి బేంక్ దోపిడీ చెయ్యడం అసాధ్యం. నేను బేంక్‌లో ఒక ఉద్యోగిని. కాబట్టి నాకా అవకాశం లేదు.

బేంక్‌లో దొంగతనం అనుకున్న తర్వాత అందుకు సమర్థులైన మనుషుల కోసం వేట సాగించాను.

నా అన్వేషణ ఫలించింది.

మూన్‌లైట్ బార్‌లో ముగ్గురు మనుషులతో నాకు పరిచయమయ్యింది.

ఆ రోజు యీ దోపిడీ గురించే ఆలోచిస్తూ ఒక్కడినే బార్‌కు వెళ్ళాను.

బీరు తాగుతూ కూర్చున్నాను.

సన్నగా మ్యూజిక్ వినపడుతోంది స్పీకర్‌లోనించి. కొన్ని నిముషాల తర్వాత నా టేబిల్ దగ్గర కుర్చీలు ముగ్గురు మనుషులతో నిండిపోయాయి.

ముగ్గురిలో సన్నగా. పొడుగ్గా వున్న మనిషి ఒక్క నిమిషం తర్వాత "మిమ్మల్ని ఎక్కడో చూశాను.

ఎక్కడ?" అని నన్నే అడిగాడు.

నవ్వి "ఇక్కడే అయివుండాలి. తరచు నేను యీ బార్‌కు వస్తూవుంటాను" అన్నాను.

"కాదు. బయట ఎక్కడో చూశాను" అని రెండు నిముషాల తర్వాత "గుర్తుకొచ్చింది. బేంక్‌లో చూశాను. మీరు అందులో పనిచేస్తారు కదూ" అన్నాడు.

అతని పేరు జాన్సన్ అని తర్వాత తెలిసింది.

అవునన్నాను.

అప్పుడు ఆ ముగ్గురూ నాపట్ల చూపించిన ఆసక్తిని గమనించి నవ్వుకున్నాను.

వాళ్ళే నాకు తిరిగి బీరును తెప్పించారు.

సిగరెట్లు యిచ్చారు.

మాటల్లోనే చాలా కేజువల్‌గా అడిగినట్టు బేంక్‌కు సంబంధించిన ఇన్ఫర్మేషన్‌ని అడిగారు.

ఎక్కువగా కేష్‌ను ఏ రోజు బయటకు తీస్తారు? బేంక్‌కు వున్న సెక్యూరిటీ—ఇంకా కొన్ని విషయాల గురించి—

నేను అన్నింటికీ సరైన జవాబులు చెప్పలేదు. ఎందుకంటే బేంక్ దోపిడీ గురించి ఇంకా నే నొక నిర్ణయానికి రాలేదు. ముందుగా ఏదైనా వాళ్ళతో చెప్పటం నాకే ప్రమాదం. ఒక గొప్ప అవకాశాన్ని నేను పోగొట్టుకో వలసి రావచ్చు.

మిగిలిన యిద్దర్లో కొంచెం లావుగా, పొట్టిగా చైనా వాడిలా వుండే మనిషి పేరు జోగారావు. నల్లగా-వంకీల జుట్టుతో అమాయకంగా కనపడే మనిషి శివపాదం.

వాళ్ళ మాటలు ప్రవర్తన నాలో అనుమానాన్ని కలిగించాయి.

మామూలు మనుషులకు బేంక్ కు సంబంధించిన అటు వంటి వివరాలు అవసరంలేదు. ఎవరైనా డబ్బును డిపాజిట్టు చెయ్యదల్చుకుంటే వడ్డీరేట్ల గురించి అడుగుతారు. అంతే—బేంక్ కు వున్న సెక్యూరిటీ గురించి కేష్ గురించి సిబ్బంది తీసుకునే జాగ్రత్తల గురించీ అడగరు.

మళ్ళీ బార్ లోనే కలుస్తానని వచ్చేశాను.

సరిగ్గా నాలుగు రోజులకు ఆ ముగ్గురినీ ఆ బార్ లోనే కలిశాను. ఈసారి మా సంభాషణ బేంక్ దోపిడీల గురించి సాగింది.

"బేంక్ దోపిడీ చేసి తప్పించుకోవటం అసాధ్యం" అన్నాను జోగారావుతో....

అతను ఒప్పుకోలేదు.

"బుర్రలో తెలివిలేనివాడు బేంక్ దొంగతనంచేసి పట్టుబడతాడు. కొంచెం తెలివి వుంటే అంత సులభమైన దోపిడీ యింకోటిలేదు" అన్నాడు.

జాన్సన్ నవ్వి "నువ్వు బేంక్ లో చేరిన తర్వాత ఎప్పుడైనా దోపిడీ జరిగిందా?" అని అడిగాడు.

"ఎందుకూ?"

"ఎందుకంటే నలుగురు ముసుగు మనుషులు బేంక్ లో జొరబడి రివాల్వర్ పేల్చారంటే ఎక్కడివాళ్ళక్కడే షాక్ తో బిగుసుకుపోతారు."

"మీ కెలా తెలుసు?"

"అటువంటి ప్రశ్నలు నువ్వడక్కూడదు" అన్నాడు శివపాదం నవ్వుతూనే సిగరెట్టు వెలిగించుకుంటూ.

వాళ్ళు నా దారికే వస్తున్నారని గ్రహించి యిలా అన్నాను:

"రోజూ ఎన్నో లక్షల కరెన్సీని చూస్తుంటే రాత్రిళ్ళు

నాకు నిద్రపట్టటంలేదు. ఏదో వర్రీగా వుంటోంది."

ముగ్గురూ ఆశ్చర్యంగా నా మొహంలోకి చూశారు.

"అవునా!" ముందుకు వొంగి అడిగాడు జాన్సన్.

"అవును. మొదట్నించీ ఎంతో డబ్బును ఒక్కసారిగా సంపాదించాలనే కోరిక నాలో వుంది. ఆ డబ్బును చూసినప్పుడల్లా అది చెలరేగుతోంది."

"మైగాడ్" సంతోషంతో అరిచాడు శివపాదం.

"ఆ లక్షలు నీ సొంతం చేసుకోవాలని వుంటే చెప్పు."

"ఉంది. కాని ఎలా?"

జాన్సన్ చటుక్కున నా భుజంమీద చెయ్యివేసి నొక్కుతూ "నువ్వు నిజమే మాట్లాడుతున్నావా?" అని సీరియస్‌గా అడిగాను.

"నా కళ్ళల్లో నిజం తెలీటంలేదా?" నేనూ సీరియస్‌గా అడిగాడు.

"ఆల్ రైట్ ... నువ్వు మాక్కావలసిన ఇన్ఫర్‌మేషన్ యివ్వగలిగి మాతో చేతులు కలిపితే కొన్ని గంటల్లో నువ్వు లక్షాధికారివి ఐపోతావు" అన్నాడు జాన్సన్.

"ఏమిటా ఇన్ఫర్మేషన్?" అడిగాను.

చెప్పాడు జాన్సన్.

2

నలుగురం ఒకే గదిలో కూర్చున్నాం.

చిప్స్ నములుతున్నాడు జోగారావు.

మా ఎదురుగా చిల్లీస్ చికెన్—కేజునట్స్ వున్నాయి. గ్లాసుల్లో విస్కీ వుంది.

సగంవరకు కాలిన సిగరెట్టును యాష్‌ట్రేలో నొక్కి, "శనివారం బేంక్ దోపిడీ అనుకూలమైన దే" అన్నాను జాన్సన్‌తో చిన్నగా గుసగుసలాడుతున్నట్టు—

"ఎందుకు?" అడిగాడు జాన్సన్ ముందుకు వంగి.

"ఎందుకంటే తరువాత రోజు ఆదివారం. బేంక్ పని చేయదు. అందువల్ల ఎక్కువ మంది కస్టమర్లు శనివారం రోజు ఎక్కువగా డబ్బును డ్రా చేస్తారు. అంతేకాదు అదేరోజు యాభై వేల రూపాయలకు తక్కువ అవకుండా డబ్బు డ్రా చేసే కొన్ని కంపెనీలు వున్నాయి. ఈ కారణా లతో శనివారం రోజు స్ట్రాంగ్ రూంనించి నాలుగు లక్షల రూపాయలు కేష్ కవుంటర్‌కు తీసుకువస్తారు. ఆ రోజున ఎక్కువ డబ్బు కవుంటర్లో వుంటుంది."

"గుడ్. బావుంది. బేంక్ సెక్యూరిటీ విషయం ఏమిటి?" అనడిగాడు విస్కీ గుటకవేసి.

బేంక్ సెక్యూరిటీ అంటే నవ్వొచ్చింది.

"సెక్యూరిటీగా ఒకే ఒక్క మనిషి వున్నాడు. వాడు శారీరకంగా బలహీనుడు. అంతేకాదు — పిరికివాడు. బేంక్‌కు వచ్చిన కస్టమర్లు గట్టిగా మాట్లాడితే భయపడ తాడు. అందువల్ల వాడిగురించి మనం ఆలోచించవలసిన అవసరంలేదు. బొమ్మ తుపాకీ చూపిస్తే వాడి గుండె ఆగి పోతుంది."

శివపాదం పెద్దగా నవ్వాడు.

"బావుంది" అన్నాడు జాన్సన్.

"అన్నింటినీ మించి మనకు యింకో ఎడ్వాంటేజ్ కూడా వుంది."

"ఏమిటి?" జోగారావడిగాడు.

"రేవతి"

"రేవతా? ఆమె ఎవరు?" జాన్సన్ వెంటనే అడిగాడు ఆశ్చర్యంగా

"ఎవరో నాకూ తెలీదు. అందంగా వుంటుంది. మంచి

వయసులో వుంది. ఏదో ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. శనివారంరోజు పదిన్నరయ్యేసరికి బేంక్ లో డబ్బు జమ చెయ్యటానికి వస్తుంది. శనివారం నాడు ఆమె పదిహేను వందలు ఓ కంపెనీ ఎకౌంట్ లో జమ చేస్తుంది" చెప్పాను.

"అందువల్ల మనకు వుపయోగం ఏమిటి?" శివపాదం అడిగాడు.

"ఉంది....కవుంటర్ దగ్గర నిలబడివున్న అందమయిన రేవతి కణతలకు రివాల్వర్ గురిపెట్టి వుంచి—ఎవర్నీ కదలవద్దనీ చెప్పినట్టు చెయ్యమనీ హెచ్చరిస్తే — మీకు బేంక్ లో ప్రతిఘటన వుండదు. ఎదురు తిరిగి అందమయిన రేవతి ప్రాణాలను బలిపెట్టటానికి ఎవ్వరూ సాహసించరు" అన్నాను.

"గుడ్ .... వెరీగుడ్ .... అద్భుతమయిన ఆలోచన. నిజంగా నువ్వు మాకు దొరకటం మా అదృష్టం" అన్నాడు జాన్సన్ నా భుజం తడుతూ.....

"మీతో పరిచయం నా అదృష్టం. ఎందుకంటే ఒక్క సారిగా లక్షలు సంపాదించాలనే నా కోరిక తీరే అవకాశం దొరికేది కాదు."

"ఎనీ హౌ. అంతా బావుంది. నిజంగానే బేంక్ దోపిడీకి శనివారం అనుకూలమయిన రోజు. ఐతే మనం దోపిడీకి అవసరమయిన సాధనాల గురించీ, అందుకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించీ ఆలోచించాలి" అన్నాడు శివపాదం.

"కేష్ కవుంటర్లో నేనే వుంటాను. రిసీట్స్— పేమెంట్స్ కూడా నేనే డీల్ చేస్తూ వుంటాను. ఉదయం పదీ ఇరవైకి కేష్ కవుంటర్ కి వస్తుంది. సరిగ్గా పదిన్న

రయ్యేసరికి మీరు బేంక్‌లోకి చొరబడాలి. ఆలస్యమయితే చెల్లింపులవల్ల కవుంటర్లో కేష్ తగ్గిపోయే అవకాశం వుంది."

"అవును. నువ్వు సందేహపడవలసింది ఏదీలేదు. సరిగ్గా పదిన్నరకు బేంక్‌లో మా ప్రవేశం తిరుగులేనిది ఏ శనివారంనాడైనా. మనకు ఈ దోపిడీకి పిస్తోళ్ళు కావాలి.... వాటిగురించి దిగుల్లేదు. మా ముగ్గురికీ నిజమైన పిస్తోళ్ళు వున్నాయి ఒక కారు కావాలి....ఎలాగైనా దాన్ని మనం సంపాదించాలి" అన్నాడు జాన్సన్ ఆలో చిస్తూ....

ఒక్క నిమిషం ఆగి శివపాదం ఇలా అన్నాడు:

"ఆ విషయాన్ని నా కొదిలెయ్ జాన్సన్....ఓ టాక్సీని నేను తీసుకొస్తాను. అద్దెకు తీసుకుని డ్రయివర్‌ని దెబ్బ తీసి వాడికి స్పృహవచ్చేసరికి మనం నాలుగు బేంక్ దోపి డీలు చెయ్యొచ్చు."

జోగారావు నవ్వాడు.

"కారు సమస్యకూడా తీరిపోయింది" అన్నాను తేలిగ్గా నిట్టూర్చి.

నా సంతోషానికి అంతులేకుండా పోయింది. అప్పుడే బేంక్ దోపిడీ జరిగిపోయినట్టూ నా వంతు లక్షరూపాయలు వచ్చినట్టూ అనిపించింది.

ఆ ముగ్గురిమీదా వాళ్ళ శక్తిసామర్థ్యాలమీదా నాకు నమ్మకం కలిగింది. వాళ్ళు చెప్పలేదుకాని ఇంతకుముందు కొన్ని బేంకుల్లో జరిగిన దొంగతనాలకు ఆ ముగ్గురే కారణమై వుంటారని కూడా నాకు అనిపించింది.

"ఆల్ రైట్. ఇంక బేంక్ దోపిడీని విజయవంతంగా ఎలా ముగించాలో చెబుతాను. సరిగ్గా పదిన్నరకు టాక్సీ

వచ్చి బేంక్ ముందు ఆగుతుంది. జోగారావు కార్లోనే వుంటాడు అందులోనించి ముసుగులు ధరించి నేను, శివ పాదం బేంక్ లో చొరబడతాము. మా చేతుల్లోవున్న పిస్తోలు మడమలతో సెక్యూరిటీ మనిషి తలమీదకొట్టి స్పృహ తప్పిస్తాం. వెంటనే నేను రేవతిని కవర్ చేసి ఆమె కణతకు పిస్తోలు అన్చి ఎవర్నీ కదలొద్దనీ, ఎక్కడి వాళ్ళని అక్కడే నిలబడిపొమ్మనీ హెచ్చరిస్తాను.

శివపాదం ప్లాస్టిక్ బేగ్ తో కేష్ కవుంటర్ దగ్గరకువచ్చి పిస్తోలుతో నిన్ను బెదిరించి కవుంటర్లోవున్న డబ్బునంత టినీ బేగ్ లో సర్ది ఇవ్వమంటాడు. నువ్వు వణికిపోతు న్నట్టు నటిస్తూ డబ్బునంతా బేగ్ లో సర్ది ఇచ్చేస్తావు. అంతే. అందర్నీ మళ్ళీ ఒకసారి పిస్తోళ్ళతో బెదిరించి రేవ తిని ఎంట్రెన్స్ డోర్ వరకూ తీసుకెళ్ళి ముందుకునెట్టేసి రెడీగావున్న టాక్సీలో ఎక్కి పారిపోతాం.. ఎలా వుంది మన పథకం?" అనడిగాడు జాన్సన్ అంతా చెప్పి.

"బావుంది. ఇందులో లోపాలు కనపడడంలేదు. దోపిడీ జరిగిన తర్వాత మనం ఎక్కడ కలుసుకుంటాం?" అన్నాను.

శివపాదం నవ్వి "నీ భయం నాకు అర్థమయ్యింది. నీ భాగం గురించేకదా నువ్వు భయపడేది. దోపిడీ జరిగిన వెంటనే మనం కలుసుకోవటం మంచిది కాదు. మేము వూరొదిలివెళ్ళిపోయి పదిరోజుల తర్వాత తిరిగివస్తాం. తర్వాత నీ వాటా డబ్బును నీ గదిలోనే నీకు అంద జేస్తాం....ఏమంటావ్?" అన్నాడు.

"మిమ్మల్ని నమ్మాను. ఇప్పుడు నేను కూడా మీలో ఒకడిని. మీరు నన్ను మోసం చెయ్యరనే నమ్మకం నాకు

వుంది" అన్నాను చిరునవ్వుతో.

"థాంక్‌యూ మై ఫ్రెండ్" అన్నాడు జాన్సన్ భుజం తడుతూ....

"ఇంతకీ దోపిడీ ఎప్పుడు?" జోగారావు అడిగాడు.

"వచ్చే శనివారమే బేంక్ దోపిడీ" అన్నాడు జాన్సన్. ఎందుకో ఒక్కసారిగా నా గుండె వేగంగా కొట్టుకున్నది. బేంక్ దోపిడీకి మధ్యలో ఒకే ఒక్కరోజు గడవాలి.

3

కేష్ కవుంటర్లో కూర్చున్నాను. నా ఆలోచన్లు పనిమీదలేవు.

టెన్షన్‌గా ఎదురుగా గోడకువున్న ఎలక్ట్రానిక్ గడియారాన్ని చూశాను.

సరిగ్గా పదీ ఇరవై ఐదు.

ఇంకో ఐదు నిముషాలు—అనుకున్నాను.

అప్పుడే వచ్చింది రేవతి. నన్ను చూస్తూనే చిన్నగా నవ్వింది. కవుంటర్ దగ్గర జనం కొంచెం ఎక్కువగా వున్నారు.

మూడులక్షలే తీద్దామన్నాడు మేనేజర్. కాని ఇద్దరు బిజినెస్‌చేసే మనుషులు ఫోన్‌చేసి ఎక్కువ మొత్తంలో ఆ రోజు డబ్బు డ్రాచేయమని చెప్పటంతో నాలుగు లక్షలు తీయించాడు.

రేవతిని చూడగానే మగవాళ్ళు పక్కకు తప్పుకున్నారు. వెంటనే ఆమె దగ్గర డబ్బు కట్టించుకుని ఆమెను పంపించటం జరక్కూడదు. బేంక్ దోపిడీ ప్లానులో రేవతికి కూడా ఇంపార్టెన్స్ వుంది.

అందుకే డబ్బును అందుకుని నోట్లకట్టలను కావాలనే

పూడదీశాను. మళ్ళీ వరసగా పెడుతున్నట్టు నటిస్తూ కంటి చివరనుంచి గడియారాన్ని చూశాను.

ఇప్పుడు సరిగ్గా పదిన్నర.

గుండె అతివేగంగా కొట్టుకుంది.

హటాత్తుగా ఏదో కారు రివ్వునవచ్చి బేంక్ ముందు ఆగిన చప్పుడయ్యింది కీచుమంటూ.

ఒక్క సెకండ్ ....

ఇద్దరు ముసుగులు వేసుకున్న మనుషులు లోపలకు చొరబడ్డారు. చొరబడుతూనే సెక్యూరిటీ మనిషిని తల మీద పిస్తోలుతో కొట్టారు. వాడు మాట్లాడకుండా షాక్ తోనే కిందికి జారిపోయాడు.

మెరుపులా జాన్సన్ ముందుకు దూకి రేవతిని పట్టుకుని ఆమె కుడివైపు కణతకు పిస్తోలు ఆనించి హెచ్చరిక చేశాడు.

"ఎలర్ట్ ....ఎవ్వరూ కదలొద్దు....కదిలితే ప్రాణాలకు ప్రమాదం. పిస్తోలు పేల్చటానికి వెనకాడను. ముందుగా ఈ అమ్మాయి అవుట్ ...."

కెవ్వుమని అరవాలనుకున్న రేవతి తన ప్రయత్నాన్ని ఆపుచేసుకున్నది.

ఎక్కడి మనుషులు అక్కడే బొమ్మల్లా బిగుసుకుపోయారు.

శివపాదం సూటిగా పిస్తోలు నాకు గురిపెట్టి ప్లాస్టిక్ బేగ్ను లోపలకువిసిరి "ఊ...డబ్బంతా బేగ్లోకి సర్దెయ్" అన్నాడు....

వణికిపోయినట్టు నటించాను.

బెదురుతున్న కళ్ళతో—పాలిపోయిన మొహంతో మేనేజర్ కేసి చూశాను. ఆయన కూడా భయస్తుడే....

"డోంట్ ప్లే ట్రిక్స్. ఆలస్యాన్ని నేను సహించలేను. ఒక్క నిమిషం ఆలస్యం ఐనా పిస్తోలు పేలుతుంది" అన్నాడు శివపాదం దాన్ని కదిలిస్తూ

బేగ్‌తో కిందికి వొంగాను. గబగబా నాలుగు లక్షల పదిహేను వందల రూపాయలను బేగ్‌లో సర్దేశాను.

"నో మూవ్‌మెంట్స్.. ఎవ్వరూ కదలొద్దు. ప్రాణాలు ఎగిరిపోతాయ్" ఇంకోసారి హెచ్చరించాడు జాన్సన్— రేవతిని గట్టిగా నొక్కుతూ.....

బేగ్‌ను శివపాదానికి అందించాను వణుకుతున్న చేతులతోనే.

"క్విక్....అవుట్...." అరిచాడు శివపాదం దాన్ని అందుకుంటూ.

జాన్సన్ రేవతిని విసురుగా ముందుకు నెట్టాడు.

'ఢా'మ్మని పిస్తోలు పేలింది శివపాదం చేతిలో.

'కెవ్వు'మని అరిచి కిందపడిపోయాను. పిస్తోలుగుండు నా భుజంలోకి దూసుకుపోయింది.

మతిపోయినట్లనిపించింది. స్పృహ పోతున్నప్పుడు బయట ఏదో కారు వేగంగా ముందుకు దూసుకుపోయిన చప్పుడు వినపడింది.

4

ఇనుప కడ్డీలను లెక్కపెట్టాను. ఈసారికూడా పదమూడే వున్నాయి. ప్రస్తుతం అంతకంటే నేను చెయ్యగలిగింది ఏదీలేదు. ప్రక్క గదులలో జాన్సన్, శివపాదం, జోగారావు కూడా ఇలాగే ఇనుప చువ్వలను లెక్కపెడుతూ వుండేవుంటారు. ఇందుకు పూర్తిగా నేనే కారణం. కాదు—ఒక రకంగా జాన్సన్ కూడా.

ముందుగా నాకు చెప్పకుండా పిస్తోలు పేలితే నేనేమను

కుంటాను?

ఏం జరిగిందో క్లియర్‌గా చెబుతాను.

శివపాదం నామీదకు పిస్తోలు ఎందుకు పేల్చాడంటే? గబగబా డబ్బునంతటినీ బేగ్‌లో సర్ది ఇచ్చినందుకు— బేంక్ సిబ్బందికి నామీద అనుమానం రాకుండా వుండేందుకు—నా ప్రమేయం లేకుండా ఎవరో చేసిన సహజమైన బేంక్ దోపిడీ అనిపించటానికి కావాలనే నన్ను గాయపరచటానికి అలా పిస్తోలు పేల్చాడుట. అలా పేల్చమని జాన్సన్ బయల్దేరేముందు చెప్పాడుట.

కాని—నేనలా అర్థంచేసుకోలేదు. నా ఆలోచన ఇంకో విధంగా వుంది స్పృహ వచ్చిన తర్వాత—

బేంక్ దోపిడీకి ఆ ముగ్గురూ నన్నో సాధనంగా వుపయోగించుకున్నారు. డబ్బు చేతికిరాగానే నేను బతికుంటే వాళ్ళకు ప్రమాదం అనీ, ఒకవేళ పోలీసులు నన్ను అనుమానించి హింసలు పెడితే వాళ్ళగురించి చెబుతాననీ భయపడి నన్ను చంపటానికి శివపాదం పిస్తోలు పేల్చాడని అనుకున్నాను. అది గురితప్పి నా భుజానికి తగిలిందనీ— తర్వాత ఎప్పుడైనా నన్ను చంపే ప్రయత్నం చేస్తారని భయపడి—ఆ ముగ్గుర్నీ కటకటాల వెనక్కు పంపించటానికి వాళ్ళగురించి పోలీసులకు నేనే చెప్పాను.

అప్పుడు బేంక్ దోపిడీ కథంతా బయటకు వచ్చింది.

ఎటువంటి విషాదకరమైన సంఘటన జరగకూడదని అనుకున్నానో— చివరకు అదే సంఘటన జరిగింది.

ఏమైనా—ఏ నేరస్థుడైనాచేసే చిన్న పొరపాటే— అతడి పాలిట శాపంగా మారుతుంది. □

తగిన వరుడు

జొన్నలగడ్డ రామలక్ష్మి

"ప్రతిక్షణం ఎంతో విలువైనది. మాటలతో వృధా చేసుకుంటే నీకే నష్టం!" అంది గీత.

"గీతా! నేను మాటలకోసమే ఇక్కడకు వచ్చాను." అన్నాడు రాంకుమార్ గంభీరంగా.

"అంటే?" అంది గీత ఆశ్చర్యంగా.

"నీకు నే నిచ్చే వందరూపాయలకూ నీ నుంచి నే నాశించే ప్రతిఫలం వేరేవుంది—" అన్నాడతడు.

"ఏమిటది?"

"నేనొక అమ్మాయిని ప్రేమించాను. ఆమెపేరు జ్యోతి. ఆమె కూడా నన్ను ప్రేమించింది. ఇద్దరం పెళ్ళిచేసుకోవా లనుకుంటున్నాం...."

గీత అసూయగా అతడి కేసి చూసి—"అయితే?" అంది.

"నేను పెద్ద కంపెనీలో మేనేజర్ని నా కింద నలుగురు స్టెనోలుంటారు. నలుగురూ ఆడవాళ్ళే. ఫేషనబుల్‌గా ఉంటారు. వాళ్ళతో చాలా క్లోజ్‌గా మువ్ అవుతూండాలి. పెళ్ళయ్యాక నా భార్య ఇది ఎంతవరకూ సహిస్తుందని నా అనుమానం!" ఆగాడతడు

"అయితే?"

"నువ్వు యధాలాపంగా ఆమె—అంటే జ్యోతిని కలుసుకో. మనిద్దరికీ ఏదో సంబంధమున్న భ్రాంతిని కలిగించు ఆ తర్వాత ఆమె ప్రవర్తన ఏ విధంగా ఉంటుందో నేను గమనిస్తాను...." అన్నాడు రాంకుమార్.

"ఇదేం సరదానీకు?"

"నా సరదా నీకు వందరూపాయలిస్తోంది"—అన్నా డతడు.

"అవును. అదీ శ్రమలేకుండా?" అని ఆమె ఓసారి వళ్ళు విరుచుకుని "ఒంటరిగా హోటల్ గదిలో డబ్బిచ్చి కొనుక్కున్న ఆడదాన్ని ఏ మాత్రమూ వాంఛించకుండా— తను కోరిన మరో ఆడదాని శీలం గురించి పరీక్షించమని నియమించే నీవంటి భర్త లభించడం ఆ జ్యోతికి న్యాయమో, అన్యాయమో అర్థంకావడంలేదు. నీవంటివాడికి

నలుగురు కాదు. నలభై వుంది అడ స్టైనోలున్నా ఇబ్బంది లేదు-" అందామె.

"ఇది నాకు కాంప్లిమెంటే అవుతుంది. అనుకున్న ఫలితం సాధిస్తే నీకు మరో వందరూపాయలిస్తాను-" అన్నాడు రాంకుమార్.

"ఇట్సాల్రైట్—శ్రమలేకుండా మరో వంద సంపాదించుకుంటాను నువ్వు సాధించదల్చుకున్న ఫలితం మాత్రం నాకర్థంకావడంలేదు—" అంది గీత.

"దీన్నే అట్నుంచి నరుక్కురావడమంటారు—" అని నవ్వాడు రాంకుమార్.

రాంకుమార్ జ్యోతిని అందంచూపి ప్రేమించాడు. ప్రేమించి ఏడాది దాటింది. అతడెంత ప్రయత్నించినా జ్యోతి వారిమధ్య కొంత మినిమమ్ డిస్టన్స్ మెయింటైన్ చేసింది ఆమె నైతిక విలువలకు ప్రాధాన్యతనిచ్చే మనిషి అని అతడు గ్రహించాడు.

రాంకుమార్ గతజీవితం అంత మంచిదికాదు. అతడు చేసిన కొన్ని తప్పులు బయటపడితే జ్యోతి సహించక పోవచ్చు. అప్పుడు దాంపత్య జీవితం నరకం కావచ్చు. అందుకని పెళ్ళికిముందే ఆమె తన తప్పులకెలా రియాక్టవుతుందో చూడాలి. సూటిగావచ్చి తననడుగుతుందా లేక మనసులో పెట్టుకుని తనకు దూరంగా ఉంటుందా? లేక తన కీ అదృష్టమే చాలనుకుని సరిపెట్టుకుంటుందా?

ఆమె తనకు దూరమై మరిచిపోవాలని ప్రయత్నిస్తే? తను దగ్గర కావాలనుకున్నా రానివ్వకపోతే?

ఫరవాలేదు. తనకు ఆల్టర్నేటివ్ ఉంది. ఆల్టర్నేటివ్ పేరు చందన. చందనకు అందమేకాదు. ఆస్తికూడావుంది. ఆమెవన్నీ ఆధునికభావాలు. ఈ ఆధునిక యుగంలో ఆమె

వంటి యువతితోడుగా ఉంటే తనకు అదృష్టమే!

జ్యోతిని వదుల్చుకుందుకు తా నీ పథకం వేశాడా? లేక నిజంగా జ్యోతిని పరీక్షించాలనుకుంటున్నాడా?

ఆ విషయం రాంకుమార్‌కే తెలియదు. లేక తెలియదని తన్నుతాను మోసగించుకుంటున్నాడో!

ఈ పథకం మాత్రం అతడికి చందనను చూశాకా, ఆమె ఆస్తిగురించి తెలిశాకా, ఆమెకూడా తనంటే యిష్ట పడుతున్నదని గ్రహించాకా—తట్టింది.

"ఎట్నించైనా కానీ—ఈ నరకడాలు నాకు నచ్చవు. ఏది ఏమైనా నరుకుతున్నది నేను కాదుగదా—అదే నాకు తృప్తి!" అంది గీత.

2

పోస్టాఫీసులో నిలబడి ఎదురింటి వైపే చూస్తోంది గీత.

అదే జ్యోతి యిల్లు.

ఆ యింటికివెళ్ళి ఆమెనెలా పలకరించాలి. ఆమెతో ఏం మాట్లాడాలి అని ఆలోచిస్తోంది గీత. ఒక పథకం ఆమె బుర్రలో రూపు దిద్దుకుంటోంది.

గీత ఆలోచిస్తూండగానే తలుపులు తీసుకుని ఆ ఇంట్లోంచి ఓ యువతి బయటకు వచ్చింది. ఆకాశం రంగు చీర, అదేరంగు బ్లవుజు—విరబోసుకున్నజుట్టు—ఆమె ఆకాశగంగాలా వుంది.

"జ్యోతి బాగుంది!" అనుకుంది గీత.

ఆ యువతి రోడ్డుమీదకు వచ్చింది. ఆమె నడకలో వయ్యారాలున్నాయి.

"రాంకుమార్‌ది మంచి ఛాయిస్-" అనుకుంది గీత. ఆమె యిక ఆలస్యం చేయలేదు. త్వరగా వెళ్ళి ఆమెను కలుసుకుని—"హలో!" అని పలకరించింది.

"హాయ్"—అందామె.

"తీయని గొంతు" — అనుకుంది గీత—"మీతో అర్జంటుగా మాట్లాడాలి—" అంది జ్యోతితో.

"నాతోనా—మీరెవరో నాకు తెలియదు…." అంది జ్యోతి.

"నాకూ మీ గురించి పూర్తిగా తెలియదు. అయినా మాట్లాడే విషయానికి పరిచయం అవసరం లేదు…." అంది గీత.

"ఏమిటి మీరు మాట్లాడేది?"

"ఇక్కడ బాగుండదు. దగ్గర్లో పార్కుంది. అక్కడకు వెడదాం" అంది గీత. జ్యోతి అయిష్టంగానే ఆమె ననుసరించింది.

ఇద్దరూ రెండు సందులు తిరిగి ఓ పార్కులోకి వెళ్ళారు. అక్కడ స్థిమితంగా కూర్చున్నాక—"ఇది పురుష ప్రపంచంగా ఉంటోంది. తలచుకుంటే మగాణ్ణో ఆట ఆడించగల స్త్రీ, మగాడి చేతిలో కీలబొమ్మగా ఉంటోంది—" అంది గీత.

"అయితే?" అంది జ్యోతి.

"ప్రచారంలో ఆడది. సినిమాల్లో ఆడది. సౌఖ్యానికి ఆడది ఎక్కడచూపినా ఆడదానికి ఆటబొమ్మకు మించిన విలువలేదు. ఇది అన్యాయం. ఈ అన్యాయాన్ని ఆడది ప్రతిఘటించాలి. పురుషుడికి తగిన విధంగా బుద్ధిచెప్పాలి." అంది గీత

"మీరు ఉమెన్స్‌లిబ్ ప్రతినిధులా?" అంది జ్యోతి.

"అవును. నాకు మీ వంటి యువతులు సహకరించాలి."

"ఏ విధంగా?"

"నువ్వూ నా దారిలోనే నడుస్తున్నావని తెలిసే—మనం

చేతులు కలిపి మరికొందరు యువతులను మనకులా తయారు చేయాలని కోరికపుట్టి నిన్ను పిలిచాను."

జ్యోతి ముఖం ఆవేశంతో ఎర్రబడింది—"మనం మనం అని పదే పదే అనకు. నీ దారి నా దారీ ఒకటికాదు" అందామె.

"మన దారులొకటే అనడానికి ఋజువులెన్నో ఉన్నాయి....." తాపీగా అంది గీత.

"ఏమిటవి?"

"ఉదాహరణకు రాంకుమార్....."

"వాడెవరు?"

"అతడు నేనంటే యిష్టపడ్డాడు. కలిసినప్పుడల్లా వంద రూపాయలిస్తాడు. సినిమాలకు తీసుకుని వెడతాడు. హోటల్సకు తీసుకునివెడతాడు....."

"అయితే?"

"అతడు నీకూ తెలుసు ...."

"నాకు తెలుసునని నీకెలా తెలుసు?"

"అతణ్ణి నిన్నూ కూడా ఓసారి బజార్లో కలిసి తిరుగుతూండగా చూశాను. రాంకుమార్‌తో తిరిగేవాళ్ళు నా వంటి వాళ్ళు తప్ప వేరే ఎవరుంటారు?" అని నవ్వింది గీత.

అప్పుడు జ్యోతి తన వానిటీబ్యాగులోంచి ఒక కవరు తీసింది. అందులో పన్నెండు కలర్ ఫొటోలున్నాయి.

"వీటిలో రాంకుమార్ ఉన్నాడేమో చూసిచెప్పు!" అందామె.

కొందరు యువకులు, యువతులు కలిసి తీయించుకున్న ఫొటోలవి. అందులో ఒక ఫొటోలో రాంకుమార్‌ని గుర్తుపట్టింది గీత

జ్యోతిముఖం మాడిపోయింది. విసురుగా లేచిందామె.

"వెళ్ళిపోతున్నావా?" అంది గీత.

"నేను నీకు సాయపడలేను కానీ ఋణపడి ఉన్నాను." అని వెళ్ళిపోయింది జ్యోతి.

"పూర్ రాంకుమార్! వాటే(డామా?" అనుకుంది గీత.

3

జ్యోతి వెళ్ళిపోయాక గీత అక్కడే కాసేపు కూర్చుంది. లేద్దామా అనుకుంటూండగా హడావుడిగా ఓ యువకు డక్కడికి వచ్చాడు.

గీత అతడివంక ప్రశ్నార్థకంగా చూసింది.

"మేడమ్! నా పేరు ప్రసాద్...." అన్నాడతడు.

"నా పేరు గీత...." అందామె.

"ఈ సమయంలో పార్కులో మీరిక్కడుండడం నా అదృష్టం" అన్నాడతడు.

"అంటే?"

"మీరు గమనించలేదా-పార్కిప్పుడు నిర్మానుష్యంగా వుంది."

"వాడ్డూయూమీన్!" అంది గీత.

"అయాం సారీ-నేను చెప్పదల్చుకున్నది వేరు. ఇంకో అరగంటలో ఇక్కడికి నా ప్రియురాలు వస్తుంది. ఆమెను నేనే యిక్కడికి రమ్మన్నాను. కానీ ఆమె వచ్చేవరకూ ఆగే వ్యవధిలేదు. అనుకోకుండా అర్జంటు పనితగిలింది."

"ఆమె యింటికి ఫోన్ చేయలేకపోయారా?"

"వాళ్ళింటికి ఫోన్ లేదు."

"ఇంటికెవరి చేతనైనా కబురు పంపలేక పోయారా?"

"మా పరిచయం ఇంట్లో తెలియదు. చాలా గొడవవు తుంది."

"అయితే నేనిప్పుడేం చేయాలి?"

"ఒక్క అరగంట మీరిక్కడేవుండి నా ప్రియురాలికి నా సందేశం అందజేయాలి. మీ మేలు జన్మజన్మలకీ మర్చిపోలేను."

"ఏం చెప్పాలామెకు?"

"సాయంత్రం సంగీతా పార్కులో ఆరుగంటలకు కలుసుకుందామని చెప్పండి." అన్నాడు ప్రసాద్.

"ఏమిటీ—సంగీతా పార్కులోనా?"

"అవును."

ఓ అరగంట ఆగి "ఆ విషయం మీరే ఆమెకు చెప్పొచ్చుగా."

"అరగంట ఆగడానికి లేదు."

"ఎందుకని?"

"కారణం మీకు చెప్పలేను."

"కలుసుకుందుకు రమ్మనిచెప్పి రానప్పుడు—అందుకు సరైన కారణం చెప్పలేకపోతే ఏ ప్రియురాలూ క్షమించదు. మీకున్నపళంగా వచ్చిన అర్జంటుపనేమిటో చెప్పండి—" అంది గీత.

అతడు క్షణం తటపటాయించి—"నేను పెళ్ళి చూపులకు వెడుతున్నాను. తనను ప్రేమించాక పెళ్ళిచూపులకూడా ఎక్కడకూ వెళ్ళనని ఆమెకు మాటిచ్చాను. కానీ యిప్పుడు తప్పలేదు. పేరుకు మాత్రమే పెళ్ళిచూపులు. మా నాన్నగారికీ సంబంధం బాగా నచ్చింది. ముహూర్తం పైమాకి నేను రెడీగాలేకపోతే ఇంట్లోంచి పొమ్మంటారు. నా కుద్యోగంలేదు. ఏమైపోతాను చెప్పండి" అన్నాడు.

"ఉద్యోగంలేదు కాబట్టి మీ నాన్నగారు బలవంతపెడితే-ఆ పెళ్ళికూడా చేసేసుకుంటారా?" అంది గీత.

"పెళ్ళిచూపు లాపలేనుగానీ పెళ్ళి ఆపడానికి నా దగ్గర

లక్ష మార్గాలున్నాయి. వాటిలో కొన్ని ఈరోజో ప్రయోగి స్తాను" అన్నాడు ప్రసాద్.

"అయితే నేనేం చేయాలి?"

"పెళ్ళి చూపుల విషయం మాత్రం ఆమెకు చెప్పకండి. మళ్ళీ ఆమె నా ముఖం చూడదు. సాయంత్రం ఆరింటికి సంగీతా పార్కులో నే నామె కోసం ఎదురు చూస్తూంటా నని చెప్పండి. మీ మేలు ఈ జన్మకు మరువను."

"ష్యూర్...." అంది గీత.

"మరి సెలవు" అన్నాడు ప్రసాద్.

"బెస్టాఫ్ లక్" అంటూ చేయి సాచింది గీత. అతడు తటపటాయిస్తూనే ఆమె చేతి నందుకున్నాడు. అతడు వణుకుతున్నట్లు గ్రహించి తనలో తనే నవ్వుకుంది గీత.

4

ప్రసాద్ వెళ్ళిపోయాడు. గీత ఆలోచనలో పడింది.

ప్రసాద్ ఒక అమ్మాయిని ప్రేమించాడు. పెళ్ళికి ముందే ఆమె తన నపార్థం చేసుకుంటుందేమోనని భయ పడుతున్నాడు. చిన్న విషయాన్ని. ప్రమాదంలేని విష యాన్ని ప్రియురాలి నుంచి దాచాలనుకుంటున్నాడు.

రాంకుమార్ కూడా ఓ అమ్మాయిని ప్రేమించాడు. పెళ్ళయ్యాక ఆమె తన నపార్థం చేసుకుంటుందేమోనని పెళ్ళికి ముందే కల్పితగాథల నామె తలలో కెక్కించి తమాషా చూడాలనుకుంటున్నాడు.

ఇద్దరూ భిన్న ధృవాలు.

అప్పుడే గీత మనసులో ఓ చిలిపి ఆలోచన ప్రవే శించింది.

ప్రసాద్ పిరికివాడు. భయస్థుడు. ప్రియురాలు తన నపార్థం చేసుకుంటుందేమోనని కంగారుపడుతున్నాడు.

అటువంటప్పుడు ప్రియురాలు నిజంగానే అపార్థం చేసుకుని నిలదీస్తే ఏం చేస్తాడు?

కాసేపట్లో ప్రసాద్ ప్రియురాలు వస్తుంది. ఆమెతో తను ప్రసాద్‌పట్ల అనుమాన బీజాలు నాటాలి. ఆ తర్వాత సాయంత్రం సంగీతాపార్కుకు వెళ్ళి అక్కడ జరిగే తమాషా చూసి ఆనందించాలి.

జ్యోతిలో తను అపార్థాన్ని సృష్టించింది. అందువల్ల తనకు ప్రతిఫలం లభిస్తుంది-రాంకుమార్ నుంచి. ఇప్పుడు ప్రసాద్ ప్రియురాలిలో తా నపార్థాన్ని సృష్టిస్తుంది. వినోదమే అందుకు తగిన ప్రతిఫలం.

గీత అక్కడే కూర్చుని ఎదురుచూస్తోంది. మధ్య మధ్య టైము చూసుకుంటోంది. కాసేపటికి అక్కడికొక యువతి వచ్చింది.

ఈ యువతిది అద్భుత సౌందర్యం.

పసుపు పచ్చని పోలీఎస్టర్ చీర ఆమె ఛాయతో కలిసి పోయింది.

"ప్రసాద్ ఛాయస్ అద్భుతం...." అనుకుంది గీత.

ఆ యువతి అక్కడే ఒక్క క్షణం అసహనంగా తిరిగింది.

"నీదీ నాలాంటికేసే అనుకుంటాను...." అంది గీత.

అంతవరకూ ఆ యువతి ఆమెను పలకరించలేదు. అప్పుడామె గీత వంక ప్రశ్నార్థకంగా చూపింది.

"నేను నా ప్రియుడి కోసం ఎదురుచూస్తున్నాను. ఎటొచ్చీ అతదొచ్చే అవకాశం లేదు. నీకేమైనా ఛాన్సుందేమో తెలియదు...." అంది గీత.

ఈ రకమైన సంభాషణ ఆ యువతికి నచ్చలేదు. అయి

ష్టంగా ఓ చూపు చూపి అక్కడే పచార్లు చేయసాగింది.

"అలా తిరిగితే కాలక్షేపం కాదు. కూర్చో-నా కథ చెబుతాను" అంది గీత చనువుగా.

ఆమె ఏమనుకుందో ఏమో గీత కెదురుగా కూర్చుంది.

"నిజం చెబుతాను. నన్నసహించకు. నేను నీలాంటి దాన్ని కాదు. నువ్వు నాలాంటిదానివి కాదని చూస్తూనే గ్రహించాను...."

ఆమె మాట్లాడలేదు.

"నేను చెడిన మాట నిజం. అంతమాత్రాన నాతో మాట్లాడితేనే నువ్వూ చెడిపోతావా?" అంది గీత బాధగా.

ఆమె తడబడి "నా ఉద్దేశ్య మదికాదు. నా ఆలోచనల్లో నే నున్నాను. నీ గురించి నాకేమీ తెలియదు" అంది.

"నా గురించి వినడం నీకు ప్రయోజనం...." అంది గీత. ఆ యువతి అనుమతి కోసం ఎదురుచూడకుండా ఆమె చెప్పడం ప్రారంభించింది.

"అతడు నన్ను ప్రేమించానన్నాడు. నిజమేనను కున్నాను. అతడు నన్ను పెళ్ళి చేసుకుంటానన్నాడు. లొంగిపోయాను. తర్వాత నుంచి మొహం చాటేయడం మొదలు పెట్టాడు. అతడి మోసం అర్థమయింది కానీ నేనేం చేయగలను? ఆ తర్వాత కొన్నాళ్ళకతడు తన తప్పు తెలుసుకున్నానని మళ్ళీ నా దగ్గరకు వచ్చాడు. నిజమేనను కున్నాను. అతడి దురుద్దేశం నా కర్థం కాలేదు.

ఇంట్లో తలిదండ్రులు పెళ్ళికొప్పుకోరని చెప్పి-నన్నె క్కడికో తీసుకుని వెళ్ళాడు. నన్ను డబ్బుకో దుర్మార్గుడి కమ్మేశాడని ఆలస్యంగా నాకు తెలిసింది. అక్కడ నన్ను బలవంతంగా వ్యభిచారంలో ప్రవేశపెట్టాలని కొన్ని ప్రయ త్నాలు జరిగాయి. అక్కణ్నించి నన్నో యువకుడు రక్షిం

చాడు-ఒక షరతుమీద. నే నిప్పుడు కాల్‌గర్‌గా ఉంటూ నా సంపాదనలో కొంత ఆ యువకుడి కిచ్చుకుంటున్నాను. వ్యభిచారంకంటె బాగా మెరుగ్గా వుందిది.....

అప్పు డా యువతి గీతవంక జుగుప్సాకరంగా చూపింది. ఆమె తన నసహ్యించుకున్నట్లు గీత కర్థమయింది

"అలా చూడకు. నా కథ పూర్తిగా విను. ఓ గంట క్రితం తొలిసారి నన్ను మోసగించిన దుర్మార్గుడు కనిపించాడు. నన్ను చూపి ముఖం చాటేయబోయాడు. నేనే పిలిచి పలకరించి ఇక్కడకు తీసుకుని వచ్చాను. నా కథ చెప్పుకున్నాను. వాడికి నామీద యింకా ఆశ వుంది. ఎలాగూ చెడిపోయాను కాబట్టి తప్పు లేదనుకున్నాడు. అబద్ధమెందుకూ-కన్నె హృదయాన్ని తొలిసారిగా నమ్మి అర్పించుకున్నందువల్ల నా మనసులో వాడికో స్థానముంది.

వాడు మళ్ళీ మంచిమాటలు చెప్పి నా కో దారి చూపిస్తానన్నాడు. మోసమని తెలిసిపోయినా నేను లొంగిపోయాను. ఉన్నట్లుండి ఏమయిందో టైము చూసుకుని 'నువ్వు వెళ్ళిపో-మళ్ళీఎప్పుడయినా కలుసుకుందాం' అన్నాడు. వాడలాగంటే నా కనుమానం వచ్చింది. నేను వెళ్ళనన్నాను. బతిమాలాడు. వెళ్ళనన్నాను. 'నాకు అర్జంటు పనుంది వెళ్ళిపోతున్నాను. నా మీద నమ్మకముంటే సాయంత్రం ఆరు గంటలకు సంగీతా పార్కుకి రా' అన్నాడు. 'నీతో ఇంకా చాలా చెప్పుకోవాలి. అర్జంటు పని చూసుకుని నువ్వే యిక్కడకురా-నువ్వొచ్చేదాకా అన్నపానాలు మానుకుని యిక్కడే ఎదురు చూస్తూంటాను' అని వాడికి చెప్పాను.

వాడు రానని ఖచ్చితంగా చెప్పేశాడు. నేనిక్కణ్ణించి

కదలనని ఖచ్చితంగా చెప్పేశాను. సంగీతాపార్కు గురించి మరోసారి హెచ్చరించి వెళ్ళిపోయాడు. అయినా వస్తాడేమోననే ఆశతో ఇక్కడ కూర్చున్నాను. కానీ ప్రసాద్ నన్నెన్నిసార్లు మోసగించలేదు కనుక.... ఈసారి కాదనుకునేందుకు" అంది గీత.

"నీ ప్రియుడి పేరేమిటన్నావ్?" అందా యువతి ఉలిక్కిపడి.

"ప్రసాద్—ఏం?" అంది గీత అర్థంకానట్లు.

ఆ యువతి ముఖంలో రకరకాల భావాలు కనిపించాయి. గీత అవి చూసి మనసులోనే నవ్వుకుంది.

"ఏమీ లేదు" అందా యువతి అన్యమనస్కంగా.

"చూడు—నీ ప్రియుడు కూడా రాలేదు. మగవాళ్ళను గుడ్డిగా నమ్మకు. పెళ్ళయ్యేవరకూ ఎలాంటి నమ్మకస్థుడినైనా దూరంగానే వుంచు. అనుభవంమీద చెబుతున్నాను" అంది గీత సలహా యిస్తున్నట్లు.

ఆమె అవన్నీ విందో లేదో తెలియదు. కానీ—"సాయంత్రం నువ్వు సంగీతా పార్కుకి వెడతావా?" అనడిగింది గీతను.

"వెళ్ళను. ప్రసాద్ వచ్చేవరకూ నే నిక్కడే ఎదురు చూస్తాను" అంది గీత.

"మంచి కంపెనీ యిచ్చావు. థాంక్స్!" అంటూ లేచిందా యువతి.

గీత నవ్వుతూ — "అప్పుడే వెళ్ళిపోతున్నావేం—కూర్చో!" అంది.

"లేదు—నేను వెళ్ళాలి!" అందామె.

గీత మళ్ళీ తనలో తనే నవ్వుకుంది.

5

సాయంత్రం ఆరింటికి సంగీతా పార్కుకి వెళ్ళి రహస్యంగా గమనించింది గీత.

ఆ యువతి ప్రసాద్‌ను నోరె త్తనివ్వలేదు. అతణ్ణి నానా మాటలూ అంది. దుష్టుడు, దుర్మార్గుడు, నీచుడులాంటి పదాలన్నీ వాడింది. తన అదృష్టాన్ని తనే అభినందించుకుంది. ఏ జన్మలో నో తను చేసిన పుణ్యం ఈ జన్మలో సమయానికి తన్ను ప్రసాద్‌వంటి భ్రష్టుడి పాలబడకుండా రక్షించిందంది.

జరుగుతున్నదంతా గీత చూసింది. మొదట్లో ఆమెకు కాసేపు వినోదంగానే అనిపించింది. తర్వాత ప్రసాద్‌ను చూ స్తే జాలివేసింది. అతడి కసలు మాట్లాడే అవకాశమే రావడంలేదు. అలాంటి అమాయకుడిమీద తానెన్ని నిందలు వేసింది?

ఆ యువతి వెళ్ళిపోయాక ప్రసాద్ దిగులుగా కూర్చుండిపోయాడు.

జరిగిందేమిటో అతడికి తెలియదు. తన ప్రియురాలి అలకకు కారణమతడికి తెలియదు. బహుశా తను పెళ్ళిచూపులకు వెళ్ళిన విషయమామెకు తెలిసి వుంటుందని అతడనుకుంటూ వుండవచ్చు.

ప్రసాద్‌ని ఓదారుద్దామా అనుకుంది గీత. ఆ ప్రేమికులను తిరిగి కలపడానికి తను సాయం చేయాలని కూడా ఆమె అనుకుంది. కానీ ఇలాంటి సమస్య నుంచి తనకు తానై సంబాళించుకోలేనివాడు ప్రేమకు అనర్హుడని కూడా ఆమె భావించింది.

కొద్దిరోజులు చూసి అప్పుడు తను రంగప్రవేశం చేయాలనుకుందామె. ఎందుకంటే ఆమెలో యిప్పుడు తప్పు

చేసిన అనుభూతి కూడా వుంది. మనసారా ప్రేమించుకున్న ఓ జంట కేవలం తన కారణంగా విడిపోతోంది....

అప్పుడామెకు రాంకుమార్ గుర్తుకు వచ్చాడు.

అతడి గతి ఏమయిందో? తనకు తెలిపిన తప్పును స్త్రీ అంత సులభంగా క్షమించలేదు. ఆ యువతి స్థానంలో జ్యోతి.... ప్రసాద్ స్థానంలో రాంకుమార్....

అయితే రాంకుమార్‌కు జ్యోతి తనపై ఎందుకు తిరగబడుతోందో తెలుసు. అయితే మాత్రం అతడికి మాట్లాడే అవకాశం రావాలిగదా!

జ్యోతి రియాక్షన్‌మీద గీత కాస్త వుంది. అనుకున్న ఫలితం సాధిస్తే మరో వందరూపాయలిస్తా నన్నాడు రాంకుమార్ ఆమెతో.

ఆ రోజు కింక చేయగలిగిందేమీ లేదు. మర్నాడామె రాంకుమార్ ఆఫీసుకు ఫోన్ చేసింది.

"హలో—గీతా! థాంక్యూ వెరీమచ్ ఫర్ దీ కాల్. సాయంత్రం మనం కలుసుకుందాం — ఎప్పటిలాగే!" అన్నాడు రాంకుమార్.

ఎప్పటిలాగే అంటే అశోకా హోటల్లో అతడు తన కోసం రూం బుక్ చేసి వుంచుతాడు.

సాయంత్రం ఆమె హోటల్లోని తన రూముకు వెళ్ళి రాంకుమార్ కోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

అన్నకంటే అరగంట ఆలస్యంగా వచ్చి సారీ చెప్పుకున్నాడు రాంకుమార్. అతడి ముఖం సంతోషంతో వెలిగిపోతోంది.

"నాకు బహుమతి గ్యారంటీ" అనుకుందామె. అయితే సాధించబడిన ఫలితమేమిటో ఆమెకు తెలియదు.

రాంకుమార్, ఆమెకు ఎదురుగా కూర్చుని "మిస్ గీతా

నువ్వు నాకు మహోపకారం చేశావు. ప్రేమను అలక్ష్యం చేయబోయిన నా కళ్ళు తెరుచుకున్నాయి. అందుకు కారణం నువ్వు" అన్నాడు.

"ఏం జరిగిందో చెప్పు" అంది గీత.

"జ్యోతి—మనిషి ఎంత అందమైనదో మనసుకూడా అంత అందమైనది. ధన లోభంతో ఆమెను పోగొట్టుకోకుండా నువ్వు కాపాడేవు."

"ఏం జరిగింది?"

"జ్యోతి నిన్న నన్ను కలుసుకుంది...." అని ఆగాడు రాంకుమార్.

ఇంతకాలం జ్యోతి అతడికి దూరంగా వుండడమేకాక పెళ్ళిగురించి కూడా తేల్చి చెప్పడంలేదు మనం ఒకరి నొకరు బాగా అర్థం చేసుకోవాలి—అంటూండేదామె. నిన్నటి దినం ఆమె—రాంకుమార్‌ని వివాహం చేసుకుందుకు నిర్ణయించుకున్నట్లు తేల్చి చెప్పింది.

"చూడామె ఎంత గొప్పదో! నాగురించి చెడుగా వినగానే రవంతకూడా చలించలేదు. ఆ ప్రసక్తి నా వద్ద తీసుకుని రాలేదు. నా అనుమానం ఆమె నా ట్రిక్కు తెలుసుకుందని!" అన్నాడు రాంకుమార్.

"అసలు నువ్వామెను పోగొట్టుకునే ప్రమాద మెందుకుంది?"

రాంకుమార్ నవ్వి తన ప్రేమకథను చెప్పాడు.

ప్రేమ అనే సెంటిమెంటు పెళ్ళికి దారితీస్తుంది. పెళ్ళి అంటే ఇద్దరపరిచితులు జీవితకాలం కలిసి జీవించాలి. అందుకే ప్రేమలో ఎప్పుడూ ఆల్టర్నేటివ్ వుండాలి ఒకరిని ప్రేమించి దెబ్బతింటే దిగాలుపడిపోకుండా ఆల్టర్నేటివ్‌గా

మరో ప్రియురాలుండాలి. ఇద్దరిలో ఒకరి నేస్నుకోవాలి.

రాంకుమార్ జ్యోతిని ముందు ప్రేమించాడు. ఆమెకు ఆల్టర్నేటివ్‌గా ఆమె స్నేహితురాలు చందనను కూడా ప్రేమించాడు. జ్యోతికి అందం మాత్రముంది. చందనకు అందంతోపాటు ఆస్తి కూడా వుంది. చందనవి విశాల భావాలని అతడి అభిప్రాయం. కానీ నిన్నటి దినం ఆమె అతణ్ణి లేనిపోని అనుమానాలతో వేధించింది. లాయర్లా ప్రశ్నలు వేసి అతడి శీలం మంచిది కాదనీ, కాల్‌గర్ల్స్‌తో తిరుగుతాడనీ ఋజువు చేయబోయింది.

రాంకుమార్ తన జేబులోంచి ఓ పర్స్ తీశాడు. అందులోంచి ఓ ఫోటో తీసి క్రింద పారేసి—"ఇకమీదట నా పర్స్‌లో రెండు ఫోటోలకు స్థానంలేదు. జ్యోతి ఫోటో మాత్రమే ఇందులో వుంటుంది" అన్నాడు.

గీత అప్రయత్నంగా క్రిందపడిన ఫోటో చూసింది. దాన్నామె చేతులోకి తీసుకుని—"నువ్వు పారవేసిన ఫోటో ఎవరిది?" అంది.

"చందనది!" అన్నాడు రాంకుమార్.

"చందనదా!" అందామె ఆశ్చర్యంగా. ఆమెనే తను జ్యోతిగా భావించి పార్క్‌లో రాంకుమార్‌కు వ్యతిరేకంగా మారిపోయింది. తనవల్ల అలాంటి పొరపాటెలా జరిగింది?

జ్యోతి యింట్లోంచి బయటకు వచ్చిందామె. ఆ కారణంగా తనామెను జ్యోతిగా భావించింది. బహుశా చందన జ్యోతి యింటికి వెళ్ళివుంటుంది.

రాంకుమార్ జ్యోతిని పరీక్షించాలనుకున్నాడు. తను చందనను పరీక్షించింది. చందన పరీక్షలో ఓడిపోయింది.

"జ్యోతి ఫోటో చూడనీ!" అంది గీత.

రాంకుమార్ ఆమెకు జ్యోతి ఫోటో చూపించాడు.

తెల్లబోయింది గీత. జ్యోతి అంటే ప్రసాద్ ప్రియురాలు. చిలిపితనానికి తను ఆమెలో ప్రసాద్‌కు వ్యతిరేకంగా భావాలు ప్రవేశపెట్టింది.

అసలేం జరిగి వుంటుంది?

చందన జ్యోతి ఇంటికి వెళ్ళింది. ఏదో ప్రోగ్రాం వేసి వుంటుంది. అయితే జ్యోతి ప్రసాద్‌ను కలుసుకోవలసి వుంది. అనారోగ్యంవంక పెట్టి ఆమె చందనను పంపివేసి వుంటుంది. అందుకే గుమ్మందాకా కూడా రాలేదు. తర్వాత ఆమె పార్క్‌కు వచ్చింది తన కబుర్లు వింది.

రాంకుమార్‌లాగే జ్యోతికూడా ప్రసాద్‌ను ఆల్టర్నేటివ్ ప్రేమికుడిగా వుంచుకుంది. ప్రసాద్ గురించి తెలియగానే రాంకుమార్‌పై ఆమెకు గౌరవం పెరిగింది.

డబ్బిచ్చి కాల్‌గర్ల్‌ని గదికి తెచ్చుకుని ఆమెను తాకనైనా తాకని రాంకుమార్—తండ్రి మాటలకు భయపడి ఇతర స్త్రీలను పెళ్ళిచూపులు చూడ్డానికి వెళ్ళే ప్రసాద్‌కంటె—జ్యోతికి తగిన వరుడు.

గీత ఓ జంటను విడదీసింది. అందుకామెకు విచారంగా లేదు.

రాంకుమార్ జ్యోతి పరీక్షలో నెగ్గిందనుకుంటున్నాడు.

జ్యోతి తన ఆల్టర్నేటివ్ ప్రియుడు మోసగాడనుకుంటోంది.

ఏమైతేనేం—ఆ జంట ఒకరికొకరు దగ్గరయ్యారు. అదీ తన కారణంగా!

గీత జరిగిందేమిటో రాంకుమార్‌కి చెప్పదల్చుకోలేదు!

□

సిండికేట్ గేమ్

నీలా

మూర్తి కళ్ళు కోపంతో మండిపోతున్నాయి.

అప్పుడు సమయం రాత్రి పదిగంటలు దాటుతోంది.

కడుపులో ఆకలి దహించుకుపోతోంది. ఇంకా స్నానం చెయ్యలేదు. స్నానం చేయాలనిపించటంలేదు. అర్జెంటుగా కడుపులో ఏదో ఒకటి పడాలి. లేకుంటే భరించలేడు.

అలాంటి సమయంలో అక్కడ యుద్ధం జరుగుతూంది.

"ఇలా అయితే నేను పుట్టింటి కెళ్ళిపోతాను." అంది రెండోసారి మూర్తి భార్య.

"నువ్వు పదేపదే చెప్పాల్సిన పనిలేదు. నువ్వు వెంటనే వెళ్ళినా నా కభ్యంతరం లేదు."

"అంటే....అంటే?" అందామె ఆవేశంగా.

"లేకపోతే ఏమిటి ఇంటికి రాగానే నాస"

"నాది నాసా? ఇప్పుడు టైమెంతయింది. రాత్రి పది గంటల దాకా మీ ఆఫీసు పని చేస్తుందా? నాకు తెలియదను కుంటున్నారా? అయిదు దాటితే అయిదు నిముషాలుండరు. మరిప్పటిదాకా ఏం చేస్తున్నారు?"

"పనుందని చెప్పాను"

"ఈ రోజేనా? వారం రోజులనుండి రాత్రి పదిగంటల దాకా పనేనా?"

మూర్తికి ఆకలి కరకరలాడుతూంది.

"ఏమిటి నీ వుద్దేశ్యం."

"వేరే చెప్పాలా? లక్షణంగా పేకాడి వస్తున్నారు."

"లేదు ఏజీ....నాకు నిజంగానే పనుంది" అను నయంగా చెప్పబోయాడు.

"ఊరుకోవయ్యా, నీ సంగతి నాకు తెలియదా! ఈ కొంపలో నేనింక ఒక్కక్షణం కూడా ఉండదలుచుకో లేదు. అర్ధరాత్రి కొంపకొస్తున్నావ్. ఊరికి మూలగా ఈ కొంపలో పలకరించే దిక్కుందా? ఏ దొంగ వచ్చినా తల పగలగొట్టి అన్నీ మూటకట్టుకెళ్ళినా దిక్కూ మొక్కూ లేదు. నువ్వు పేకాడి సంపాదించ నవసరంలేదు. నీ పేకాట్తోనే సంసారం గడుస్తుందా" ఆవేశంతో ఆమె ఎగిరెగిరి పడుతూంది.

ఈ నడుమ వారంరోజులనుండీ రోజూ ఇంటికొచ్చే సరికి పది గంటలు దాటుతూంది. ఈ వారంలోనే రెండు సార్లు సినిమా ప్రోగ్రాం కాన్సిల్ చేసుకోవల్సి వచ్చింది. అదీ ముందుగా అనుకొనికాదు. విజ్జిమాత్రం తయారయి మూర్తికోసం ఎదురుచూస్తుండేది. ఆ రెండుసార్లు పెద్దగా కొంచెంసేపు అలిగింది.

చూస్తుంటే ఇదో రోజువారీ కార్యక్రమంలా తయారయేట్లుంది. విజ్జి గ్రాడ్యుయేట్. అందులోనూ మొదటి తరగతి సాధించింది. ఆమెకు ఆఫీసుల గురించి తెలియని విషయాలేం లేవు. ఏవో కొన్ని డిపార్టుమెంట్సులో తప్పించి వాళ్ళెంత కష్టపడి పనిచెయ్యగలరో కూడా తెలుసు.

విజ్జిలో కొంత అమాయకత్వం వున్నా, తెలివిగలది. ఆమె తెలివితేటల్ని అంగీకరిస్తూ ఆమె అమాయకత్వాన్ని వాడుకోవటంలో నేర్పరితనం మూర్తిది. ఏమాత్రం తొందరపడకుండా ఆమెను తన దారిలోకి తెచ్చుకోవటం అతని ప్రత్యేక లక్షణం.

ఈరోజు మూర్తి సరైన మూడ్‌లో లేకపోవటానికి కారణం ఆకలి ఒకటేకాదు. పేకాటలో ఇరవై రూపాయలు పోయాయి. అయినా అంత బాధపడేవాడుకాదు. మొదటినుండి లాస్ట్‌లోవుండి చివర్లో కొంట్లిచ్చాడు. వాళ్ళు ఆడేది 'సిండికేట్'. మొత్తం రెండువందల ఏభై ఒక్క పాయింట్లకు గేమ్. నోటిదగ్గరదాకా వచ్చింది పోవటంతో ఇంకా ఆ ప్రభావంలోనే వున్నాడు. అలాంటిది ఇంటికి రాగానే ఆమె తిరగబడటంతో సహనం కోల్పోయాడు.

"నువ్వు ఎక్కువ మాట్లాడుతున్నావు. మైండ్ యువర్ లిమిట్స్" అన్నాడు కఠినంగా.

"అలాగా. నా లిమిట్స్ గురించి చెప్పేవరకొచ్చిం దన్నమాట. బట్ యూనో మిస్టర్ లిమిట్సార్ నాట్ ఒన్ సైడెడ్. నీ లిమిట్స్ నువ్వు గుర్తుంచుకుంటే ఈ గొడవలు రావు."

"పిచ్చిగా వాగితే పళ్ళు రాల్తాయి."

"రాలగొట్టు. చూస్తాను."

"ఏదీ మరోసారి కుయ్యి. చెబుతా."

"వందసార్లంటాను. నువ్వు పేకాడుతున్నావు. పేకాడుతున్నావు"

'ఫట్'మంటూ చెంపమీద పడింది దెబ్బ.

ఆ విసురుకు దూరంగా పడింది. కొంచెంసేపు ఏం జరిగిందో తెలియలేదు. ఆ తర్వాత దుఃఖం వెల్లువలా వచ్చింది.

మూర్తి సీరియస్‌గా టవలందుకొని స్నానాలగదికి వెళ్ళాడు.

విజ్జికి కొంత ఆవేశం తగ్గింది. ఏం జరిగిందో తలుచుకుంటే భరించలేనంత అవమానంగా వుంది. తనను ఈరోజు కొట్టాడు! ఎందుకు కొట్టాడు? పేకాడవద్దంటే కొట్టాడు. రేపు పేకాడొద్దంటే చంపేస్తాడా? దీనికి మార్గమేమిటి? వెంటనే పుట్టింటికెళ్ళిపోవటమేనా?

ఇంటిదగ్గర ఎందుకొచ్చావంటే ఏం చెప్పాలి? మా ఆయన కొడుతున్నాడని చెబితే నవ్వరూ! పేకాట మాన్పించటం తన చేతకానితనం అంటారు.

మరయితే ఈ అలవాటునుండి తప్పించటం ఎలా? ఈరోజు కొట్టాడు. ఇలానే ఊరుకొంటే మరింత అలుసవుతుంది. మరేం చెయ్యాలి? ఆలోచనలో సతమతమవుతుంది. ఆమె కళ్ళవెంట నీళ్ళు కారిపోతూనే వున్నాయి.

శరీరంమీద నీళ్ళు పడుతున్నాయేగాని అవన్నీ ఆవిరై పోతున్నట్లనిపించింది మూర్తికి. 'ఈ రోజెవరి ముఖం చూశాన్రా భగవంతుడా' అనుకొన్నాడు. పేకాట్లో డబ్బులు పోయాయి. అందులో నెలాఖరు. బాకీ తీసుకుని మరీ ఆడాడు. పైగా ఇంటిదగ్గర ఈగొడవ. కొంపదీసి బట్టలు సర్దుకుంటుందేమో? అందరూ తనని ఊస్తారు.

పెళ్ళికిముందే మిత్రులు హెచ్చరించారు. 'ఒరేయి బాబూ, గ్రాడ్యుయేట్ పెళ్ళాన్నిమాత్రం వద్దురా. ఆమె నువ్వు చెప్పినట్లు వినదు' అంటూ. శుభ్రంగా ఏ పల్లెటూరి అమ్మాయినో చేసుకుంటే తనకిలాంటి తలనొప్పి ఉండేది కాదు. అయినా ఇప్పుడనుకొని ఏం లాభం?

మూర్తికి పెళ్ళయి నాలుగు సంవత్సరాలు కావస్తుంది. ఇంతవరకూ పిల్లలులేరు. అందుకే ఆమెకు వేరే కాలక్షేపం లేదు. మూర్తి లేనప్పుడు కొంచెంసేపు టి వి. చూస్తుంది. కొంచెంసేపు టేప్ వింటుంది. అయినా బోర్. ప్రక్కవాటాలవారంతా ఏడుగంటలు దాటితే మాట్లాడరు. అందుకే ఆమె వంటరితనాన్ని భరించలేకపోవటం!

స్నానం చేశాక కొంత ఫ్రెష్‌గా ఉందనిపించింది. విజ్జిని కొట్టి తప్పుచేశాననుకున్నాడు. ఆ క్షణంలో ఓ నిర్ణయానికొచ్చాడు. రేపటినుండి పేకాట బంద్. ఛస్తే ఆడకూడదు. అంతగా అయితే ఏ ఆదివారాల్లోనో ఉదయం నుండి కూర్చోవచ్చు. రేపు అయిదవగానే ఆఫీసునుండి సరాసరి ఇంటికొచ్చెయ్యాలి.

స్టాండ్‌మీదున్న లుంగీ అందుకొన్నాడు. విజ్జి ఇంకా ఏడుస్తూనే ఉంది చెంపలమీద తన వేలిముద్రలు కూడా పడుండవచ్చు మొఖం కందిపోయింది

ఏం మాట్లాడకుండా వెళ్ళి టేప్ ఆన్‌చేశాడు. మధుర

మైన సంగీతం వినబడుతూంది. టేబుల్ దగ్గర కెళ్ళాడు. అన్నీ తయారుగా న్నాయి. పడ్డించుకు తినటం ప్రారంభించాడు.

విజి అంతకుముందే భోజనం చేసింది.

కపిగా చూస్తుంది పోయింది.

భోజనం పూర్తయింది. లేచివచ్చి పుస్తకం తీసుకున్నాడు. కొంచెంసేపు పేజీలు తిరగేసి లైటు ఆఫ్ చేశాడు. గదంతా అంధకారం అలుముకొంది. నిద్ర పోవాలని తీవ్రంగా ప్రయత్నం చేశాడు. అది సాధ్యపడటంలేదు.

ఇంగ్లీషులో ఓ సామెత ఉంది. భార్యాభర్తల ఏ తగాదా అయినా పడకగదిలో తీరిపోతుందట. మూర్తి లేచి వెళ్ళి ఆమెను బలవంతంగా ఎత్తుకొని ప్రక్కమీద పడుకోబెట్టాడు.

"ఛా....పో....నన్ను ముట్టుకోవద్దు" అంది విసిరికొడ్తూ.

"పోతానన్నావుగా. ఇంకా ఉన్నావే."

"పోతానో లేదో చూద్దువుగానిలే."

"అబ్బో పౌరుషం."

"లేకపోతే నువ్వు కొడితే పడుండటానికి నేనేం గతి లేనిదాన్ని కాదు."

"అంటే నీ ఇష్టంవచ్చినట్లు ఏమైనా అంటావన్న మాట."

"తమరు చేస్తున్న పనుల కెవరైనా అంటారు."

"అయితే మాకింక బయట పనులుండకూడదు. ఇరవై నాలుగు గంటలు నీ దగ్గర కూర్చుని భజన చేయాలన్న మాట."

"నువ్వు భజన చేయవద్దు. మీ ఆఫీసులో వారంతా

పదింటిదాకా వుంటున్నారేమో. వెళ్దాం పదండి" అంది విజ్జి.

"నువ్వు నన్ను రోడ్డుమీదికి తెచ్చేట్టున్నావే"

ఆ మాటలతో విజ్జీకి నవ్వొచ్చింది. అయినా బలవంతంగా ఆపుకొంది.

మూర్తి ఆమెను పొదివి పట్టుకున్నాడు

"నన్ను వదలండి"

మాట్లాడకుండా ఆమెను ఆక్రమించుకుంటున్నాడు.

"పేకాట" అంటోందామె.

"ఇంకేం పేక. ఈ జీవితంలో లేదు" అన్నాడు మూర్తి.

2

"అబ్బా, ఈ పేకాట సంగతేమోగాని రాత్రంతా ఒకటే గొడవ" అన్నాడు మూర్తి.

"ఏమయింది మళ్లీ" అన్నాడు రెడ్డి.

రెడ్డి ఈ నడుమే హైదరాబాద్ నుండి వచ్చాడు. తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నాడు. ఏ క్షణం అయినా ఆర్డర్లు రావచ్చు. అందుకే ఇంకా కుటుంబాన్ని అక్కడే వుంచాడు. సాయంకాలం అయిదవగానే 'టేబులుందా' అంటాడు. మొత్తం ఆరుగురుంటే ఫుల్ టేబుల్ క్రింద లెక్క. రోజూ నలుగురుతోగాని ముగ్గురుతోగాని ఆట నడుస్తుంది. ఆ ముగ్గురిలో మూర్తి తప్పనిసరిగా వుంటాడు.

"ఏమయిందని చెప్పమంటావ్. గోల. గోల. నిన్న నువ్వు వాయించావ్. ఇంటిదగ్గర ఆమె వాయించింది"

"అంటే రాత్రి భోజనాలు లేవన్నమాట."

"ఏదో చేశాంలే"

"అదేంది భయ్. ఏదో కహాని చెప్పాల"

"అన్నీ కహానీలు అయిపోయాయి. ఇంక మనమేం చెప్పినా నమ్మరు. ఇంటికెళ్ళానంటూ కూర్చొంది."

"పంపించక పోయినవ్ మల్లా, రాత్రంతా కూర్చొనే వోల్లం"

"నీకేం రెడ్డిసాబ్. నీ పెళ్ళాం పిల్లలు లేరుగా."

"అయితే ఈరోజు బందా" అన్నాడు రెడ్డి.

"అవును" అన్నాడు మూర్తి.

సాయంకాలం అయిదుగంటలయింది.

అప్పటికే అంతా లేచి నిలబడ్డారు.

"క్యా రెడ్డీ సాబ్ ...ఆజ్ టేబుల్ హై, నై" అన్నాడు ఇస్మాయిల్.

"ఏమట్లడిగినవ్"

"ఈరోజు లేదనుకొంటున్నాం."

"అదేంలేదు"

"మూర్తి వస్తున్నాడా?"

"ఎందుకు రాడు మల్లా."

"ఏం మూర్తీ."

"లేదుగురూ. డబ్బులు లేవు."

"డబ్బులేకుంటే అడ్గరాదయ్యా. ఎంతకావాలి"

"పది రూపాయలివ్వు"

రెడ్డి పది కాయితం అందించాడు.

"ఇంటిదగ్గర గొడవ అవుతుంది భయ్. ఒకే ఆట. ఏడు గంటలకల్లా వెళ్ళిపోదాం" అన్నాడు మూర్తి.

అంతా కలిపి రూంకెళ్ళారు. ఆ రూం చాలా విశాలంగా ఉంటుంది. రెడ్డి, రాఘవరావు, ఇస్మాయిల్ కాక ప్రసాదరావు కూడా ఉంటున్నాడు. ప్రసాదరావు ప్రమోషన్ మీద వచ్చినా వెంటనే వెళ్ళిపోతాడు. రాఘవరావుకు, ఇస్మాయిల్‌కు

ఇంకా పెళ్ళికాలేదు. సాయంకాలం అక్కడ తిరిగ్గా ఆడు కున్నా ఎలాంటి ఇబ్బందిలేదు. ఆ ఇంటి ఓనరుగారు వేరే ఊర్లో ఉంటూ అద్దెకోసం మాత్రం వస్తుంటాడు.

అంతా మొఖాలుకడిగి, లుంగీలుకట్టి సిద్ధమయ్యారు. ఆట మొదలయింది. చివరికొచ్చేసరికి మూర్తి, రెడ్డి మిగి లారు.

"ఏం భయ్ పంచుకొందామా" అన్నాడు.

"నై. కేల్" అన్నాడు రెడ్డి

తిరిగి ఆటవేశారు. మూర్తిది డీల్షో. మొత్తం ముప్పై రూపాయలొచ్చింది. సాధారణంగా అక్కడ పూర్తిమొత్తం రావటం జరగదు. అందులో ఎవరో ఒకరు పంచుకుంటారు.

"అరే ఏం భయ్ నీది పాస్టుగున్నది" అన్నాడు రెడ్డి.

"ఇంకో ఆటవేద్దాం" అన్నాడు ఇస్మాయిల్.

హాండ్ రైజింగ్‌లో ఉండటం అనేది పేకాటలో ఓ అనుకూల అంశం. అలాంటప్పుడు సాదారణంగా ఎవరూ వెళ్ళరు. అందులోనూ బలహీనత కలిగిన మూర్తిలాంటి వారు అసలు కదలరు. తిరిగి ఆట మొదలయింది. రెండో ఆట పూర్తయ్యేసరికి టైం చూసుకున్నాడు. తొమ్మిదిన్నర! ఆదాయం ఇరవై రూపాయలు!

"నిన్నపోయింది వచ్చింది భయ్" అన్నాడు లేస్తూ.

"నీ హాండ్ రైజ్‌లవుంది."

"ఏం ఉందో....ఇంట్లోగోల ...గోల" అంటూనే కట్టుకున్న రాఘవరావు లుంగీ ఉండచుట్టి విసిరి, బట్టలు తొడుక్కొని సైకిలుమీద విసురుగా బయలుదేరాడు.

"ఈ రోజుకూడా గొడవే....భ" అనుకొన్నాడు.

అంతా బిగ్గరగా నవ్వారు.

3

ఆఫీసుకు మామూలుగానే వచ్చాడు మూర్తి.

అందరూ తాము ఏ కథ వినాల్సివుంటుందో ఊహించు కొంటూ తయారయివున్నారు. మూర్తిలో ఓ విశేషం ఉంది. తన ఇంటిదగ్గర విషయాల్ని దాపరికం లేకుండా చెబుతాడు. సెక్స్ దగ్గరనుండి ఆమె తిట్టే తిట్లదాకా!

రెడ్డి కొంచెంసేపు చూసి ఇక ఆగలేకపోయాడు.

"అరె ఏంది భయ్ చప్పుడు సేయవు. రాత్రి తిన్నావా" అన్నాడు.

మూర్తి ఒక్కసారిగా నవ్వాడు.

"ఎందుకు భయ్ ఆ నవ్వు"

"రాత్రి భలే విచిత్రం జరిగింది రెడ్డి ఇంటికి వెళ్లాను. సైకిల్‌స్టాండ్ వేశా. ఫస్ట్‌డైలాగు 'అప్పు నీ దండకం తెర వొద్దు కొంచెం విను' అన్నా. మొఖంలో సారోఫుల్ ఎక్స్‌ప్రెషన్స్. మన మేనేజర్‌గారి మిసెస్‌కు గుండె దడ జబ్బుందని, నిన్న అకస్మాత్తుగా వస్తే హాస్పిటల్‌కు తీసు కెళ్ళాల్సివచ్చిందని, పిలైన్‌బాటిల్స్ ఎక్కిస్తున్నారు. ఇప్పటిదాకా అక్కడే ఉండొస్తున్నాను అన్నా."

"నమ్మిందా"

"నమ్మటం ఏమిటి. తిరిగివెళ్ళి చూపిరమ్మని కూర్చుంది. ఆమె వరసచూస్తే వెంటనే హాస్పిటల్‌కు బయలుదేరమనే ట్లుంది. మనం రాత్రంతా టేబుల్ వేద్దామంటే వచ్చే వాడ్ననుకో. ఎలా వుంది. ఫర్వాలేదా అంటూ గోల" అన్నాడు నవ్వుతూ.

"అట్లెందుకు చెప్పావ్" అన్నాడు రెడ్డి.

"మరేం చెయ్యమంటావ్"

"ఆ మన పెండ్లవే దొరికిందా, ఇంకెవరు లేరా?"

మూర్తి ఓ క్షణం ఆలోచించాడు. అదీ నిజమే. యాదృచ్ఛికంగానైనా మూర్తి అలా చెప్పటానికి ఓ కారణం వుంది. మేనేజర్‌గారి భార్యకు నిజంగానే ఆ బలహీనత వుంది. ఆమె ఆరోగ్యం అంత మంచిదికాదు. ఏ విషయమయినా హఠాత్తుగా వింటే భరించలేక కూలిపోతుంది. తలనుండీ మొదలయి కాళ్ళదాకా చెమటలు పుట్టుకొస్తాయి. ఆమె పడిపోయిందంటే మూడు సిలైన్‌బాటిల్స్ రెండు రోజులు హాస్పిటల్ తప్పదు.

తనకు ఆరోగ్యం బాగుండని కారణంగా ఆమెకు అనుమానం ఎక్కువ ఆయన ఎక్కడన్నా తిరిగొస్తున్నారేమోనని. ఆ మహానుభావుడి కలాంటి అలవాటులేదు. అయినా ఆమె వెయ్యి కళ్ళతో కనిపెడుతుంటుంది. మేనేజర్‌కు ఓ విషయంలో బలహీనతవుంది. ఎప్పుడయినా హాట్ డ్రింక్స్ సేవించటం. దాంతో నాన్‌వెజిటేరియన్ జతచేసుకు తినటం. వారిది సాంప్రదాయక బ్రాహ్మణకుటుంబం. పార్టీల్లో అలవాటయిన వ్యవహారం.

సాధారణంగా ఆమె ఊర్లోలేనప్పుడు తాను వేరే ఊరు వెళ్ళినప్పుడు మాత్రం తన కోర్కె తీర్చుకుంటుంటాడు.

మూర్తి సరదాకు చెప్పాడేగాని, అదే తన కొంప ముంచుతుందని ఊహించలేకపోయాడు.

"అదేందిర భయ్.. లీవ్‌కోసం ఎవరెవర్నో సంపుతుంటవ్ మల్లిగిట్లనాచేసేది" అన్నాడు రెడ్డి నవ్వుతూ.

మూర్తి తిరిగి ఓ విశేషం చెప్పాడు.

"ఓ రోజు మేనేజర్ పిలిచి అడిగాడు రెడ్డి. ఎంతమంది ముసలి వారున్నారయ్యా అంటూ. సార్ మా తాతకు మూడు పెళ్ళిళ్ళు జరిగాయండి అన్నా" అన్నాడు.

"ఏమన్నడు."

"ఏమంటడు. సిల్లీ ఫెలో అనుకొని కాంషన్ చేశాడు" మొత్తంమీద 'టేబుల్' సభ్యులందరికీ ఈ వార్త ప్రాకి పోయి ఆనందించేరు. అయితే ఆరోజే పేకాటకు ఆశ్చర్య కరంగా తెరపడింది. రెడ్డికి, ప్రసాదరావుకు హైదరాబాదుకు ట్రాన్స్ఫర్ ఆర్డర్స్‌వచ్చాయి. రాఘవరావుకు వివాహం సెటిలయింది. ఇస్మాయిల్‌ను ఆ రోజే చర్చల నిమిత్తం ఎవరో ఆహ్వానించారు.

ఒక్కసారిగా ఇలా 'టేబుల్' విచ్ఛిన్నమై పోగలదని ఎవరూ భావించలేదు. చివరి ఆట ఆ రోజే ఆడారు. మూర్తికి మేనేజర్‌గారి భార్య పుణ్యమా అంటూ ఆ రోజు గడిచిపోయింది. ఆ మరుసటి రోజునుండి ఆ బాధ లేదు.

4

సినిమాహాల్లో కూర్చొన్నారు మూర్తి, విజ్జి.

ట్రైలర్ నడుస్తూంది. సీటింగ్ నంబర్ ఇచ్చారు. ఇంతలో ఎవరో వచ్చారు.

"ఇఫ్‌యూ డోంట్ మైండ్ కొంచెం ప్రక్కన కూర్చొంటారా" అడుగుతున్నారెవరో.

ఆయన ప్రక్కన ఓ యువతి నిలబడి వుంది.

"ఈ కంఠం ఎక్కడో విన్నట్లుందే" అనుకున్నాడు. మరుక్షణం గుర్తించేశాడు.

"నేను సార్ మూర్తిని"

"ఓ! నువ్వటయ్యా"

"విజ్జీ ఇవతలకురా" అన్నాడు.

ఆమె ప్రక్కకు జరిగింది.

ఇప్పుడు మూర్తి ప్రక్కన విజ్జి, ఆమెప్రక్కన మేనేజర్ గారి భార్య, ఆమె ప్రక్కన మేనేజర్‌గారు ఎడ్జస్టయ్యారు.

"మూర్తని మాకొలీగ్" గొణిగాడాయన.

"క్వాలీగా" అందామె.

"అబ్బే....మార్క్లుర్క్" సర్దుకొన్నాడు.

ఆమె రెండుచేతుల్నీ తన సీటు రెండువైపులా వేసింది.

విజ్జి చేతులు ముడుచుకొంది.

సినిమా మొదలయింది.

ఇంటర్వెల్. హాల్లో లైట్లన్నీ వెలిగాయి.

విజ్జీ ఆమెను పరిశీలనగా చూసింది. ఆమె కూడా పలకరింపుగా నవ్వింది.

"పిక్చర్ బోర్‌గావుంది కదూ" అందామె.

"అంత బాగుండలేదు" జవాబిచ్చింది విజ్జి.

ఆమె తన భర్తకేసి తిరిగింది.

విజ్జి మూర్తితో "కూల్ డ్రింక్స్ తీసుకురండి" అంది.

"లోపలికి ఎలా చెయ్యరు."

"అదే కక్కుర్తి. తీసుకురండి" అంది మెల్లగా.

"లేచి బయటకురండి" అన్నాడు అంతే మెల్లగా లేస్తూ. అదే సమయంలో మేనేజర్‌గారు కూడా లేచి బయటకు వెళ్ళాడు.

అప్పుడామె విజ్జికేసి తిరిగింది నవ్వుతూ.

ఏం మాట్లాడాలో అర్థంకాలేదు.

అప్పుడు అకస్మాత్తుగా గుర్తొచ్చింది.

"ఇప్పుడు మీ ఆరోగ్యం బాగుందా?" అంది.

"బాగానే ఉందండి" అంది నవ్వుతూనే.

అంతలోనే నవ్వు ఆగిపోయింది.

"ఇప్పుడంటున్నారేమిటి?"

"ఈనడుమ మీకు సీరియస్‌గావుంటే హాస్పిటల్లో చేర్పించారట కదా."

"ఎప్పుడు" అందామె గుర్తుకు తెచ్చుకుంటూ.

అదామెకు సహజమయిన విషయమే.

"పదిహేనురోజులవుతుంది."

పదిహేనుకాదు నెలరోజుల నుండి ఆమె హాస్పిటల్‌కు వెళ్ళలేదు.

"మీకెవరు చెప్పారు" అందామె.

ఆమె మొఖంలో మార్పుచూసేసరికి అనవసరంగా కదిలించానే అనుకొంది విజ్జి.

"మావారే చెప్పారండి. మీరు పడిపోతే మా వారు కంగారుపడి హాస్పిటల్‌లో చేర్పించి, సిలైన్ బాటిల్స్ ఎక్కించి—పాపం వారు రాత్రంతా మేల్కొనే ఉన్నారట. నేను హాస్పిటల్‌కు రావాలనుకొన్నానండి. ఈలోపు ఇంటికి తీసుకువెళ్లారన్నారు" అంది కొంత మేకప్ చేస్తూ.

ఆమె ఆలోచన ఇక్కడలేదు.

సరిగ్గా పదిహేను రోజుల క్రితం ఆయన ఇంటికి ఆలస్యంగా వచ్చారు అప్పుడు తనెంత నిద్రలో ఉందంటే పిల్లలే తలుపుతీస్తే ఆయనవచ్చి పడుకొన్నాడు. తెల్లారడిగితే ఏదో కథ చెప్పాడు. అంటే ఆ రోజు ఏం జరిగింది? ఏదో జరిగింది? ఎవరితోనో....ఛీ....ఈ మొగాళ్ళంతే.... తన పట్టునుండి జారిపోతున్నాడు! ఆమె పిడికిళ్ళు బిగుసుకుంటున్నాయి. కళ్లు గుండ్రంగా తిరిగి ఎరుపుగా మారుతున్నాయి.

"మీకు ఖచ్చితంగా డేట్ తెలుసా?" మెల్లగా అన్నా ఉరిమినట్లుంది.

"ఆగస్టు 25" అంది విజ్జి.

అంతకు ముందురోజే తనను కొట్టింది.

అంటే ఖచ్చితంగా ఆరోజే. ఆయన తనను మోసం

చేశాడు. ఆరోజు వాళ్ళంతా ఏదో చేశారు?

అప్పుడు మొదలయ్యాయి తలనిండా చెమటలు. మెల్లగా వణుకుతూ సీట్లోనుండి జారిపోతుందామె.

గేటు కీపర్ని ప్రతిమాలి కూల్‌డ్రింక్స్‌తో వచ్చిన మూర్తి అవాక్కయి చూస్తుండిపోయాడు.

"అయ్యయ్యో" అంటున్నారెవరో.

పరిగెత్తుకొచ్చిన మేనేజర్ మూర్తిచేతిలోని కూల్ డ్రింక్స్ ఆత్రంగా త్రాగేసి "రిక్షా" అనరిచి సీట్లోకూలబడ్డాడు.

ఎవరిని హాస్పిటల్లో చేర్చాలో అర్థంకాలేదు మూర్తికి. అంతలోనే ఆయన తేరుకొని భార్యను లేపి, మూర్తి వాళ్ళ సహకారంతో మెల్లగా క్రిందకు నడిపించుకుపోయాడు.

హాస్పిటల్లో సిలైన్ బాటిల్స్.

తలపట్టుకుని ఓమూల కూర్చుండిపోయాడు మేనేజర్. ఆమెందుకలా పడిపోయిందో ఇద్దరికీ అర్థంకాలేదు విజ్జికి కూడా!

* * *

"అండమాన్ దీవులకు నన్ను ట్రాన్స్‌ఫర్ చేశారు" అన్నాడు మూర్తి కాయితం అందిస్తూ.

"అక్కడ మీ బ్రాంచి లేదుగా" అంది విజ్జి.

"అంటే అంత దారుణమని అర్థం."

"ఎందుకు మీకూ, మేనేజర్‌గారికీ పడటంలేదా?"

"అదేంలేదు. మేం క్లోజ్‌గా ఉంటాం."

"నాకు తెలుసులెండి మీకు ఎవర్తో పడింది కనుక".

"లేదు ఒట్టు" అంటూ ఏదో చెప్పబోయి మానేశాడు.

టేబుల్‌మీద పేక.

"పేకాడుకుందామా" అంది విజ్జి నవ్వుతూ. □

ప్రాణగండము

'సరసి'

"మా అన్నయ్య సబిన్స్పెక్టర్ నాకేం భయం?" అనుకున్నాడు 'ప్రభు' లేని ధైర్యం తెచ్చుకుంటూ.

దెయ్యాలకి సబిన్స్పెక్టరయితేనేం సర్కిలిన్స్పెక్టరయితేనేం? వాటిని భయపెట్టే మంత్రాలు రానంతకాలం ఎవడైనా ఒకటే వాటికి! మాంత్రికుణ్ణి తప్ప ఎవడ్నయినా

సరే పకోడీల్లా నవిలేపి రక్తం తాగేస్తాయి!

'ఆఁ....ఏం కావులే....అసలు దెయ్యాలనేవి లేవని నాన్న ప్రతిసారీ చెబుతూనేవుంటాడు' సమాధానపడ్డాడు ప్రభు. అతడికి తెలియకుండా కాళ్ళు వడివడిగా నడవ సాగేయి.

మనుష్యసంచారం మచ్చుకైనాలేని ఆ అడవిప్రాంతంలో పక్షుల కిలకిలల మధ్య, గుంటనక్కల, కీచురాళ్ళ వికృత రోదనలమధ్య, కారుచీకటిలో బిక్కు బిక్కుమంటూ ప్రయాణం చెయ్యవలసిన అగత్యం పట్టింది ప్రభూకి! ఇంతా చేసి అతడికి పన్నెండేళ్ళు!!

"ఇల్లువెదవని ఒంటరిగా పంపుతున్నావు నీకేవన్నా మతిపోయిందా? నాల్రోజులాగితే హంసవరం వెళ్ళేవాళ్లే దొరక్కపోయారా?" బామ్మ కోప్పడింది నాన్నమీద.

నాన్నకి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా తనే అన్నాడు పెద్దాళ్ళకిమల్లే. "నే నేవన్నా పాలుతాగే పసి వెధవనా—ఏ దొంగలేనావచ్చి ఎత్తుకుపోడానికి? పట్టపగలు ఇక్కడ బస్సెక్కి అక్కడ దిగడానికి! ఏదో అమెరికా లాగా చెప్తావు! అన్నయ్య చూడు ఎంత అర్ధరాత్రయినా సరే ఒంటరిగా స్మశానాలదగ్గరి కెళ్ళిరాగలడు! ఎంత పెద్ద రౌడీలనైనా సరే ఒక్కడూవెళ్ళి చితక్కొట్టేస్తాడు ఆడ పిల్లలాగా భయం గియం అంటూ నేర్పిపెడితే ఎందుకైనా పనికొస్తానా నేనూ?"

అంతే! బామ్మ మరి మాట్టాడలేదు! ఆమె చూపుడు వేలు ముక్కుమీదుంది!

మధ్యాహ్నం రెండుగంటలకి పిఠాపురంనించి తుని వెళ్లే బస్సులో ఉన్నాడు తను. మినప సున్నుండలూ, పూత రేకులూ వేసిన డాల్డా డబ్బాతోబాటు నాలుగుజతల బట్టలు

బ్యాగ్‌లో వేసిచ్చింది అమ్మ. తండ్రివచ్చి జాగ్రత్తలన్నీ చెప్పి బస్సు కదిలేవరకూ ఉన్నాడు.

బస్సు దుర్ముహూర్తాల వేళ బయలుదేరిందో ఏమో అర్థ గంట ప్రయాణమైనా కాకుండానే దారిలో ఆగిపోయి ఇక ముందుకెళ్ళనని మొరాయించుక్కూర్చుంది.

ప్రయాణీకులంతా క్రిందికి దిగిపోయారు.

డ్రైవరు క్ళ్ళీ-డ్రైవరు పట్టుకుని బస్సుకిందికెళ్ళి పడుకున్నాడు. కండక్టరు ఆపరేషన్ చేస్తున్న డాక్టరికి కత్తులందించే నర్సులాగా డ్రైవరుకు పట్టకారా, రెంచీలు సప్లయి చేస్తున్నాడు.

ఇలాచేసి అలాచేసి మొత్తంమీద అయిదింటివాకా కాలక్షేపం చేసి "ఇది ఇక ఇంతే!" అని తీర్పునిచ్చాడు డ్రైవరు.

ఈలోగా కొన్ని బస్సులొచ్చాయిగాని, అవన్నీ ఎక్స్‌ప్రెస్సులట. ఏవీ ఆగలేదు. ఎవరి కర్మ కెవరు కర్తలన్నట్టు కనీసం ప్రయాణీకుల్ని పరామర్శ కూడా చెయ్యకుండా అన్నీ వెళ్ళిపోయాయి.

చివరికెలాగో ఓ బస్సువచ్చి ప్రయాణీకులందర్నీ ఆదుకుంది.

2

బస్సు తేటగుంట చేరేసరికి సమయం ఆరున్నర!

బ్యాగ్ భుజాన తగిలించుకుని బస్సుదిగిన ప్రభుకి సూర్యుడు కనిపించలేదు. అర్థగంటక్రితమే మూటా ముల్లె సర్దుకుని వెళ్ళిపోయిన జాడలు కనిపించాయి ఆకాశంలో. పగలుకి వీడ్కోలుచెప్పి. చీకటి డ్యూటీ కెక్కుతున్న సమయం అవుతోంది

బస్సుదిగిన ప్రదేశానికి హంసవరం సుమారు నాలుగు

కిలోమీటర్లుంటుంది. రెండు కిలోమీటర్ల తర్వాత హంస వరం రైలుస్టేషనూ, రైలుపట్టాలూ కనిపిస్తాయి. అక్కడి కింకా సగందూరం ఉంటుంది ఊరు. అంతా ఇంచు మించు అడవిలాగా ఉంటుంది.

మొదటి సగందూరం కాలిబాట తప్పితే సరైన రోడ్డు కూడా లేదు. దానికితోడు—పగలే మనుషులు కరువైన ఆ మార్గంలో చీకటిపడితే ఇక చెప్పనక్కరలేదు.

అయినా ప్రభూ జంకలేదు. చురుగ్గా అడుగేశాడు ముందుకి. కొంచెం నడిచి మెల్లగా పరుగందుకున్నాడు.

కొండవద్ద మలుపు తిరుగుతూంటే కొన్ని పశువులు ఎదురుగా వస్తూ కనిపించాయి. వాటి వెనుకనే ఓ కొండ జాతి మనిషి!

కుమ్మతాయేమోనని భయపడి దూరంగా జరిగి పశు వులు దాటిపోగానే వెళ్ళబోతున్న ప్రభూని చెయ్యిపట్టుకు ఆపేడు ఆ పశువుల కాపరి.

"ఏయ్ పిల్లోడా ఎక్కడికి? ఏటున్నాయా సంచిలో? ఇట్టాగియ్యి!" సంచి బలవంతంగా లాక్కుని అందులో చెయ్యిపెట్టాడు కొండవాడు.

"ఏయ్ ఎలావుంది వొళ్ళు? ముందిలాగియ్యి ఆ బ్యాగ్! నే నెవర్నో తెల్సా? మా అన్నయ్య హంసవరంలో సబిన్స్పెక్టర్!!" హుంకరించాడు ప్రభు.

అప్పటికే వాడు మినపసున్నుండల డబ్బాతీసి వాసన చూసేశాడు.

"మంచిగుండాయి! మరైతే నే నుంచీసుకుంటా సీ డబ్బ! మంచోడివి నువు తిన్నగెలిపో!"

డబ్బా తీసుకుని ముందుకెళ్ళిపోతున్న ఆ కొండవాడ్ని వెనకనించి గట్టిగా ఓ గుద్దుగుద్ది "నా డబ్బా నాకియ్యి

లేపోతే జాగ్రత్త!" రోషంగా అన్నాడు ప్రభు.

వెంటనే వెనక్కి తిరిగిన ఆ కొండమనిషి పశువుల్ని కాసే కర్రతో ప్రభు వీపుమీద ఒక్కటి తగిలించాడు.

చురుక్కుమన్న ఆ దెబ్బకి ప్రభు కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి.

వాడితో కుస్తీపట్టి డబ్బా తెచ్చుకోవడం తనవల్లకాదు. ఒక పక్క చీకటీ కూడా పడిపోతోంది. ఇంకా నడవవలసిన దూరం చాలా ఉంది.

బ్యాగ్ వీపుమీద వేసుకుని కళ్ళుతుడుచుకుని మళ్ళీ పరుగు ప్రారంభించాడు హంసవరం వైపు.

మెల్లగా కీచురాళ్ళు ఒక్కొక్కటీ రంగప్రవేశంచేసి గొంతుకలు విప్పి బీభత్సరాగంలో గానకచేరీ ప్రారంభించాయి. వేటకి బయలుదేరిన గుంటనక్కలు ఆ కచేరీకి తాళాలు వేస్తున్నాయి. చీకటి చిక్కబడేకొద్దీ కనుచూపు మెరుగవుతున్న గుడ్లగూబలవంటి పక్షిజాతులన్నీ సంతోషంగా కేరింతలు కొడుతూ చెట్లమీద గంతులు వేస్తున్నాయి.

జీడిమామిడి చెట్లకింద ఏపుగా పొదలు పొదలుగా పెరిగిన అనాస దుబ్బుల్లోంచి ఎలకలూ, పందికొక్కులూ నిర్భయంగా అటూ ఇటూ పరుగులుతీస్తూ అప్పుడప్పుడు ప్రభూ కాళ్ళని కూడా పరామర్శిస్తున్నాయి. చెట్ల ఆకుల్లో మెరుస్తున్నవి మిణుగురు పురుగులో లేక తనవైపే తీక్షణంగా చూస్తున్న ఏవైనా జంతువుల తాలూకు కళ్ళో అర్థం కావడంలేదు ప్రభూకి.

నిద్రగన్నేరు లాంటి పెద్దపెద్ద చెట్లమానులకి అల్లుకున్న అడవి పాదులు దయ్యాల్లాగా జడలు విరబోసుకుని ఊగుతూ "దామ్మా....నా దగ్గరకి దా....!" అని పిలుస్తూ

నవ్వుతున్నట్టుగా అనిపిస్తున్నాయి అతడికి.

"నాకేం భయం? మా అన్నయ్య సబిన్స్పెక్టర్!" మళ్ళీ అనుకున్నాడు ప్రభు మనసులో.

కాళ్ళు ఒణుకుతున్నాయి. గుండె చేసే శబ్దం తనకి స్పష్టంగా వినిపిస్తోంది.

"ఆ వెధవ బస్సు చెడిపోకుండా వుంటే తనీపాటికి అన్నయ్యగారింట్లో వుండేవాడు. ఒదిన తనని దగ్గిర కూర్చోబెట్టుకుని వేడివేడిగా ఏ టిఫినో అన్నమో తినిపిస్తూ వుండేది. బామ్మ చెప్పిన మాట విని వూరుకున్నా ఈ బాధ తప్పి వుండేది. ఆ కొంఠ వెధవ ఎంత దెబ్బకొట్టాడూ! అన్నయ్యతో చెప్పి వాడి పని పట్టించాలి!" అనుకుంటూ పరిగెడుతున్న ప్రభూ హఠాత్తుగా కాళ్ళకేదో తగిలేసరికి బోర్లా పడ్డాడు.

అవి రైలు సిగ్నల్ తీగలు! ఎదురుగా రైలుపట్టాలు మెరుస్తూ కనిపిస్తున్నాయి!

జేబులో వున్న చిల్లర డబ్బులన్నీ ఎగిరి కంకరరాళ్ళ మీద పడి చెల్లాచెదురై పోయాయి. చేతికి దొరికిన రెండు మూడు నాణేలు ఏరుకుని పట్టాలుదాటి రోడ్డుకి చేరుకున్నాడు ప్రభు.

హంసవరం స్టేషనుకు వచ్చాననన్నమాట! అంటే ఇంకా రెండు కిలోమీటర్లు నడవాలి. సగందూరం వచ్చే ననుకునే సరికి ప్రభూ కొంత కుదుటపడ్డాడు. కొంచెం ధైర్యం చిక్కింది.

ఎదురుగా ఎవరో ఇద్దరు వ్యక్తులు నడుస్తూ వెడుతున్నట్టు అస్పష్టంగా కనబడేసరికి ఎక్కడలేని ఆనందమూ కలిగి పరుగు పరుగుపరుగున వెళ్ళాడు. కాని వెంటనే నీరు గారిపోయాడు వాళ్ళు మనుషులు కాదు. రోడ్డుకిరువైపులా

తెల్లసున్నం వేసిన చిన్న తూము తాలూకు పిమెంటు అరు గులు.

ఆ క్షణంలో ప్రభూకి ఒక విషయం జ్ఞప్తికొచ్చింది.

ఓ ఎలుగుబంటి ఓరోజు రాత్రివేళ హంసవరం రోడ్డులో ఇద్దరు మనుషుల్ని మెడలు కొరికి చంపేసిందనీ మర్నాడు ఆ శవాల్ని పోలీస్‌స్టేషన్‌కి తీసుకొచ్చామనీ అన్నయ్య పిఠా పురం వచ్చినపుడు చెప్పాడు. అప్పుడప్పుడు చిత్రకొండలూ చిరతపులులూ కనిపిస్తాయని కూడా చెప్పాడు.

ఆ విషయం గుర్తుకురాగానే ప్రభూ గుండెల్లో భయం రెండింత లయింది. ప్రతిక్షణం ఎలుగుబంటో పెద్దపులో ఎదురుగా రోడ్డు దాటుతున్నట్టు అనిపించసాగింది. చెట్టు ఊడలు గాలికి ఊగుతూ ఏవో జంతువులన్న భ్రాంతిని కలుగజేస్తున్నాయి.

ఆ భయంతో ప్రభూ ముందుకి రెండడుగులు వెనక్కి రెండడుగులూ వేస్తున్నాడు. సమయం గడుస్తున్నా దూరం తరగడం లేదు. ఇలా ఎప్పటికి చేరగలడు తను? అసలు ఏ జంతువు బారి పడకుండా ఇంటికెళ్ళగలనా?—రకరకా లుగా ఆలోచిస్తున్నాడు ప్రభు.

ఇంతలో మళ్ళీ ఇద్దరు వ్యక్తులు ముందుగా నడిచి వెడు తున్నట్టు కనిపించింది.

వాళ్ళు నిజంగా మనుషులేనా? లేక ఇందాకటిలాగా పిమెంటు దిమ్మలా? లేకపోతే ఇలా కనిపించి మాయ మవుతూ భ్రమకి గురిచేసి ప్రక్కదారి పట్టించే కొరివి దెయ్యాలా? కొరివి దెయ్యాలయితే వాటి కళ్ళు కాగడా మంటల్లాగా వెలుగుతూ కనిపిస్తాయిటగా! ఉరివేసుకుని చచ్చిపోయిన వాళ్ళంతా కొరివి దయ్యాలై అడివిలో తిరుగు తాయని కథల్లో రాస్తూవుంటారుగా!

గుండె లరచేత బట్టుకుని బిక్కు బిక్కు మంటూ ఒక్కొక్క అడుగు వేస్తూ ముందుకెళ్ళిన ప్రభూకి ఒక్క సారిగా పట్టరాని ఆనందం కలిగింది.

ఆ ఇద్దరూ మనుషులు కారు! సున్నం వేపిన పిమెంటు అరుగులే! కాని ఒకదానిమీద ఎవరో ముసుగు కప్పుకుని పడుకుని ఉన్నారు! ఆ తూముకి దగ్గర్లో చెట్టుకి ఓ సైకిలు చేరవేపి వుంది!!

ఈ మనిషి హంసవరం వాడయి వుంటాడు. సబిన్స్ పెక్టర్ గారి తమ్ముణ్ణని చెప్తే చాలు సైకిలమీద తీపికెళ్ళి విడుస్తాడు. తన కష్టం ఇక గట్టెక్కినట్టే—అనుకుని ప్రభూ ఆ వ్యక్తిని సమీపించి పిలిచాడు.

"ఏవండీ ...ఏవండీ...." తట్టి లేపేడు.

ఆ వ్యక్తి లేవలేదు!

మళ్ళీ పిలిచాడు ప్రభు. అయినా లేవలేదు. దుప్పటీ సగంవరకూ తొలగించి తట్టి పిలిచాడు మరోసారి.

అతడి చేతికి పొడవాటి జుట్టు తగిలింది.

పరీక్షగా చూశాడు. ఆ పడుకున్నది మగవాడు కాదు! స్త్రీ!! చేతికి గాజులున్నాయి కూడా!

ఒక్కక్షణం అచేతనుడయ్యాడు ప్రభు. మగవాళ్ళు ఎవరూ లేకుండా ఎంత నిర్భయంగా పడుకునుంది ఈమె!! ఈ కొండవాళ్ళకి భయాలుండవా?

"ఏవండీ" ఈసారి కొంచెం కుదుపుతూ పిలిచాడు.

చేతికి చల్లగా తగిలిందామె వొళ్ళు!

3

చచ్చిపోయిన వాళ్ళలో రక్త పసారం వుండదనీ, వాళ్ళు చల్లగా వుంటారని అన్నయ్య చెప్పడం గుర్తుంది ప్రభుకి.

వొళ్ళు ఝల్లుమంది! భయంతో గట్టిగా కేక వెయ్య

బోయి నోరు రెండు చేతులతో మూసుకుని నాలుగడుగులు వెనక్కేశాడు.

అంటే ఈమె చచ్చిపోయిందా? శవాన్నా ఇంత రాత్రి వేళ తను ముట్టుకున్నదీ??

శవం ఎలా వొచ్చిందిక్కడికి? సైకిలుమీద వచ్చి ఆత్మ హత్య చేసుకుందా? లేకపోతే ఎవరైనా ఈమెను చంపేసి తెచ్చారా? మరి సైకిలిక్కడే ఉందేమిటీ? మళ్ళీ వస్తాడా?

ఇలా ఆలోచిస్తున్న సమయంలో అతడికి వెనుకవైపు కొంత దూరంలో "కంగు" మని శబ్దం అయ్యింది. గునపం లాంటి పనిముట్టు ఏదో రాతిమీద పడితే ఎలా వినబడు తుందో అలాంటి శబ్దం అది!

ప్రభూకి ఏం చెయ్యాలో తోచలేదు.

ఈమెను చంపిన వాడుగానీ వస్తున్నాడా? ఈ పరిస్థితుల్లో ఇక్కడుంటే తననికూడా చంపేస్తాడు. తన రహస్యం తెలిసిన ఏ వ్యక్తినీ ఎవడూ ప్రాణాల్తో విడవడు. ఇన్స్పెక్టర్ తమ్ముడైనా సరే!

ఆ భావన కలగ్గానే అక్కడే వున్న ఒక చెట్టు చాటుకి పరుగుతీశాడు.

అది సైకిలు చేర్చి వున్న చెట్టు.

భుజంమీద గునపం పెట్టుకుని చేతిలో పారతో, చుట్ట కాల్చుకుంటూ ఓ వ్యక్తి వచ్చి శవాన్ని సమీపించి చుట్ట ఆర్పి పడేశాడు. తర్వాత ఆమెను భుజాని కెత్తుకుని మోసు కుంటూ తీసికెళ్ళి పది గజాల దూరంలో ఉన్న ఓ గోతిలో ఆ శవాన్ని పడేసి సిగరెట్ లైటర్ వెలిగించాడు. ఆఖరి సారి ఆమేను చూసి మట్టి కప్పడం ప్రారంభించాడు.

ఇదంతా గుండె లరచేత బట్టుకుని గమనిస్తున్నాడు చెట్టు చాటునున్న ప్రభు.

శవాన్ని, సైకిల్‌ని ఇక్కడ పెట్టి ఎక్కడికి వెళ్లుం టాడు? ఆ గొయ్యి ఇంతకుముందు తనే తవ్వుకునుంచు కున్నాడా? అయితే బహుశా గడ్డపారా, చేతులూ కడుక్కో డానికి గానీ నీళ్ళకోసం వెళ్ళుంటాడు. తన అదృష్టం బావుండి అతడు లేని సమయంలో తనొచ్చి శవాన్ని నిద్ర లేపడానికి ప్రయత్నించాడు. ఆ సమయంలో అతడుండి వుంటే ఇంకేవన్నా వుందా? ఈ రాజుతో తన పనికూడా ఖతం అయిపోయి వుండేది.

గోతిలో మట్టికప్పడం పూర్తిచేసి ఆకులూ పుల్లలూ ఏరుతున్నాడు దానిమీద కప్పడానికి. తర్వాత వచ్చి సైకిలు తీసికెడతాడన్న మాట! అన్నయ్యకి ఈ సంగతంతా చెప్పి ఈ వెధవని పట్టించాలి. ఈ చీకట్లో వీడి మొహం గుర్తు పట్టడం కష్టంగా వుందే! రేపు ఎలా వీడ్ని గుర్తించడం? ఈ ఘాతుకానికి తనొక్కడే ప్రతక్ష్యసాక్షి! తనుగానీ గుర్తించి పట్టించలేకపోతే ఈ చనిపోయినామెకు అన్యాయం అయిపోదూ?

అతడి బుర్ర వేగంగా ఆలోచించ నారంభించింది.

ఈలోగా అతడు తన పని పూర్తి చేసుకున్నాడు గొయ్యి దగ్గర.

ప్రభు బుర్రలో తళుక్కున మెరిసింది ఓ అద్భుతమైన అయిడియా!

మరుక్షణం వేగంగా, సమర్థవంతంగా, నిశ్శబ్దంగా, నిర్భయంగా కార్యరూపంలో పెట్టాడు తనకొచ్చిన ఆలోచనని. పని పూర్తిచేసి చటుక్కున చెట్టుదాటుకి తప్పు కున్నాడు.

హంతకుడు సైకిలువద్దకు వచ్చి నిలబడ్డాడు.

ప్రభు వొణికిపోతున్నాడు. ఒళ్ళంతా ముచ్చెమటలు

పట్టేస్తున్నాయి—చెట్టుకివతలివైపు.

చుట్ట వెలిగించి సైకిలు తీసుకుని వెళ్ళిపోయాడతడు.

తేలిగ్గా నిట్టూర్పు విడిచాడు ప్రభు।

పది నిమిషాలకు ధైర్యం తెచ్చుకుని మెల్లగా చెట్టుచాటు నుంచి వచ్చే ప్రయత్నంలో ఇటు తిరిగిన ప్రభు తలమీద బలమైన దెబ్బ పడింది.

వెంటనే అతడు స్పృహతప్పి పడిపోయాడు.

4

"వస్తా పద్మా! ఈ రోజు మధ్యాహ్నం ఇంటికి రావడం కుదరదు. క్యారియరు పంపించు" బులెట్ స్టార్టుచేసి వెళ్ళిపోయాడు సబ్ఇన్‌స్పెక్టర్ మాధవ.

మోటర్‌సైకిల్ మోతకి మెళకువ వచ్చింది ప్రభూకి.

కళ్ళు తెరవగానే వాకిట్లోంచి లోపలికి వస్తున్న పద్మ కనిపించింది.

ఇది అన్నయ్య ఇల్లు! అసలేం జరిగింది? తనిక్కడికి ఎలా వచ్చాడు?

"ఎలా వుందమ్మా? ఇంకా నొప్పిగా వుందా?" తల చేత్తో నిమురుతూ అడిగింది వదిన.

అంతా అయోమయంగా వుంది.

ఏం మాట్లాడలేదు ప్రభు.

కప్పులో హార్లిక్సు కలిపి తీసుకొచ్చింది పద్మ. అది తాగుతూ చుట్టూ కలయజూస్తున్న ప్రభూకి టేబిల్‌మీద డాల్డా డబ్బా కనిపించింది. ప్రభూ దానికేసి కళ్ళు చిట్లిస్తూ అదోలా చూడడం గమనించి, పద్మ అంది.

"అలా చూస్తావేమిటీ? అది నువ్వు తెచ్చిన డబ్బాయే! మినప సున్నుండలూ పూతరేకులూను!"

"ఆ గుర్తుకొచ్చింది! అంతా గుర్తొచ్చింది" ఒక్కకేక

పెట్టాడు ప్రభు. "అవునూ ఆ డబ్బా ఇక్కడికెలా వచ్చింది. ఆ కొండ వెధవ నా దగ్గర్నించి లాక్కుని తీసుకుపోయాడుగా!"

"అవును తీసుకుపోయాడు. తర్వాత డబ్బాలో వున్నవి సగందాకా తినేసి మిగిలినవి ఇంటికి తీసికెళ్ళాట్ట! వాళ్ళ నాన్న ఆ డబ్బా ఎక్కడ్నించి తెచ్చావని గట్టిగా కోప్పడే సరికి ఇన్‌స్పెక్టర్‌గారి తమ్ముణ్ని దార్లో బెదిరించి తెచ్చానని చెప్పేడట!

వెంటనే వాళ్ళ నాన్న డబ్బా తీసుకుని బయలుదేరి ఇక్కడికి వస్తున్నాడట. వస్తోంటే దార్లో ఒక చెట్టుపక్కన నువు పడివుండడం చూసి చేతికున్న బ్యాగ్‌ని బట్టి నువ్వే ఇన్స్పెక్టర్‌గారి తమ్ముడవయ్యుంటావని, ఎత్తుకుని తీసికొచ్చాడు. పైగా నువు దారితప్పి వేరేదార్లో కనిపించావుట.

ఆ కొండవాడు అడ్డదారిన రాబట్టి నువు కనిపించావు అదృష్టం బావుండి. లేకపోతే ఇంకేవన్నా వుందా? అసలే అడివి! నువు ఇంటికి వచ్చాక మీ అన్నయ్య డాక్టరుని తీసుకొచ్చారు. ఫర్వాలేదని చెప్పి ఇంజక్షనిచ్చి మందులిచ్చి వెళ్ళారు డాక్టరు."

"ఇంతకీ మరి నేను ఎందుకు పడిపోయానట? ఎవరైనా కొట్టారా నన్ను?"

"ఎవరూ కొట్టలేదు! నీ జుట్టుకి అంటుకున్న గుంజుని బట్టి నువు తాడిచెట్టు కిందనించి వస్తోంటే బాగా పండిపోయిన ఓ తాటిపండు నీ తలమీద పడివుంటుందని అన్నారు మీ అన్నయ్య! అదృష్టం బావుండి తలమీద గానీ, లోపల మెదడుకుగానీ ప్రమాదం కలిగే గాయం ఏదీ తగల్లేదు" అంది పద్మ,

"నేను చెట్టు కిందనించి నడవడమేంటి? దాక్కుం

లేనూ? ఆ రాస్కెల్ ఆ శవాన్ని పాతిపెట్టేసి పారి పోయాడు. ముందు వాడ్ని పట్టించాలి. అన్నయ్యేడీ? వెళ్ళి పోయాడా?"

దాక్కోడమేమిటీ? శవాన్ని పాతడమేమిటీ? మెదడు పాడై మతిగాని భ్రమించిందా?—భయపడింది పద్మ.

తర్వాత ప్రభూ అంతా వివరంగా చెప్పేడు. విస్తు పోయింది ఆమె.

"మరయితే హంతకుడ్ని పట్టుకోడానికి అప్పటికప్పుడు నీకు తోచిన చిట్కా ఏమిటి? ఏం చేశావు ఆ కొద్దిపాటి సమయంలో?" ఉత్కంఠగా అడిగింది.

"నాకు దగ్గర్లో వాడి సైకిలుంది. వాడు పని పూర్తి చేసు కొచ్చి ఎలాగూ ఆ సైకిలు పట్టుకుపోతాడు కాబట్టి ఆ సైకిలుమీద ఏదైనా గుర్తుపెడితే మర్నాడు అన్నయ్యతో చెప్పి ఆ గుర్తు ఆధారంగా సైకిలునీ, తర్వాత వాడినీ సుల భంగా పట్టుకోవచ్చు. బాగా ఆలోచించగా నాకో అయిడియా వచ్చింది.

బస్సు దిగినప్పటినుంచీ ఓ 'చిక్‌లెట్' నవుల్తూ వచ్చాను. అప్పటికింకా అది నా నోట్లోనేఉంది. వెంటనే జిగురుగావున్న ఆ చిక్‌లెట్‌ని తీసి వాడి సైకిలు సీటు కింద అతికించాను. వాడికి తెలియదు కాబట్టి చూడకపోతే అది ఎన్నాళ్ళయినా అలాగే వుంటుంది!" అన్నాడు ప్రభు గర్వంగా.

"అమ్మో! ఎన్ని తెలివితేటలూ ఇంత చిన్నబుర్రలో!" పద్మకి పట్టరాని సంతోషం కలిగి వెంటనే ప్రభూని దగ్గ రకు తీసుకుని ముద్దుపెట్టుకుంది. 'అన్నకు తగిన తమ్ముడు' అనుకుంది మనసులో.

5

మధ్యాహ్నం పన్నెండు గంటలవేళ సైకిలుమీద కాని స్టేబిల్ శేషయ్య వచ్చాడు. "పనిమీద ఇటువైపొచ్చా నమ్మా. అయ్యగారి భోజనం క్యారియరిస్తే పట్టుకెడతా" అన్నాడు.

పద్మ క్యారియర్ సర్దేలోగా ముందుగదిలో టీపాయి మీదున్న వీక్లీ తిరగేస్తున్నాడు శేషయ్య.

'అన్నయ్యకు చెప్పి ఊళ్ళోవాళ్ళ సైకిళ్ళన్నీ తనిఖీ చేయించాలి' అని మనసులో అనుకుంటూ ఇంట్లోంచి వస్తున్న ప్రభూకి కాంపౌండులో కానిస్టేబుల్ సైకిల్ కనిపించింది.

'సైకిళ్ళ తనిఖీ ఇక్కడ్నించే ప్రారంభించుదాం'— అని అనుకుని సరదాగా సీటుకిందికి చూసిన ప్రభూ గుండె ఝల్లుమంది!

సీటుకింద తను అతికించిన చిక్లెట్!!

క్యారియర్ అందుకుని సైకిల్కోసం వచ్చిన శేషయ్య కేసి తీక్షణంగా, అనుమానంగా చూశాడు ప్రభు

శేషయ్య గుటకలు మింగేడు.

"ఈ సైకిల్ ఎవరిది?"

"నాదేసార్! మా అత్తారు పెట్టారు."

"నువ్వు స్టేషన్కేగా వెళ్ళేదీ.... నేనూ వస్తా! వదినా భోజనం అయిపోయిందిగా అన్నయ్య దగ్గిర కెడుతున్నా" అంటూ గుమ్మంలో నిలబడ్డ పద్మకి చెప్పి, సైకిల్ బార్ మీద ఎక్కి కూర్చున్నాడు ప్రభు.

దారిలో— ఈలవేసుకుంటూ సైకిల్ తొక్కుతున్న శేషయ్యకేసి తల తిప్పిచూశాడు.

"అనుమానంలేదు వీడే! ఈ గుబురు మీసాలు రాత్రి

తను చూపినవే! అన్నయ్యకి చెప్పానంటే సప్పేందే? తర్వాత జైలు!" ప్రభూ బుర్ర వేడిగా పనిచేస్తోంది.

మాధవకి తమ్ముడంటే చెప్పలేని ప్రేమ!

తమ్ముడు చెప్పిందంతా విని అతడి సాహసాన్ని అభినందించాడు.

"ఆ సైకిలు శేషయ్యది కాదమ్మా! ఊరికే తమాషాకి తనదని చెప్పుంటాడు. ఈ ఉదయం బోర్డు స్కూలు హెడ్మాస్టరుగారిని ఎవరో సైకిలు మీద వెడుతూ ఢీ కొట్టేరనీ, ఆ సైకిలు స్టేషన్‌కి తెచ్చాననీ చెప్పాడు నాతో. బహుశా అదే అయ్యుంటుంది పద. రాత్రి నువ్వుచూపిన ప్రదేశం చూపించు" అంటూ జీపువైపు నడిచాడు.

ప్రభు హుషారుగా అన్నను అనుసరించాడు.

6

ఎంత అందమైన యువతి! చచ్చిపోయాక కూడా ఇంత అందంగా కనిపిస్తోందంటే బ్రతికుండగా ఇంకెంత అందంగా ఉండేదో! ఈమె నింత అర్థాంతరంగా చంపిన ఆ దుర్మార్గుణ్ని విడిచిపెట్టకూడదు!—మనసులో అనుకున్నాడు ఇన్స్‌పెక్టర్ మాధవ.

ఆమెకు పాతికేళ్ళుంటాయి పసిమిఛాయ. చదువుకొన్నదిలాగా కనిపిస్తోంది. ఒంటిమీద ఆభరణాలన్నీ తొలగించబడినాయి. శరీరంమీద అక్కడక్కడ రక్తం చారికలు కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల చర్మం కమిలినట్లు అగుపిస్తోంది.

"మనవూరి మనిషికాదు సార్! పట్నం మనిషిలాగా తోస్తోంది." అన్నాడు శేషయ్య.

తర్వాత రెండు మూడు కోణాల్లో శవం ఫొటోలు

తీయించుకుంది. ఆ తర్వాత పోలీసుల సహకారంతో జీపు నధిరోహించింది.

వేగంగా ముందుకురికిన ఆ జీపు పదినిమిషాల్లో చాకలి పేట చేరి ఒక ఇంటిముందు సడన్ బ్రేకుతో ఆగింది.

తలుపు తీసిన ఓ స్త్రీని ప్రశ్నించాడు ఇన్స్పెక్టర్.

"రాజయ్య నీకేమవుతాడు?"

"పెనివిటి"

"ఇంట్లో ఉన్నాడా?"

"లేదు తునెళ్ళాడు గుడ్డలు తేడానికి."

"ఎప్పుడొస్తాడు? తునిలో ఎవరెవరికి మీరు గుడ్డ లుతుకుతారు?"

ఆమె చెప్పింది శేషయ్య నోట్ చేసుకున్నాడు.

"నిన్నరాత్రి రాజయ్య ఎక్కడున్నాడు?"

"బాగా పొద్దుపోయేక పడుకొనే ఏలకొచ్చాడింటికి. ఏడకిపోతాడో ఏమో నాకేం చెప్పడు!"

"సరే! ఇల్లు ఓసారి సోదాచెయ్యాలి. నువు బైటికొచ్చి నిలబడు."

"నా కొడుకు సైకిలు నేర్చుకుంటానని చెప్పి తీసికెళ్ళి ఆ మేస్టరుగోర్ని గుద్దించినాట్ట. సైకిలిప్పించండి బాబూ పొరబాటయిపోనాది. ఇంట్లో ఎవరూలేరు నిజం!" అంది చాకలిది సోదాచేసే విషయం తెలియక.

ఇల్లు సోదాచేసి గునపం, పారా తెచ్చి ఇన్స్పెక్టర్‌కి చూపించి జీపులో వేశారు పోలీసులు.

తర్వాత తుని దిశగా దూసుకుపోయింది జీపు.

హంసవరానికి దగ్గర్లోఉన్న పట్నం—తుని.

"రా....మాధవా, రా! ఏమిటి విశేషాలు? కుర్రా డెవరు?" ఆహ్వానించాడు ఇన్స్పెక్టర్ కమలాకర్.

"మా తమ్ముడు ప్రభు. కొంచెం పనుండి వచ్చాను. ఈమధ్య మిస్సింగ్ కంప్లయింట్స్ ఏవన్నా బుక్ చేశావా?"

"ఆఁ....ఓకేసు రిజిస్టర్ చేసుకున్నాం. ఇదిగో" అంటూ ఫైలు తీసిచ్చాడు కమలాకర్.

పేరు, అడ్రసు చూసి ఆనందంగా ఒక్క కేక పెట్టాడు మాధవ.

చాకలి రాజయ్య బట్టలుతికే వాళ్ళలో ఒకరు తన భార్య కనిపించడం లేదని పోలీస్ కంప్లయింట్ ఇచ్చారు.

కంప్లయింట్ ఇచ్చిన వ్యక్తి పేరు నిరంజనం. తండ్రి లేడు. ప్రస్తుతం తల్లి, ఆరేళ్ళ కొడుకూ తప్ప మరెవ్వరూ లేరు ఆ ఇంట్లో.

మూడురోజుల క్రితం సాయంత్రం వేణుగోపాలస్వామి గుడికి వెడతానని చెప్పి వెళ్ళిన అతడి భార్య 'నిశ్చల' తిరిగి ఇంటికి రాలేదనీ, బంధువులనీ, స్నేహితులనీ ప్రశ్నించినా ఫలితం లేకపోయిందనీ పోలీస్ కంప్లయింట్ ఇచ్చాడు నిరంజనం.

ఆమె చాలా సోషల్ టైప్ అట. ఆమెతో చదివిన బాయ్‌ఫ్రెండ్స్‌ని ఎక్కడో అక్కడ తరచుగా కలుస్తూ వుంటుందిట. అత్తగారు, భర్త ఎంత వారించినా ఆమె ప్రవర్తనలో మార్పురాలేదని తెలిపింది. బహుశా ఏ కుర్రాడితోనో లేచిపోయి వుండాలని అనుకుంటున్నాం....ఇంకా కొందరిని ప్రశ్నించాల్సి వుంది" అన్నాడు కమలాకర్.

"సోషల్‌గా ప్రవర్తించే వారి జీవిత ధ్యేయం ఎవరితోనో లేచిపోవడం కాదు కమల్! రక్తం పంచుకు పుట్టిన కొడుకుని 'ఆఫ్టరాల్'గా వదిలేసి పరాయి మగాడితో లేచిపోయే తల్లులు ఎక్కడోగాని మనకు తటస్థపడరు. బై దిబై ఆమె ఫోటో సంపాదించావా?" అడిగాడు మాధవ,

కమల్ డ్రాయరు సొరుగులోంచి తీసిచ్చిన ఫోటోని చూసి, "నా అంచనా తప్పుకాదు బ్రదర్! ఈమె హత్య చెయ్యబడింది. ఈ శవాన్నే ఇప్పుడు మార్చురీకి పంపి ఇలా వచ్చాం నీ దగ్గిరికి! ఒకసారి నిరంజనం ఇంటికి వెడదాం నడు. గెటప్!" హుషారుగా లేచాడు మాధవ.

ఇంతలో ఏదో గుర్తుకొచ్చింది. "అవునూ, నిరంజనానికి ఓ కొడుకున్నాడు కదా! అత డే స్కూల్లో చదువుతున్నాడో తెల్సా?"

చెప్పాడు కమలాకర్.

"ముందు ఆ కుర్రాడ్ని స్కూల్లో కలిసి. తర్వాత నేరుగా నిరంజనం యింటికి వెడదాం. కేసు ఒక్క క్షణంలో ఫైనలైజ్ చేస్తా" నవ్వుతూ అంటున్న మాధవ కేసి అయోమయంగా చూశాడు ఇన్స్పెక్టర్ కమలాకర్.

7

నిశ్చల శవం లభించినట్లు చెప్పకుండా. మామూలుగా మాధవ అడిగిన ప్రశ్నలన్నిటికీ తడుముకోకుండా జవాబులు చెప్పాడు నిరంజనం.

తను ఎంతగానో ప్రేమించిన తన భార్య తనకున్న బాధ్యతలనీ కట్టుబాట్లనీ తెంచుకుని ఎవరితోనో వెళ్ళిపోయిందని తన బాధను వ్యక్తంచేశాడు.

"ఏ అత్తఅయినా కోడల్ని ప్రేమగా చూచుకుందంటే నమ్మదు నాయనా ఈ లోకం. నిశ్చలని నా కోడలుగా కాదు—కన్న కూతురిలాగా చూచుకున్నాను," కళ్ళు తుడుచుకుంటూ అంది నిరంజనం తల్లి.

"మీ రెంత ప్రేమగా చూచుకున్నదీ మీ మనుమడు మాకు ఇప్పుడే చెప్పాడు స్కూల్లో. 'కన్న కూతురిలాగా చూచుకోవడం' అనే మాటలకి నిర్వచనం—పశువుని కొట్టి

నట్టు కొట్టడమనీ, కొరకంచుతో చేతికందిన చోటల్లా వాతలు పెట్టడమనీ ఇప్పుడే తెలుసుకుంటున్నాను.” మెల్లగా అన్నాడు మాధవ.

తల్లీ కొడుకులు ఒక్కసారిగా తలలు పైకెత్తిచూశారు.

“పోలీసుల ముందు ఏ నేరస్తుడూ కలకాలం నటిస్తూ నెగ్గుకురాలేడు. మీరూ, మీ చాకలి రాజయ్య కలపి చేసిన ఘాతుకం అంతా మాకు తెలుసు. నంగనాచిల్లాగా మాట్లాడకండి. ప్రస్తుతం నిశ్చల శవం మా అధీనంలో వుంది. మీ పాపం పండి నిన్నరాత్రి హంసవరం తోటల్లో రాజయ్య స్వయంగా ఆమెను ఖననం చెయ్యడం కళ్ళారా చూశాడో వ్యక్తి.

నిశ్చలని ఏ కారణంగానో చంపి, ఆ శవాన్ని బట్టల మూటలో పెట్టి, రాజయ్యద్వారా హంసవరం పంపి చేతులు దులుపుకుని, పైగా అమాయకుల్లాగా నిశ్చల కనిపించడం లేదని పోలీస్ కంప్లయింట్ ఇచ్చారు.

రాజయ్యకోసం వల వేశాం. కొద్ది క్షణాల్లో అతడు పోలీస్‌స్టేషను కొస్తాడు.

ఇంతకీ ఎందువల్ల ఆ పచ్చటి జీవితాన్ని పొట్టన బెట్టుకున్నారో తేలలేదింకా. ఇక్కడ చెప్తారా? పోలీస్‌స్టేషన్లో చెప్పించమంటారా?”

నిరంజనం రెండు చేతులూ జోడించాడు. అతడి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి—

నిశ్చల అణుకువైన మనిషి. ఆమెకంటూ ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉన్నమాట నిజమే కానీ, సోషల్‌గా వ్యవహరిస్తుందనీ, బాయ్ ఫ్రెండ్స్‌తో కలుస్తుందనీ చెప్పిన మాటలన్నీ కల్పితాలు!

పదిరోజులక్రితం—కొడుకు పుట్టినరోజు సందర్భంగా

అతడి పేరుమీద ఓ భాగ్యలక్ష్మి లాటరీ టికెట్ తీసుకుంది నిశ్చల.

తర్వాత ఆ టిక్కెట్‌కు మొదటి బహుమతిగా లక్ష రూపాయల ప్రైజు వచ్చిందని తెలిసి ఆనందంగా కేరింతలు కొడుతూ ఇంట్లో అందరికీ చెప్పింది.

టికెట్ తన కివ్వమనీ ఆ డబ్బుతో తన అవసరాలు కొన్ని తీరుతాయనీ చెప్పి నిశ్చలని ప్రాధేయపడ్డాడు నిరంజనం.

నిరంజనం పచ్చి తాగుబోతు; దానితోబాటు అదనంగా మరికొన్ని దుర్వ్యసనాలు అతణ్ణి అంటిపెట్టుకున్నాయి. ఆ కారణంగా బహుమతి సొమ్ము నిరంజనానికివ్వ నిరాకరించిన నిశ్చల—కొడుకుపేరున ఆ సొమ్ము బ్యాంకులో ఫిక్సెడ్ డిపాజిట్ చేసి అతడి చదువుకు వినియోగించాలని పట్టుబట్టింది. ఫలితంగా భర్తచేత తన్నులు తింది.

తరువాత లాటరీ టికెట్ ఎక్కడుందో చెప్పమని నిశ్చలను వేధించి నానాహింసలకూ గురిచేశారు.

నిశ్చల చెప్పలేదు.

ఫలితంగా తల్లీ కొడుకుల్లో మానవత్వం కరిగిపోయి రాక్షసత్వం చోటుచేసుకోవడం, తద్వారా కోడలు చిత్రహింసలకు గురికావడం జరిగింది.

ఒకదశలో ఊపిరి ఆడని పరిస్థితిలో ఆమె బలవన్మరణానికి గురి అయ్యింది.

నిశ్చల నిశ్చలంగా మిగిలిపోయింది.

ఆమె ప్రాణం అయితే తీయగలిగారు కానీ, తర్వాతయినా లాటరీ టికెట్ ఇంట్లో ఎక్కడదాచిందో కనుక్కోలేకపోయారు ఆ యిద్దరూ —

తలలు వంచుకు నిలబడ్డ ఆ యిద్దరి చేతులకి బేడీలు

తగిలించాడు కమలాకర్.

"మీరు సోదా చెయ్యడానికీ పోలీసులు సోదా చెయ్యడానికీ సహస్రం తేడా వుంటుంది. రెండు నిమిషాల్లో ఆ టికెట్ చూపిస్తాను.

నిశ్చల రోజా ఉదయం పూజచేస్తుందటగా! ఏ ప్రదేశంలో?" అన్నాడు మాధవ.

ఆ గదిలో ఒకవైపు చూపించేడు నిరంజనం విస్మయంతో.

అది ఒక చెక్కతలుపుఉన్న చిన్నగూడు. తలుపుమీద వెంకటేశ్వరస్వామి బొమ్మ అతికించివుంది. గూడు తెరిస్తే లోపల దేవుడి ఇత్తడి సింహాసనం, అందులో అనేక దేవుళ్ళ విగ్రహాలూ ఉన్నాయి. పసుపుకుంకుమల భరిణలు, అగరవత్తులు, చిన్నసైజు స్తోత్రం పుస్తకాలూ వున్నాయి.

ఒక నిమిషంపాటు మౌనంగా వున్నాడు మాధవ.

గూడు తలుపుమూసి తలుపుకు అతికించిన వెంకటేశ్వర స్వామి బొమ్మ కాగితం చివరని గోటితోలేపి పైకంటా చించాడు.

అందులోంచి పడింది లక్షరూపాయల భాగ్యలక్ష్మి లాటరీ టికెట్!!

చూపినవాళ్ళ ఆశ్చర్యాని కంతులేదు!

"ఈ పాపిష్టి చేతులకి ఆ సొమ్ము తాకే అధికారంలేదు. నిశ్చల కోరిక ప్రకారం దయచేసి ఆ సొమ్ము బాబు చదువుకు వినియోగించే ఏర్పాటు చేయించండి." అశ్రునయనాలతో జీపువైపు నడుస్తూ అన్నాడు నిరంజనం.

"వెల్ డన్ మాధవా!" అభినందించాడు కమలాకర్!

"దిస్ క్రెడిట్ గోస్ టు మై బ్రదర్ ప్రభు! నాట్ ఫర్ మీ!!" నవ్వుతూ అన్నాడు మాధవ. □

అమృత దీపం

కు॥ వి.వి. సత్యనారాయణ

ఉదయం నుండీ తల భారంగావుంది. తీరికలేని పని వొత్తిడితో వారం రోజులనుండి స్వేచ్ఛకోసం గింజుకుంటున్నాను. ప్రకృతి మధ్య పరవశించాలనీ, నగర వాతావరణానికి తాత్కాలికంగా సెలవు చెప్పాలనీ వుంది. కాని ఉద్యోగ బాధ్యతలకు బందీని. తప్పించుకుని ఎక్కడికి

పోగలను?

గ్రామంలో పుట్టి పెరిగాను. మా కజిన్ రాజేష్, నేనూ చదువులు ముగించుకుని నగరంలో స్థిరపడవలసి వచ్చింది. నగరానికి నడిబొడ్డున నా ఆఫీసువుంటే, నాకు పదికిలో మీటర్ల దూరంలో రాజేష ఆఫీస్‌వుంది. ఇద్దరమూ ఒకే చోటవుంటే బాగుండుననుకున్నాను. కాని వాడు పడనివ్వ లేదు. ఆఫీసుకు దగ్గరలో యిల్లు తీసుకున్నాడు.

"సారీరా! నేను రోజూ అటు పదికిల మీటర్లూ యిటో పదికిలోమీటర్లూ ప్రయాణం చేయలేను! పైగా మా నాన్న చండశాసనుడు. నీకు తెలియనిదేముంది?" అన్నాడురాజేష్.

నాకు తర్వాత తెలిసింది. వాడికి అక్కడే ఒక 'లవ్' తారసపడిందని! ప్రస్తుతం వాడు కూడా నగరంలో లేడు. ఆఫీస్ పనిమీద పూరీ వెళ్ళాడు.

ఆఫీసుకు సెలవుపంపి దగ్గరలోవున్న మామిడితోటలోకి నడిచాను. నగరం నడిబొడ్డున యింత ప్రశాంతమైన తోట వుంటుందంటే నేను నమ్మను. నా సహోద్యోగి నాకు యీ ప్రశాంత ప్రదేశాన్ని పరిచయంచేశాడు.

తోటలో పరిస్థితి మామూలుగానే వుంది. దూరంగా రైలు కట్టవుంది. రైలుకట్టకు ఆనుకుని చెరువు వుంది. మామిడి తోటలోంచి కొండమలుపు తిరిగే రైలును చూడవచ్చును. తోటకు ఆవతలప్రక్క పాడుపడిన యిల్లువుంది.

"అటు వెళ్ళకు! ఎందుకయినా మంచిది! దెయ్యాల సంగతి ఎలావున్నా పాతకట్టడం ఎప్పుడు కూలుతుందో చెప్పలేము!" అన్నాడు సహోద్యోగి.

అతడి మాట నిజమేననిపించింది. పైగా నాకు దెయ్యా లంటే పిరికితనం కూడావుంది. అవివుంటే వున్నాయి. లేకపోతేలేవు. సాహసంచేసి ప్రమాదాన్ని ఎందుకు ఆహ్వా

నిందాలి! సాహసం మంచిదేకాని, దుస్సాహసం పనికిరాదని నా నమ్మకం!

చెట్లమధ్య నడుస్తున్నాను. గాలి వీచడంలేదుకాని వాతావరణం ఆహ్లాదకరంగావుంది. ఉదయం ఎండ పొడలు పొడలుగా మామిడిఆకుల మధ్యనుండి నేలమీద పడుతోంది. ఎండుటాకులు వేగిన అప్పడాలు లాగా నా కాళ్ళకింద నలుగుతోన్నాయి. నేలబారుగా వంగిన కొమ్మను ఎంచుకుని కూర్చున్నాను.

నా ఆలోచనలు వున్నట్టుండి మావాడి 'లవ్'మీదికి మళ్ళాయి. ఆమె ఎలా వుంటుందో చూడలేదు నేను! మా వాడు ఆమెను పెళ్ళిచేసుకుంటాడా? ఆమె ఏంచేస్తుంది! ఆమె తల్లిదండ్రులకు మా రాజేష్ సంగతి తెలుసా?

"అయ్యో....రక్షించండి....చచ్చిపోతున్నాను!"

ఉలిక్కిపడ్డాను. ఎక్కడినుండో ఆర్తనాదం వినిపించింది. చుట్టూ చూశాను. మామిడితోట మొత్తంమీద నరప్రాణిని నే నొక్కడినే వున్నాననుకున్నాను. నా వూహ తప్పు! ఎవరో చచ్చిపోతున్నారు. ఆమెను ఎవరో చంపేస్తున్నారు. అంటే యీ మామిడితోటలో కనీసం మరో రెండు ప్రాణులున్నా యన్నమాట!

ఆర్తనాదం ఆడగొంతుచేసిందేనా? అవును. ఖచ్చితంగా గొంతు గుర్తుపట్టగలను. కొమ్మమీద నుండి లేచి చురుకుగా కదిలాను. మరేరకమైన ఆర్తనాదమైనా వినిపిస్తుందేమోనని చెవులు రిక్కించి వింటున్నాను. చెట్లమధ్య వేగంగా పరుగెత్తుతున్నాను. ఆ గొంతు మరల వినిపించలేదు సరికదా, నేను తప్పించి మరోప్రాణి మామిడితోటలో కనిపించలేదు.

దెయ్యాలకొంప ముందు నిలబడ్డాను. వాకిలి శుభ్రంగా

వుంది.

"ఘల్లు....ఘల్లు...."

నాగుండె ఝల్లుమంది. ఆ చప్పుడు దెయ్యాలకొంప లోంచి వస్తోంది. నాకు కాళ్ళు నేలలోకి పాతుకుపోయాయి. ఉదయాన్నే దెయ్యం పాలబడ్డానా? దెయ్యమే అయితే వాకిలి శుభ్రపర్చుతుందా? పట్టీలు ధరించి నడిచినట్టు ఘల్లు ఘల్లు మని చప్పుడు చేస్తుందా? అయినా దెయ్యాలు రాత్రిళ్ళు మాత్రమే సంచరిస్తాయంటారు. ఉదయం తొమ్మిదయినా యీ కొంపలో యింకా దెయ్యం సంచరిస్తోందా?

నాకు కళ్ళు జిగేల్‌మన్నాయి. దెయ్యాలకొంప గుమ్మంలో ఎర్రటి పరికిణీ, తెల్లటి జాకెట్టూ, తెల్లవోణీ వేసుకున్న మెరుపుతీగ ప్రత్యక్షమయింది. ఆమె చేతిలో ముగ్గు గిన్నెవుంది. కూనిరాగం తీసుకుంటూ ఆమె యధా లాపంగా వాకిట్లోకి వచ్చింది. నా వైపు వీపుపెట్టి అటువంగి ముగ్గు వేస్తోంది.

ఆశ్చర్యంలోంచి తేరుకుని ఆమె పాదాలు చూశాను. దెయ్యంపాదాలు వెనక్కితిరిగి వుంటాయట. ఆ లెక్కన యీమె దెయ్యంకాదు. నాకు ధైర్యం వచ్చింది. ఆర్తనాదం యింకా నా చెవుల్లో గింగురుమంటోంది,

"ఏ... మండీ....!" అన్నాను. తర్వాత తెలిసింది. నా పిలుపు నా గొంతులోనే ఆగిపోయింది.

"ఏమండీ మిమ్మల్నే!" అన్నాను మరికాస్త ధైర్యంగా.

ఆమె బెదిరిపోయిన లేడిలాగా తలతిప్పి నా వైపు చూచింది. ఆమె కళ్ళు పెద్దవిగా విష్ణు చక్రాల్లావున్నాయి. ముగ్గుగిన్నె క్రిందవుంచి నా వైపు తిరిగింది.

"ఎవరండీ...." అన్నదామె.

"మీరు యిప్పుడు అంటే రెండు నిమిషాలక్రితం ఎవరి

దైనా కేకవిన్నారా?"

"కేకా? ఎవరికేక?"

"ఎవరో స్త్రీ. అయ్యో ...రక్షించండి........చచ్చి పోతున్నాను! అని." నాకు తడబాటుకలుగుతోంది. అణచు కున్నా అణగడంలేదు. యవ్వనంలో వున్నాను. పరిస్థితులు కలిసివచ్చి పెద్దలు అంగీకరి స్తే ఆమెను భార్యగా స్వీకరించ గల వయసులో కూడా వున్నాను.

"ఏమోనండి. నేను ఎలాంటి పిలుపూ వినలేదు."

"ఆశ్చర్యం! ఈ తోటలో విన్నాను."

"అంతా చూశారా?"

"ఆఁ!"

"నేను అరగంటనుండీ యిక్కడేవున్నాను. లోపల వున్న నాన్నగారి దగ్గరకు కూడా వెళ్ళలేదు."

నా మీద నాకే అనుమానం వస్తోంది. నేను ఆర్త నాదం విన్నావా? లేదా? కేవలం భ్రమపడ్డానా? ఆర్తనాదం వినడం తటస్థిస్తే నేనొక్కడినీ వినను. ఈమె కూడా విని వుండాలి. అంతేకాదు. ఆర్తనాదం చేసినస్త్రీ. ఆమె ఆర్త నాదానికి కారకులైన వాళ్ళూ నాకు కనిపించాలికదా!

"మీరు పొరబడి వుంటారు!" ఆమె యధాలాపంగా అనేసి వంగి ముగ్గుగిన్నె అందుకుంది. ముగ్గు పెట్టడంలో నిమగ్నమైపోయింది.

నాకు యిక అట్టే సేపు అక్కడేవుండటంలో అర్థం కనిపించలేదు. అతి కష్టంమీద కళ్ళు వెనక్కి తిప్పుకుని నడవసాగాను. ఆర్తనాదం యింకా నా చెవులలో గింగురు మంటోంది. గదికివచ్చి పనిమనిషిచేత టిఫినూ, కాఫీ తెప్పించుకున్నాను.

సేవిస్తూ ఎదుటి యింటివైపు చూశాను.

డాక్టర్‌గారు లేరు. ఆయన ఆత్మలమీద ఏవో పరిశోధనలు చేస్తున్నారు. రేపు ఆయనను కలిసి మాట్లాడాలనుకున్నాను. ఆయనతో నాకు కొద్దిగా పరిచయం వుంది.

2

తెల్లవారి లేచింది మొదలు ఆమె గుర్తుకు వస్తోంది. ఆమె అందమైన కళ్ళూ, ముగ్గువేస్తోన్న తీరూ నన్ను ముగ్ధుడ్ని చేస్తోంది. త్వరగా కాలకృత్యాలు ముగించుకొని ట్రిమ్‌గా తయారయాను మామిడితోటకు బయల్దేరాను.

డాక్టర్‌గారు యింట్లోలేరు. యిల్లు తాళం పెట్టివుంది.

మామిడి తోటలో ప్రవేశించాను. వాతావరణం నిన్నటి కంటే ఆహ్లాదకరంగా వుంది. నిన్నటికంటె ఎందుకంతగా వాతావరణం బాగా వుందో చెప్పలేను. అయినప్పటికి యీ ఆహ్లాదకర వాతావరణంలో ఎంతోసేపు గడపలేను. విధి నిర్వహణకు పరుగెత్తవలసిన రోజు యిది. సెలవు పెట్ట లేదు.

చురుకుగా దెయ్యాల భవంతి (దాన్ని అలా పిలవకూడ దని తొలిసారి తోచింది) వైపు అడుగులు వేశాను.

"అయ్యో.... రక్షించండి.... చచ్చిపోతున్నాను!"

నాలో వుత్సాహం నీరు కారిపోయింది. అందమైన ఆడ పిల్లను మరల చూడాలని యిటు వచ్చాను కాని.... నిన్నటి ఆర్తనాదాన్నే మరల వినాలని కాదు. వాచీ చూసుకున్నాను సరిగ్గా నిన్నటి వేళ అయింది.

ఖచ్చితంగా నిన్నటికి లాగానే 8-20 కి ఆర్తనాదం విని పించింది.

ఏమిటిది? అదే ఆర్తనాదం మరల అదే సమయానికి వినిపించడం ఏమిటి? ఆమెకు నిన్నటి ప్రమాదం యింకా తప్పిపోలేదా? లేక యిదంతా దెయ్యం కల్పించిన భ్రమా?

చెట్లమధ్య కంగారుగా పరుగుతీశాను. ఎండుటాకులూ, చితుకులూ నా కాళ్ళకింద నలుగుతూ వింతగా గుబులు పుట్టి స్తోన్నాయి.

తోట మొత్తం కలియతిరిగి ఆ భవంతి ముందు ఆగాను. వగర్పు వస్తోంది. శక్తి పోయినట్టయిపోయింది.

ఆ అమ్మాయి నిన్నలాగానే ముగ్గు పెడుతోంది. నా రాక గమనించినట్టుంది. తలెత్తి చూచినట్టుగా తెలియపరచి తిరిగి తన పనిలో మునిగిపోయింది. గొంతు సవరించుకుని ఒంట్లోకి కొత్త శక్తి తెచ్చుకున్నాను.

"ఏమండీ! ఆర్తనాదం విన్నారా?" అన్నాను.

ఆమె నావైపు విడ్డూరంగా చూచింది.

"అవునండీ! ఈరోజు మరల వినిపించింది!" అన్నాను.

"ఆర్తనాదం వినిపిస్తుందనే మరల వచ్చారా?" మర మర చూచింది.

"అబ్బే....ఉదయాన్నే....ప్రశాంతంగా..ఈ తోటలో... తిరగడం నా అలవాటు. ఈరోజు మరల ఆర్తనాదం విని పిస్తుందని వూహించలేదు. మీకు వినిపించకపోవడం చాల విచిత్రంగా వుంది!"

ఆమె నవ్వింది. నీ సంగతి నాకు అర్థమయిందన్నట్టు నవ్వింది. నేను కేవలం ఆమెను చూడటానికి మాత్రమే వచ్చి నాటక మాడుతున్నా నన్నట్టుగా నవ్వింది.

నేను సిగ్గుగా చూపులు మరల్చుకోవలసి వచ్చింది.

ఇంట్లోంచి దగ్గు వినిపించింది.

"మీ నాన్నగారా?" అడిగాను.

"వూఁ! ఆయనకు బాగుండలేదు. ఈ యిల్లు మాదే! ప్రశాంత వాతావరణంలో వుంచవచ్చునని నాన్నగారిని తీసు కుని యిటు వచ్చాను."

"మీరు రాత్రిళ్ళు యీ యింట్లో వుండగలుగుతున్నారా?"

"ఏం? భయమా?"

"అబ్బే....పగలు అయితే వుండవచ్చును. రాత్రిళ్ళు.... అయినా సరే యిదేమిటి చెప్పండి! ఎవరో స్త్రీ చచ్చిపోతున్నా నన్నట్టుగా అరవడం ఏమిటి? ఆ అరపు నాకుమాత్రమే విని పించడం ఏమిటి?"

"అది మీ భ్రమ అని నా అనుమానం!"

"భ్రమా! స్పష్టంగా వింటున్నానండీ!"

"మీకంటె చిన్నదాన్ని! మన్నిస్తారేం?"

నాకు నరాలు జివ్వుమన్నాయి. వెర్రిగా నవ్వేటోయి ఆగాను.

"మీ పేరు....నీ పేరేమిటి?" అన్నాను సర్దుకుని.

"స్వప్న!"

"అందమైన పేరు!"

"థాంక్స్!"

వాచీ చూసుకున్నాను. డ్యూటీకి వేళయింది. సెలవు తీసుకున్నాను.

3

"డాక్టర్‌గారూ! నిన్న వుదయం 8-20 కి ఆమె ఆర్త నాదం చేసింది. అదే ఆర్తనాదం యీ రోజు కూడా విన్నాను. ఆశ్చర్యం! సరిగ్గా 8-20 కే విన్నాను." డాక్టర్ గారికి ఆరోజు సాయంత్రం నా అనుభవం అంతా వివరించి చెప్పాను.

"ఆర్తనాదం నా ఒక్కడికే వినిపిస్తోంది" అన్నాను.

"ఆ సంగతి ఎలా రుజువయింది?" అడిగారు డాక్టర్ గారు.

"మామిడి తోటలో ఓ దెయ్యాల భవంతి వుంది. ఆ

భవంతిలోకి ఒక తండ్రీ, అతడి కూతురూ దిగారు. కూతురు నాకు పరిచయమయింది. ఆమెకు ఆర్తనాదం వినిపించ లేదు."

"దెయ్యాల కొంపలో దిగారా? వాళ్ళు దెయ్యాలేమో!"

"డాక్టర్‌గారూ! మీరు మరీ దారుణంగా మాట్లాడు తున్నారు. ఆమె దెయ్యం కాదు. నిర్ధారణ చేసుకున్నాను."

"ఆమె దెయ్యం కాకపోవచ్చును. కావచ్చును. ఆర్త నాదం నీకు మాత్రమే వినిపించడంలో దెయ్యం కుట్ర మాత్రం వుంది?"

అసలే నాకు పిరికిగా వుంది. డాక్టర్ వెటకారంగా అంటున్నాడో లేక యధార్థం మాట్లాడుతున్నాడో నాకు తెలియడంలేదు.

"దయచేసి మీరు రేపు నాతో తోటకు వస్తారా?"

"అలాగే. ఆ అమ్మాయి పేరేమిటి?"

"స్వప్న!" నాలో హుషారు తిరిగివచ్చింది.

"ఆమె తండ్రిని చూశావా?"

"లేదు!"

"అతడు మంత్రగాడేమో!"

"ఛ! ఛ! అతడు దగ్గుతున్నాడు. దగ్గు వినిపిస్తోంది బయటకు. అతడి ఆరోగ్యం బాగుపడుతుందేమోనని తీసుకు వచ్చిందట!"

"అమ్మాయి అందంగా వుంటుందా!"

సిగ్గుపడ్డాను.

"నాకు మన తత్వశాస్త్రం బాగా తెలుసు. అలాగే ఆత్మల గురించీ, ఆత్మల వైద్యం గురించీ కొన్ని పరిశోధనలు చేశాను!"

తలూపాను.

"చాలామంది తెలియనివారు దెయ్యాలు లేదంటారు. ఆత్మలు అబద్ధమంటారు. ఇవన్నీ రేపటి ప్రపపంచంలో రుజువవుతాయి. ఈరోజు రుజువు దొరకనంత మాత్రాన వాటి వునికి అబద్ధమనుకోవడం మూర్ఖత్వం!" అన్నారు.

ఎందుకో నా బుర్రనిండా సైతాన్‌లే తిరుగుతోన్నాయి. దెయ్యాలుండటం నిజమైనా కాకపోయినా నాబుర్ర దెయ్యాల మయం అయిపోయింది.

4

మర్నాడు ఉదయం—

మామిడితోటలో యిద్దరమూ నడుస్తున్నాం. చీటికీ మాటికీ వాచీ చూసుకుంటున్నాను. ఎనిమిదీయిరవై కావ డానికి యింకా పదినిముషాల సమయం వుంది.

డాక్టర్ నావైపు నవ్వుతూ చూశాడు. "మనసులో ఎలాంటి భావమూ పెట్టుకోవద్దు. మనస్సును భ్రమకు లోనవ్వనివ్వకు. దెయ్యాన్ని ఎలా వదిలించాలో నాకు తెలుసు! నన్ను నమ్మ, అంతే!"

"నమ్ముతున్నాను!" అన్నాను. మాకు అంతదూరంలో దెయ్యాల భవంతి కనిపించింది. ఇద్దరమూ అటు నడు స్తూన్నాం.

వాచీ ముల్లు ఎనిమిదీ పందొమ్మిదిమీద వుంది. సెకండ్ల ముల్లు ఒకటినుండి ప్రయాణం ప్రారంభించింది.

"అయ్యో....రక్షించండి....చచ్చిపోతున్నాను!"

నిజం చెప్పొద్దూ....నాకు నరాలు చచ్చుపడిపోయిన ట్టయింది. చటుక్కున తలతిప్పి డాక్టరుగారిని చూశాను. ఆయనలో ఏ ప్రేరణాలేదు. ఆయన కళ్ళెగరేసి నవ్వాడు.

"ఏం, వినిపించిందా మిత్రమా!" అన్నాడు.

"అవును. మీకు వినిపించలేదా?"

"వూహూ(॥" అన్నాడు డాక్టరు నన్ను ఆశ్చర్యంగా చూస్తూ.

నాకు చాల ఆశ్చర్యంగా వుంది. ఆర్తనాదం ఒకరికి వినిపించడం మరొకరికి వినిపించకపోవడం ఏమిటి? దెయ్యంపనే అయివుంటే యిది సాధ్యం కావచ్చును.

స్వప్న వాకిట్లో ముగ్గులు పెడుతోంది. ఆమె ఖచ్చితంగా సమయం పాటిస్తోంది. ఇది మరో వింత! బుర్ర విదిలించాను. ఈ మామిడితోటలో వింతలు మొదలయాయి. అదీ స్వప్న వచ్చాకనే మొదలయినట్టున్నాయి. ఇంత పెద్ద తోటలో ఆమె ఒంటరిగా ఎలా మసలగలుగుతోంది? కొంపతీసి ఆమె అతీతశక్తి కాదు కదా!

"నీ పేరు స్వప్న అటకనమ్మా!" డాక్టర్‌గారు ఆమెను పల్కరించాడు.

ఆమె సిగ్గుగా తలూపింది.

"నువ్వు యిప్పుడేమైనా ఆర్తనాదం విన్నావా?"

"ఆర్తనాదమా!" అని నావైపు కొంటెతనంగా చూచి "మీరు విన్నారా పోనీ!" అంది.

డాక్టర్‌గారు కులాసాగా నవ్వాడు. నాక్కూడా అంత స్వేచ్ఛగా నవ్వాలనేవుంది. ఆమె అందం, చూపులూ అవకాశం యివ్వడంలేదు.

"మీనాన్నగారు" అగాడు డాక్టర్‌గారు.

"వద్దన్నా వినకుండా బీచ్ వైపు వెళ్ళారు!" అంది స్వప్న.

"దగ్గుతున్నారు కదా, ఎందుకు వెళ్ళనిచ్చారు?" అన్నాను.

డాక్టర్‌గారు నావైపు మెచ్చుకోలుగా చూశాడు. ఆమె నిర్లిప్తంగా భుజాలు ఎగరవేసింది.

"మీ యిల్లు చూడవచ్చునా?" అడిగాడు డాక్టర్‌గారు.

స్వప్న తలూపి యింట్లోకి దారితీసింది. ఇల్లు వర్షంవల్ల కాబోలు గోడలన్నీ నాచురంగుకు తిరిగివున్నాయి. పెద్దగా ఫర్నిచర్ కానీ, యితర సామగ్రి కానీలేవు. ఒకటి రెండు రోజులు బసచేయడానికి వచ్చిన వాళ్ళకులాగా వచ్చారు స్వప్నా, ఆమె తండ్రీనూ.

"నాన్నగారి గది పైఅంతస్తులో ...." అంది స్వప్న.

"వెళ్దామా?" అన్నాడు డాక్టర్‌గారు.

"ఎందుకు....పోనిద్దురూ!" అన్నాను. నా మనసంతా ఆర్తనాదం మీదేవుంది. స్వప్నకీ ఆర్తనాదానికీ సంబంధం వుంది. రేపు ఎనిమిదీ యిరవైకిముందే స్వప్నమీద నిఘా వెయ్యాలి-అనుకున్నాను.

5

ఉదయం తొందరగాలేచాను. ఈ రోజు స్వప్నవిషయం పూర్తిగా తేల్చేస్తాను. ఆ గొంతు దెయ్యానిదికాదు. మనిషిదే! దెయ్యం సరిగ్గా వుదయం ఎనిమిదీయిరవైకే ఆర్తనాదం చేయడంలో అర్థంలేదు. కాని స్వప్నను చూస్తే అలా అనిపించదు. నేను యవ్వనమైకంలో పడిపోతున్నానా?

ఉదయం 7-30 అయింది. తల దువ్వుకుని పనిమనిషి తెచ్చిన టిఫిన్‌పొట్లం అందుకున్నాను.

గుమ్మం వెలుపల స్లిప్పర్ల చప్పుడయింది.

తలెత్తి చూశాను. నా నోరు తెరుచుకుని వుండిపోయింది. మిలమిల మెరుస్తోన్న నీలంరంగు పరికిణీ, తెల్లటివోణీ తెలుపు బ్లవుజ్....స్వప్న అతిలోక సౌందర్యం నా యింటి గుమ్మాన్ని పావనం చేసింది.

"ర....ం...డి....రండి....రండి!" అన్నాను.

"రండి కాదు, రా స్వప్నా! అనాలి!" అన్నదామె.

నా మెదడులో నరాలు జివ్వుమన్నాయి. ఆమె నన్ను ప్రేమిస్తోంది. సందేహంలేదు.

"రా! స్వప్నా!" అన్నాను.

ఆమె స్లిప్పర్స్ బయట విడిచిపెట్టి లోపలకు వచ్చింది. నా బ్రహ్మచారి గది పావనమైపోయింది. గదంతా కొత్త వెలుగుతో ప్రకాశిస్తోంది. ఆమెకు కుర్చీ చూపించాను.

"నన్ను క్షమించండి!" అన్నది స్వప్న.

టిఫిను రెండు ప్లేట్లలో సర్దేవాడినల్లా వులిక్కిపడ్డాను.

"ఎందుకు?" అని అడిగాను.

"దెయ్యం గురించి మీతో వెటకారమాడాను కదా!"

"నీకు కనిపించిందా?"

"ఆఁ! రాత్రంతా పట్టుకు తినేసింది. మీకు ఈ విషయం తెలుసా?"

"ఏ విషయం?"

"మేమున్న యింట్లో ఒక స్త్రీని యెవరో హత్య చేశారట! హత్య సరిగ్గా నేను కేటాయించుకున్న గదిలో జరిగిందట!"

"ఆఁ!"

"అవునండి! రాత్రంతా ఒకటే పీడకల! బాగా డబ్బున్న స్త్రీ! ఆమె ఒంటిని విపరీతమైన విలువ కలిగిన నగలు! కలలో ఆమె ఏడుస్తూ కనిపించింది.

'అయ్యో....రక్షించండి....చచ్చిపోతున్నాను!' అని ఒకటే గోల!"

"ఏమయింది?" అని అడిగాను.

"ఆమెను ఎవరో తరుముతున్నారు. ఆమె చేతిలో దీపం వుంది. పాతకాలంనాటి పెద్దసైజు దీపం. చాలా విచిత్రంగా వుందది. దాన్ని మామూలుగా మోయలేమనిపించింది.

ఆమె దీపం నా చేతిలో వుంచి మాయమయింది. ఇదే పీడకల రాత్రంతా వచ్చింది. నాకు గుండెలు అవిసిపోయా యనుకోండి!"

స్వప్న మొహం చెమటలు క్రమ్మింది. ఆమెకు కల వచ్చిన మాట నిజమయ్యేవుంటుంది. అంత అందమైన అమ్మాయి అబద్ధం ఎందుకు చెబుతుంది? పైగా ఆర్తనాదా నికీ, ఆమెతూ లంకెకట్టి అనవసరంగా అనుమానించాను.

"దీపమా!" అన్నాను. నాకు అకస్మాత్తుగా రాజేష్ గుర్తుకు వచ్చాడు.

"అవునండి! దీపమే! 'అల్లావుద్దీన్ - అద్భుత దీపం' కథ తెలుసు కదా మీకు! ఆ కథలో వేసిన దీపం బొమ్మ లాగానే వుంది. చాలా పాతకాలంనాటి దీపం."

"ఈ దీపంలో కూడా ఎవడైనా రాక్షసుడు దాగి వున్నట్టు కలలో కనిపించిన స్త్రీ చెప్పిందా?" అన్నాను నవ్వుతూ.

"కావచ్చు కూడా! మాటిమాటికీ దీపం వైపు చూపిం చింది."

"అలాంటి దీపం మీరు యిదివరకు చూశారా?"

"వూహూ(!"

"ఒకసారి మీ యిల్లు తణిఖీ చేయాలి" హుందాగా తలూపాను. ఆమెమీద నాకు ఆధిపత్యం దొరికినట్టయింది.

ఆమె కళ్ళు తళతళలాడాయి.

ఇద్దరమూ టిఫిన్ తిన్నాం. గదికి తాళంపెట్టి బయ ల్దేరాం.

"నిన్న వచ్చిన పెద్దాయన " స్వప్న అంది.

"అక్కర్లేదు...." తుంచేశాను డాక్టర్ యింట్లోలేడు. అది కూడా మంచిదయింది. స్వప్నతో లభించిన ఏకాం

తాన్ని డాక్టర్‌గారి పరిశోధనలకి బలిపెట్టదల్చుకోలేదు.

మామిడి తోటలో ఆమెతో కలిసి నడుస్తూంటే నాకు హాయిగా వుంది. భవంతిలో అడుగుపెట్టాం. గుమ్మంలో ప్రవేశిస్తూంటే ఆమె శరీరం తాకింది. విద్యుత్తు తాకినట్టు తోచింది నాకు.

ఆమె కేటాయించుకున్న గదిలో యిద్దరమూ నిలబడ్డాం. గుమ్మానికెదురుగా పెద్ద కిటికీ వుంది. గోడలకు రెండు పెద్ద అలమారలున్నాయి. వాటికి తలుపులు వూడిపోయాయి. లోపలిప్రక్క కూడ గోడకు బెత్తిక లూడిపోయి పాత కాలంనాటి యిటుకలూ, సున్నం బయటపడుతున్నాయి. ఒక అలమారకు మధ్య చెక్కలు కూడా లేవు.

ఈ భవంతి మరో రెండు మూడు సంవత్సరాలలో కూలిపోతుంది.

"చెక్కలు లేని అలమారలోనే ఆమె నిలబడివుంది. నాకు దీపం అందిస్తోంది. అంతకుముందే ఆర్తనాదం చేసింది" అంది స్వప్న.

ఆమె నాకు అతిసన్నిహితంగా నిలబడివుంది. ఆమె వొంట్లోంచి సువాసన వస్తోంది.

"ఏమైనా చెప్పిందా?" అడిగాను తేరుకుంటూ.

"వుహూఁ!"

పై గదిలోంచి దగ్గు వినిపిస్తోంది. వాచీ చూసుకున్నాను. ఎనిమిదీ పద్దెనిమిది నడుస్తోంది. ఆర్తనాదం వినిపించడానికి మరో రెండు నిమిషాలు మిగిలాయి. కిటికీలోంచి పెరటివైపు చూచింది స్వప్న. ఆమెనే ఓరకంట గమనిస్తోన్నాను.

పంధొమ్మిది దాటి సెకండ్లు ముల్లు ఇరవయ్యో నిమిషంలో నడుస్తోంది. స్వప్న నాతో ఏదో మాట్లాడబోయింది.

ఆమె పెదిమలు కుడిచేతితో మూశాను.

"....అయ్యో ...రక్షించండి....చచ్చిపోతున్నాను...."

పెరట్లోంచి ఆర్తనాదం వినిపించింది. ఆ వెనుకనే పై నుండి ఏదో పడినట్టయింది.

కిటికీవద్దకు పరుగెత్తి వెలుపలికి చూశాను. పిచ్చిగా పెరిగిన మొక్కలు తప్ప ఏమీ కనిపించలేదు.

"స్వప్నా! నీకేమైనా కనిపించిందా?" అడిగాను నా గుండె కొట్టుకునే చప్పుడు నాకే విపరీతంగా వినిపిస్తోంది.

"వూఁ! అటుపోయి చూద్దామా? నాకేదో భయంగా వుంది." అందమైన ఆడపిల్ల ప్రక్కన పిరికితనం ప్రదర్శిస్తోంటే నాకు ధైర్యం వచ్చేసింది. ధైర్యంగా భవంతిని చుట్టి పెరట్లోకి వచ్చాను. పిచ్చిమొక్కలు కాలితో వెతుకుతూ హీరో భంగిమలు పెడుతున్నాను.

నా ధైర్యానికి కాటోలు స్వప్న కళ్ళు విప్పార్చుకుని చూస్తోంది.

పిచ్చి మొక్కలలో కాలెండర్ ప్రమాణంలో వున్న కాగితం కవిపించింది. ఆ కాగితం తప్ప అక్కడ వెతకవలసింది లేదు. వణుకును అదుపులో వుంచుకుని కాగితం అందుకున్నాను.

పాతకాలం నాటి కాగితం. వుందనా మాననా అన్నట్టు మాసిపోయిన రంగులతో కాగితంమీద బొమ్మ వుంది. బొమ్మను చూచి వులిక్కిపడ్డాను.

"లోపలికి వచ్చెయ్యండి! బయట వుంటే ప్రమాదం!" అరచింది స్వప్న.

ఆమె నన్ను ప్రేమిస్తోంది. లేకపోతే ఆమెకు నాపట్ల ఆసక్తి దేనికి?

లోపలికి నడిచి కాగితం నేలమీద పరచాను. బొమ్మలో

నిండుగా ఆభరణాలు ధరించిన యువతి నిలబడి వుంది. ఆమె చేతిలో టోర్నమెంట్ కప్పులాంటి అల్లావుద్దీన్ దీపం వుంది.

"ఈవిడనే చూశాను కలలో...." స్వప్న ఉద్రేకంగా అరచింది.

ఈ కాగితం ఎవరు పారేశారు? పైనున్న స్వప్న తండ్రా? అతడికి ఏం అవసరం? అసలు యీ వ్యవహారం అంతా దేనికి? పైకివెళ్ళి చూస్తే—?

"ఒక్కసారి మీ నాన్నగారిని చూడాలి!" అన్నాను.

ఆమె తలూపింది కాగితం అక్కడే వుంచి పైకి వెళ్ళాం. ముసలాయన కుక్కిమంచంలో నిద్రపోతున్నాడు. ఒత్తుగా పెరిగిన గడ్డమూ, మొహం ముడతలూ అతడి ఆకారాన్ని అస్పష్టం చేశాయి. దానికి తోడు మెడవరకూ దుప్పటి కప్పివుంది. ఆ గదిలో కిటికీ లేదు. ముసలాయన పెరట్లోకి కాగితం వదిలిపెట్టే వీలులేదు. అయినా ముసలాయన నిద్రపోతున్నాడు.

మేడమీద యితర గదులు మూసివున్నాయి. యిద్దరమూ క్రిందకు దిగాం.

ముసలాయన దగ్గుతున్నాడు నిద్రలో కాబోలు!

"ఏం చేద్దాం?" అడిగాను.

"ఎవరైనా పెద్దవాళ్ళను అడిగితేనో....ఆ దీపంవల్లనే ఆమె హత్యకు కుట్రజరిగిందేమో!" అన్నది స్వప్న.

ఉలిక్కిపడ్డాను. ఆమెను రాజేష్ హత్య చేయలేదు కదా! అలాంటి దీపం గురించి నాకు కొంత తెలుసు! ఆ దీపం యీ దీపం ఒకటేనా? ఒకటే అయితే యీ సందర్భంగా రాజేష్‌ను అనుమానించవలసిందే! వాడు పూరీ నుండి త్వరగా వస్తే బాగుండును.

"దీపంలోంచి అతీతశక్తి ఏదయినా వచ్చి ఆమెను ఎవరు హత్యచేశారో చెబితే బాగుండును!" అన్నాను.

"అసలు అలాంటి దీపం వుంటుందా?"

"వుంటుందా ఏమిటి? వుంది!"

స్వప్న నా చెయ్యి పట్టుకుంది. నాలో విద్యుత్తు ప్రసారం కావడం అప్పుడే రెండోసారి. ఈసారి విద్యుత్తు తీవ్ర రూపంలో ప్రసార మవుతోంది. ఆమె ఒంటి వొంపులు నన్ను తాకుతోన్నాయి.

"వున్నదా? దీపం ఎక్కడ వుంది?"

"అల్లావుద్దీన్ దాన్ని ఎక్కడ దాచాడో తెలుసు నాకు! వాడు అన్నీ యిలాంటి వస్తువులే సేకరిస్తాడు."

"అల్లావుద్దీనా? అతడెవరు?"

"రాజేష్. వాడి 'అపురూప వస్తువుల సేకరణ' నీకు తెలిసివుంటే యింతగా ఆశ్చర్యపోవు!"

"అచ్చగా యిలాంటి దీపమేనా?" ఆమె కళ్ళు పెద్ద వయాయి.

"వూఁ!" ఆమె చెక్కిళ్ళు అందుకున్నాను. "అయితే నేను మా వూరు వెళ్ళాలి. వారంరోజుల క్రితమే దాన్ని మా వూరు తీసుకు వెళ్ళమన్నాడు అల్లావుద్దీన్. ఆ దీపం కోసం అరబ్బు షేకులు వెంట పడుతున్నారట!"

ఆమె కిలకిల నవ్వి, "దీపంకోసం అరేబియా మాంత్రికులు ప్రయత్నిస్తున్నారన్న మాట!" అంది.

నేను పరవశించిపోయాను. స్వప్న నాదవుతోంది.

"డాక్టర్‌గారిని సంప్రదిస్తాను. దాని ఆధారంగా హంతకుడిని పట్టుకోవచ్చు. ఆయన అతీతశక్తుల గురించి ప్రయోగాలు చేస్తున్నాడు!" అన్నాను ఆమెను మెప్పించడానికి.

తరువాత పోస్టాఫీసుకు వెళ్ళి రాజేష్‌ని వెంటనే రమ్మని టెలిగ్రాం యిచ్చాను.

6

చీకటిలో నడుస్తున్నాం. చీకటిలో మామిడిచెట్లు తల విరగబోసుకున్న దెయ్యాల్లాగా వున్నాయి. వాతావరణం భయంకరంగా వుంది. ఈ దీపానికీ, రాజేష్‌కీ, చనిపోయిన యువతికీవున్న పరస్పర సంబంధం ఏమిటో తెలిపివస్తుంది.

ఈరాత్రికి దీపంలోకి ఆత్మను రప్పిస్తాడు డాక్టర్‌గారు. దీపం ఎక్కడవుంటే ఆమెకూడా అక్కడే వుండవచ్చును. దీపాన్ని స్వప్నకు చూపించి మరీ మరీ—అడిగిందంటే— ఆమెకూ దీపానికీవున్న సంబంధం అర్థం చేసుకోవచ్చును. అందుకే శ్రమపడి మావూరు వెళ్ళి ఆ అద్భుత దీపం తెచ్చాను.

అయినా స్వప్నను ఆ యువతి బారినుండి తప్పించడానికి యీ పని తప్పనిసరి! రాజేష్ ఎలాంటివాడో కూడా బయట పడాలి కదా!

డాక్టర్‌గారు చురుకుగా అడుగులు వేస్తోన్నాడు. నేను వెంబడించుతున్నాను. స్వప్న మాకోసం కళ్ళలో వొత్తులు వేసుకుని కాచుకూర్చుంది.

"మీ నాన్నగారు ." అడిగాను.

"హుష్....నిద్రపోతున్నారు. ఆయనకీ వయసులో యిలాంటి విషయాలు చెప్పి రక్తపుపోటును పెంచలేను!" అన్నదామె.

కిరసనాయిలు దీపం వెలుగులో మా నీడలు వికృతంగా పాకుతోన్నాయి స్వప్న నాకు కాఫీ యిచ్చింది.

"డాక్టర్‌గారికో ..." అన్నాను మెల్లగా.

"నేను వుపవాసం వున్నాను. ఆత్మలను రప్పించే

టప్పుడు చాల నిష్టగా వుంటాను?” అన్నాడు డాక్టర్‌గారు.

డాక్టర్‌గారిమీద నాకు గౌరవభావం కలిగి అంతలోనే పెరిగి ఎక్కువయిపోయింది. ఎంత విగ్రహశక్తి లేకపోతే డాక్టర్‌గారు స్వప్నను అతీతశక్తి బారినుండి రక్షించడానికి పూనుకుంటారు?

సమయం పదకొండు దాటుతోంది. గదిలో పొడవుపాటి బల్ల వేయించాడు డాక్టర్‌గారు. నేనూ, డాక్టర్‌గారూ, స్వప్నా ఆ బల్లమీద వరసగా కూర్చున్నాం.

“ఒకరి చేతులు ఒకరం పట్టుకుందాం! గదిలో చీకటి తాండవిస్తుంది. సరిగ్గా పన్నెండు గంటలు కావడంతో మన అందరిలోనూ శక్తి సమైక్యమవుతుంది. మానవశక్తి ముందుకు వస్తుంది అతీతశక్తి. అతీతశక్తిని నేను ప్రశ్నలు అడుగుతాను. కిరసనాయిలు దీపం ఆర్పివేయవమ్మా” అని అన్నాడు డాక్టర్‌గారు.

స్వప్న ఆయనమాట ప్రకారంగా దీపం ఆర్పివేసింది. బల్లమీద కూర్చుండి ఒకరిచెయ్యి ఒకరం పట్టుకున్నాం. అంతకు ముందే స్వప్న ఆ అద్భుత దీపాన్ని మేజాబల్లమీద వుంచింది.

చీకటిలో మాపూపిరి శబ్దంతప్ప ఏమీ వినిపించడంలేదు. మౌనంగా కూర్చున్నాం. నా గుండెలు కొట్టుకుంటున్నాయి.

క్షణాలు మెల్లగా నిమిషాల్లోకి కరుగుతున్నాయి. నా రేడియం వాచీ పదకొండూయాభై అయిదు చూపిస్తోంది. గదిలోని వాతావరణం భయంకర రూపం దాల్చుతోందని పిస్తోంది. మేము ముగ్గురం మాత్రమే కాకుండా గదిలో వూహకి అందని రూపమేదో సంచరిస్తోందనిపిస్తోంది.

“భయపడవద్దు! మనకేమీ భయంలేదు! మనం అతీత

శక్తికి వుపకారమే చేస్తున్నాం!" అన్నాడు డాక్టర్‌గారు.

అతడి మాటలు నాకు కొత్త శక్తి నిచ్చాయి.

పన్నెండయింది. గదిలో గాలి దుస్సహంగా వుంది. నాకు తల తిరుగుతోంది. ఎందువలన అలా తిరుగుతోందో తెలియడంలేదు. డాక్టర్‌గారి భుజంమీద తల వాల్చాను.

నాకు అంతే తెలుసు!

కళ్ళు తెరిచేటప్పటికి నేను నా గదిలోనే వున్నాను.

మోటార్‌సైకిలు ఏదో వస్తోన్న చప్పుడయింది. లేచి నిలబడ్డాను రాజేష్ గదిలోకి వచ్చాడు.

"పద, పోలీస్‌స్టేషన్‌కి వెళ్దాం. దారిలో అంతా చెబుతాను" అన్నాడతడు.

ఇద్దరమూ పోలీస్‌స్టేషన్ చేరుకున్నాము. కటకటాల వెనుక డాక్టర్‌గారూ, స్వప్నా కూర్చున్నారు. నన్ను చూచి తలవొంచుకున్నారు.

"డాక్టర్‌గారూ! దీపం అపహరించడానికి మీ పథకం అఖండంగా కొనసాగేదే! దీపంలో వజ్రాలు పొదిగినట్టు నాకు రాజేష్ చెప్పకపోతే మీమీద అనుమానం వచ్చేది కాదు. అదే దీపం స్వప్నకు కలలో కనిపించడమా, అది నాకు రుజువు చేయడానికి చిత్రపటం నాకంట పడెయ్యడమూ నాకు వింతగా తోచింది రాజేష్‌కి టెలిగ్రాం ఇచ్చాను. దీపంతో వచ్చి మీకు వశమైపోయినట్టు నటించాను. రాజేష్ తగిన సమయంలో అల్లావుద్దీన్‌లాగా వచ్చి లక్షలు విలువచేసే తన అద్భుత దీపం కాపాడుకున్నాడు" అన్నాను.

కటకటాల కవతల నిశ్శబ్దం రాజేష్ మాజీ ప్రియురాలు స్వప్న తలెత్తి చూడలేకపోతోంది — డాక్టర్‌తో చెయ్యి కలిపిన నేరానికి. □

శవంపక్క అగ్గిపెట్టె

— వసుంధర —

ఇన్‌స్పెక్టర్ చంద్రకాంత్, డిటెక్టివ్ కిల్లర్ కలిపి ఆ హాల్లో అడుగుపెట్టే సమయానికి – శవానికి కాస్త దూరంగా కూర్చుని ఏడుస్తోందో వృద్ధురాలు. ఆమెకు పక్కగా ఇద్దరు యువకులు, ఇద్దరు యువతులు నిలబడి మౌనంగా వున్నారు. శబ్దం వినపడకపోయినా వాళ్ళేడు

ష్తున్నట్టు తెలిసిపోతుంది చూడగానే!

శవం భూషణరావుది. ఆయన రాత్రి మామూలుగా భోంచేసి పడుకున్నాడు తన గదిలో. నిద్ర రావడంలేదని చాలాసేపు భార్యతో కబుర్లుకూడా చెప్పాడు. చివరకు భార్య కంటే ముందే నిద్రపోయాడు. భార్య నాగలక్ష్మమ్మ వుదయం నిద్రలేచేసరికాయన మంచంమీద లేడు. ఎక్కడికి వెళ్ళాడా అని తనూ లేచి ఆవిడ హాల్లోకి వచ్చింది. భూషణరావు హాల్లో వెల్లకితలా పడివున్నాడు. గుండెల్లోకి కత్తి దిగబడి వుంది.

కెవ్వున కేకపెట్టింది నాగలక్ష్మమ్మ.

ఆమె కేక విని ఆమె పెద్దకొడుకు జగదీష్, కోడలు సుందరి, రెండో కొడుకు అరుణ్, కూతురు నాగదేవి అక్కడికి పరుగున వచ్చి ఆ దృశ్యం చూశారు.

జగదీష్ వెంటనే—"ఇది హత్య—ఎవరూ ఏ వస్తువునూ తాకవద్దు. నేను పోలీసులకు ఫోన్‌చేస్తాను...." అన్నాడు.

ఆ దుఃఖ సమయంలోకూడా అందరూ భయపడ్డారు హత్య అనగానే. జగదీష్ పోలీసులకు ఫోన్‌చేసి జరిగిన విషయం చెప్పాడు.

ఇంట్లో వీళ్ళుకాక వ ం ట మ ని షి రమణమ్మకూడా వుంటుంది. ఇద్దరు పనివాళ్ళున్నారు. వారిలో ఒకడు రోజూ వుదయం ఎనిమిది గంటలకు వచ్చి సాయంత్రం ఆరింటిదాకా వుండి వెళ్ళిపోతాడు. రెండోవాడు ఆవరణలో వున్న ఔట్‌హౌస్‌లో వుంటున్నాడు. వాడికి పాతికేళ్ళు. పెళ్ళికూడా ఇటీవలే అయింది. చంద్రం; సీత—వాళ్ళ పేర్లు.

భూషణరావు అల్లుడు, నాగదేవి భర్త అయిన కరు

శేఖర్ నిన్న రాత్రే ఊరికి వెళ్ళాడు.

అప్పుడు సమయం ఏడుగంటలయింది.

చంద్రకాంత్ హత్య గురించిన పై సమాచారమంతా సేకరిస్తూంటే కిల్లర్ శ్రద్ధగా విన్నాడు. వేలిముద్రల నిపుణుడు పోలీసు డాక్టరు తమ పనుల్లో వున్నారు.

శవం దగ్గర చెప్పుకోతగ్గ సమాచారమేదీలేదు. కానీ ఓ అగ్గిపెట్టి పడివుంది. తమాషాగా వుందా అగ్గిపెట్టి. మామూలు అగ్గిపెట్టెల రంగులోకాక పూర్తి ఆకుపచ్చ రంగులో వున్నదది. దానిమీద ఏ లేబులూ లేదు. అగ్గిపెట్టె లోపల ఆరు పుల్లలున్నాయి.

కిల్లర్ అది అందుకుని ఓ పుల్ల గీపి వెలిగించాడు. మంట ఆకుపచ్చగా వచ్చింది వేడి బాగా ఎక్కువగా వుంది. పుల్ల చాలాసేపు నిలిచి కాలింది.

"ఇలాటి అగ్గిపెట్టె నే నెక్కడా చూడలేదు—" అన్నాడు చంద్రకాంత్.

కిల్లర్ మాట్లాడలేదు. అతడా పెట్టెను మౌనంగానే చంద్రకాంత్ కందించాడు.

పోలీస్ డాక్టరు ఇనస్పెక్టర్ని సమీపించి—"మరణం కత్తిపోటువల్లనే సంభవించింది. చాలా బలంగా పొడిచారు. పొడిచీ పొడవగానే ప్రాణంపోయి వుంటుంది. హత్య సుమారు అయిదుగంటల ప్రాంతంలో జరిగింది...." అన్నాడు.

ఫొటోగ్రాఫర్ వివిధ కోణాల్లోంచి హత్యాస్థలాన్ని ఫొటోలు తీశాడు.

"మీరిక్కడ ఏమీ కదపలేదుకదూ!" అన్నాడు చంద్ర కాంత్ మరోసారి జగదీష్‌తో.

"లేదు"—అన్నాడు జగదీష్.

"శవాన్ని పోస్టుమార్టంకు పంపించాలి" అన్నాడు చంద్రకాంత్.

"మీ ఫార్మాలిటీస్‌కు మేమడ్డురాము. మా సెంటిమెంట్సు దెబ్బ తినకుండా త్వరగా మాకు శవాన్ని అప్పగించండి." అన్నాడు జగదీష్.

తర్వాత అక్కడ ఆ కుటుంబ సభ్యులుకాక చంద్రకాంత్, డిటెక్టివ్ కిల్లర్ మిగిలారు. శవాన్ని తీసుకుని పోలీసులు, ఇతర నిపుణులు వెళ్ళిపోయారు.

"ఈయన డిటెక్టివ్ కిల్లర్। పరిశోధనలో ఈయనకీయనే సాటి. కోడిగుడ్డుకు ఈకలు తీస్తాడు. స్నేహపూర్వకంగా నాతో మాట్లాడ్డానికొస్తే—మీ దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది. ఈయనా నాతోపాటు వచ్చాడు" అంటూ చంద్రకాంత్ కిల్లర్ని వారికి పరిచయం చేశాడు.

వారందరూ దుఃఖసముద్రంలో మునిగివున్న మూలాన కిల్లర్‌గురించి ప్రత్యేకమైన ఆసక్తి చూపించలేదు.

చంద్రకాంత్ అక్కడున్నవారందరినీ ఎవరెవరేం చేస్తున్నదీ ప్రశ్నలు వేశాడు. అంతా నిద్రపోతున్నారు. తల్లి కేక విని లేచి పరుగునవచ్చారు.

"వంటమనిషి రమణమ్మ ఏమయింది?" అన్నాడు కిల్లర్.

"ఆవిడింకా నిద్రపోతోంది. మొద్దునిద్ర ఆవిడది. సాధారణంగా మా యింట్లో ఎవ్వరూ ఏడుకి ముందు లేవరు...." అన్నాడు జగదీష్.

"ఇప్పుడు ఏడు దాటింది. ఈ పాటికందరూ కాఫీలు తాగరా?" అన్నాడు కిల్లర్.

"కాఫీ—ఆ సంగతే మరిచిపోయామీరోజు. ఎవరైనా లేపితే తప్ప నిద్ర లేవదావిడ" అంది జగదీష్ భార్య

సుందరి.

"ఒక్కసారి ఆవిణ్ణి పిలవండి" అన్నాడు కిల్లర్.

సుందరి లోపలకు వెళ్ళింది. కాసేపట్లోనే కంగారుగా తిరిగివచ్చి - "ఎంత లేపినా లేవడంలేదావిడ—నాకేమిటో భయంగావుంది-" అంది.

చంద్రకాంత్, కిల్లర్—అటు పరుగెత్తారు.

అదో చిన్నగది. అందులో ఓ మడతమంచం. దానిపై మెత్తటి పరుపు. పరుపుమీద వళ్ళు తెలియకుండా పడివుంది రమణమ్మ.

కిల్లర్ చటుక్కున ఆమెను సమీపించి చేయిపట్టుకుని నాడి పరీక్షించి - "నిక్షేపంలావుంది. ఏ నిద్రమాత్రలో మింగి వుంటుంది" అన్నాడు.

చంద్రకాంత్ తేలిగ్గా నిట్టూర్చి- "నిద్రమాత్రలు వేసుకునే అలవాటుందా ఈవిడకి" అనడిగాడు.

"ఆ సంగతి తెలియదుకానీ—నిద్రపట్టడం లేదని అస్తమానూ అంటూంటుంది" అంది నాగలక్ష్మమ్మ.

"ఈవిడ లేస్తే బాగుండును. అర్జంటుగా కొన్ని ప్రశ్నలడగాలి." అన్నాడు కిల్లర్.

"ఇంతమంది వుండగా—ఈవిణ్ణడిగి తెలుసుకోవలసిన ప్రశ్నలేమున్నాయి?" అన్నాడు చంద్రకాంత్ ఆశ్చర్యంగా.

"వంటమనిషికదా—అగ్గిపెట్టె గురించి తెలుస్తుందని" అన్నాడు కిల్లర్ తాపీగా.

"అగ్గిపెట్టె సిగరెట్లుకాల్చే ఏమగాళ్ళదో అయుండవచ్చు. వంటమనిషికే దానిగురించి తెలియాలనేముంది?" అన్నాడు చంద్రకాంత్.

"ఇందాకా నువ్వా అగ్గిపెట్టె తీసినపుడు—నేను పుల్ల

వెలిగించినపుడు వీళ్ళెవ్వరూ మాట్లాడలేదు. అంటే దాని గురించి వీళ్ళెవ్వరికీ తెలియదన్నమాటే కదా! అందులోనూ ఇది మామూలు అగ్గిపెట్టె కాదు. కొత్తరకంగా కూడా వుంది." అన్నాడు కిల్లర్.

భూషణరావు కొడుకులు జగదీష్, అరుణ్ ముఖముఖాలు చూసుకున్నారు. వాళ్ళ కళ్ళేవో మాట్లాడుకుంటున్నట్లు గ్రహించాడు కిల్లర్.

"మిస్టర్ చంద్రకాంత్—మనం ఒక్కొక్కరినే విడిగా ప్రశ్నలు వేయడం మంచిది. హత్యకేసు ఇప్పటికిప్పుడే తేలిపోతుంది" అన్నాడు కిల్లర్.

చంద్రకాంత్ అతడివంక ఆశ్చర్యంగా చూశాడు.

2

"నాగలక్ష్మమ్మగారూ! ఈ దుఃఖ సమయంలో మిమ్మల్ని ప్రశ్నలతో విసిగించవలసి వస్తున్నందుకు విచారంగా వుంది. కానీ మీ భర్తను చంపిన దుర్మార్గుణ్ణి పట్టించడానికి మీరు సహకరించక తప్పదు" అన్నాడు కిల్లర్.

"అడగండి—చెబుతాను" అంది నాగలక్ష్మమ్మ.

"మీ భర్తను హత్యచేయడానికెవరికైనా బలమైన కారణాలున్నాయా?" అనడిగాడు కిల్లర్.

"ఉన్నాయి...." అంది నాగలక్ష్మమ్మ — "ఇటీవల ఆయనకు వ్యాపారంలో చాలా ఎదురుదెబ్బలు తగిలాయి. ముందాయన దురదృష్టం—అనుకున్నారు. కానీ బిజినెస్ పార్టనర్ చంద్రస్వామి మోసగిస్తున్నట్లు వారంరోజుల క్రితమే అర్థమయింది. ఆయన చంద్రస్వామిని ఇంటికి పిలిచారు. ఇద్దరూ బాగా ఘర్షణపడ్డారు. నాతో గొడవ పెట్టుకుంటే నీ ప్రాణాలు నీకు దక్కవు—అని చంద్రస్వామి ఆయన్ను బెదిరించాడు...."

"అంటే చంద్రస్వామి ఈ హత్య చేసి వుంటా డంటారా?"

"చంద్రస్వామి తనను మోసం చేస్తున్నట్లు బలమైన సాక్ష్యాధారాలున్నాయని ఆయనన్నారు. అది నిజమే అయుండాలి. రెండు రోజులక్రితం చంద్రస్వామి మా యింటికొచ్చి—తనను మన్నించమనీ, కోర్టుకీద్వపద్దనీ, అంచెలంచెలమీద తను మావారి నష్టం పూడుస్తాననీ మాటిచ్చాడు. అతడు వెళ్ళిపోయాక మావారు-అదంతా నయవంచన అన్నారు. మన జాగ్రత్తలో మనముండాలని నాతో మరీ మరీ చెప్పారు....

"చంద్రస్వామిపైన కాక మీకింకెవరిమీదనైనా అను మానముందా?"

"లేదు...."

"పోనీ వేరెవరికైనా హత్యకు కారణాలున్నాయా?"

"నాకు తెలియదు...."

కిల్లర్ ఆమెకు చేతులు జోడించి నమస్కరించి— "మీరిక వెళ్ళొచ్చు" అన్నాడు.

నాగలక్ష్మమ్మ క్షణం తటపటాయించి—"మీరు చూసిన అగ్గిపెట్టె మా అల్లుడు కరుణేశ్వర్‌ది. కానీ అతడు రాత్రి ఊళ్ళోలేడు. సరిగ్గా ఏడుగంటలకు బయల్దేరి మద్రాసు వెళ్లాడు. అగ్గిపెట్టె మావారి దగ్గరకెలావచ్చిందో నాకు తెలియదు" అంది.

* * *

"ఈ హత్య చంద్రస్వామి చేశాడనడంలో సందేహం లేదు-" అన్నాడు జగదీష్.

"హత్య ఎలా చేశాడంటారు?" అన్నాడు కిల్లర్.

జగదీష్ ఓ క్షణం ఆలోచించి—"అందుకు వీరన్నని

నియమించి వుంటాడు....'' అన్నాడు.

"వీరన్న ఎవరు?"

"మా నాన్నగారు అన్ని విషయాల్లోనూ ముక్కుకు సూటిగా పోయేమనిషి. వ్యాపారంలో అక్రమంగా ఆర్జించ డంకోసం చంద్రస్వామి అడ్డమైన దార్లూతొక్కుతాడు. ఈ విషయాల్లో ఇద్దరూ బాగా ఘర్షణపడేవారు. నాన్నగారతడి వ్యవహారాలు పోలీసులకు చెబుతానని బెదిరించారు. ఆ మర్నాడు వీరన్న మా ఆఫీసుకువచ్చాడు. నాతో—"బాబు గారూ, మీరైనా నాన్నగారికి చెప్పండి. చంద్రస్వామిగారి గొడవలు పోలీసులదాకా వెడితే—నేను కలగజేసుకోక తప్పదు. ఏ వ్యవహారంలో నేను కలగజేసుకున్నా కొందరి ప్రాణాలు పోతాయి" అని చెప్పి వెళ్ళాడు. ఆ తర్వాత వీరన్న గురించి వాకబు చేశాను. వాడు చాలా పెద్ద గూండా అని తెలిసింది."

"అంటే చంద్రస్వామి వీరన్నచేత హత్య చేయించా డంటారా?"

"అవును."

"అందుకు అనుమానమేనా—వేరే ఆధారాలున్నాయా?"

"మీరు చూపిన అగ్గిపెట్టె నేను వీరన్నదగ్గర చూశాను. నా వద్దకు వచ్చినపుడతడు ఆ అగ్గిపెట్టె తీసి బీడీ వెలిగించు కున్నాడు."

చంద్రకాంత్, కిల్లర్ ముఖముఖాలు చూసుకున్నారు.

* * *

"నాన్నగారి వ్యాపారం గొడవలు నాకాట్టే తెలియవు. కానీ చంద్రస్వామికీ ఆయనకూ పడడంలేదని మా ఇంట్లో అనుకునేవారు. ఆయనేదో చేస్తాడని యింట్లో అంతా భయ పడుతూంటే నేను కంగారుపడి నిన్ననే ఆయన్నడిగాను.

ఆయన నవ్వి- "ఇన్నేళ్ళుగా వ్యాపారంలో అనుభవం సంపాదించిన నా వంటిమీద ఎవ్వరూ చేయి వేయలేరు. తలచుకుంటే చంద్రస్వామిని నేను కాలరాయగలను. మసి చేయగలను. అతడి తొత్తు వీరన్నకు—అతడికంటే నేనంటేనే భయం. అందుకే వాడు నన్ను బెదిరించే ధైర్యంలేక అన్నయ్యదగ్గరకు వెళ్లాడు. నువ్వేమీ భయ పడకు" అన్నారు. కానీ ఈవేళ ఇలాగయింది" అన్నాడు అరుణ్.

"మీ కెవరిమీదైనా అనుమానముందా?"

"అనుమానం లేదుకానీ ఒక విషయం ఆశ్చర్యంగా వుంది."

"ఏమిటది?"

"మా యింటికి రోజూ ఉదయం ఎనిమిదింటికి వచ్చి— ఇంట్లో ఏ పని చెప్పినా చేసి సాయంత్రం ఆరింటికి వెళ్ళి పోతూంటాడు వాడి పేరు రాజు. ఇందాకా మీరు చూపిన అగ్గిపెట్టెను—నిన్నసాయంత్రం నేను వాడిదగ్గరచూశాను."

* * *

"మా మామగారు దేవుడు. నాకు తండ్రిపోయి అయిదేళ్ళ యింది. మామగారిలో తండ్రిని చూసుకుంటున్నాను." అంది జగదీప్ భార్య సుందరి.

"దేవుడు అవతారాలెత్తినపుడు అవతారపురుషుల్నారా ధించిన వాళ్ళూ వున్నారు. ద్వేషంతో అంతంచేయాలను కున్నవాళ్ళూ ఉన్నారు. మీ మామగారి విషయంలో అలాంటి వాళ్ళెవరైనా వుండొచ్చుకదా!"

సుందరి తలూపి "మీరు చెప్పింది అక్షరాలా నిజం. అలాంటివాళ్ళు మా యింట్లోనే వున్నారు" అంది.

"ఎవరు?" అన్నాడు కిల్లర్ ఆశ్చర్యంగా.

"మా అత్తగారు—నాగలక్ష్మమ్మ!"

కిల్లర్ తెల్లబోయి "మీరు చెప్పేది నమ్మతగ్గదిగా లేదు. ఏ భార్యా తనభర్త అంతంకోరదు" అన్నాడు.

"ఆవిడకిప్పుడు భర్తతో అవసరమేముంది? అభిమానించే బిడ్డలున్నారు. వయసైపోయింది" అంది సుందరి.

"అయితే మాత్రం భర్తను ద్వేషించడమెందుకు?"

"కూతురిమీద ప్రేమతో!"

కిల్లర్ ఆశ్చర్యం పెరిగింది "మీరు చెప్పదల్చుకున్నది సూటిగా చెప్పండి" అన్నాడతడు. ఈ కొత్తవిశేషం చంద్రకాంత్‌లో కూడా కుతూహలాన్ని పెంచింది.

"చెబుతాను" అని గొంతు సవరించుకుంది సుందరి.

నాగలక్ష్మమ్మ కూతురు నాగదేవికి రెండు సంవత్సరాల క్రితం వివాహమయింది. అల్లుడు కరుణేశ్వర్ విదేశాల నుండి బిజినెస్ ట్రయినింగ్‌పొంది తిరిగివచ్చాడు. వాళ్ళు మద్రాసులో వుంటున్నారు. అక్కడ వ్యాపారంలో దెబ్బతిని రెండు నెలల క్రితం దంపతులిద్దరూ ఇక్కడికేవచ్చి మకాం పెట్టారు.

కరుణేశ్వర్‌కి కొత్తగా వ్యాపారం ప్రారంభించడానికి రెండు లక్షలు కావాలి. కూతురు తల్లినడిగింది. ఆమె భూషణరావు నడిగింది. భూషణరావుకు వ్యాపారం బాగా నడవడంలేదు. ప్రస్తుతానికి తనేమీ చేయలేనన్నాడాయన. తన పరిస్థితి బాగుపడేవరకూ కూతుర్నీ, అల్లుణ్ణీ తమతో పాటే వుండిపొమ్మన్నాడు. కరుణేశ్వరందుకు సుముఖంగా లేడు.

క్షణాలమీద లక్షలు సంపాదించే మార్గం తనకు తెలిసిందనీ—అందుకు మామగారి సహకారం కావాలనీ అతడు నాగలక్ష్మమ్మకు చెప్పాడు. కరుణేశ్వర్ సూచనలు

భూషణరావు వినలేదు. ఫలితంగా భార్యాభర్తలిద్దరూ గొడవ పడుతూండేవారు. చివరికో రోజున నాగలక్ష్మమ్మ భర్తతో- మీ అల్లుడు మీ సహకారం లేకుండానే తను లక్షలు సంపాదిస్తాట్ట" అని చెప్పింది.

భూషణరావు మండిపడ్డాడు—"నా యింట్లో అలాంటి పనులు నేను సహించను" అన్నాడు.

"మీరలాగంటే అల్లుడింట్లోంచి వెళ్ళిపోతానంటాడు" అంది నాగలక్ష్మమ్మ.

"ఇంట్లోంచి వెళ్ళిపోయినాసరే—నా అల్లుడైనందుకు నా కంఠంలో ప్రాణముండగా అతడి పద్ధతులు నేనామోదించను" అన్నాడు భూషణరావు.

"మీ కంఠంలో ప్రాణముండి అందర్నీ కష్టపెడుతోంది—" అంది నాగలక్ష్మమ్మ.

"ఈ సంభాషణ మీరు విన్నారా?" అన్నాడు కిల్లర్.

"లేదు—మామగారు నాకు చెప్పుకుని బాధపడ్డారు."

"మీకే ఎందుకు చెప్పుకున్నారు?"

"పెళ్ళై యింట్లో అడుగుపెట్టి నప్పట్నించీ ఆయన నన్నభిమానించారు. వ్యాపారం బాగా నడపడంలేదని తెలిపి నప్పట్నించీ మా అత్తగారాయన జీవితం నరకంచేశారు. మొదట్నించీ ఆవిడది సాధింపుగుణంట....కష్టమైనా సుఖమైనా ఆయన నాతోనే చెప్పుకునేవారు" అంది సుందరి.

"అయితే ఈ హత్య ఎవరు చేసి వుంటారు?"

"అది నేను చెప్పలేను. కానీ కరుణేశ్వర్‌కీ, మా అత్తగారికీ కూడా ఆయన బ్రతికుండడం ఇష్టంలేదు."

"మీరింకా ఏమైనా చెప్పవలసిందుందా?"

"లేదు." అని లేచి వెనక్కు తిరిగి గుమ్మందాకా వెళ్ళి ఒకసారి వెనక్కు తిరిగి మళ్ళీ చంద్రకాంత్‌నీ, కిల్లర్‌నీ

సమీపించి "అన్నట్లు చెప్పడం మరిచాను. శవం పక్కన మీరు చూపిన అగ్గిపెట్టెను నేను మా అత్తగారి పూజా మందిరంలో చూశాను" అంది.

కిల్లర్ ఆశ్చర్యంగా ఆమెవంక చూశాడు.

* * *

"రెండు నెలల్నించి ఇక్కడే వుంటున్నాము. రోజు లెంతో సరదాగా గడిచిపోతున్నాయి. ఈ వేళ ఇలా జరిగింది" కళ్ళు తుడుచుకుంటూ అంది నాగదేవి.

"నిన్న ఆఖరుసారిగా మీ నాన్నగారితో ఎప్పుడు మాట్లాడారు?"

"రాత్రి—భోజనాల సమయంలో!" అంది నాగదేవి.

"ఏం మాట్లాడారు?"

"ఏవో—మామూలు మాటలు!"

"అప్పుడాయన ఎలా వున్నారు?"

"అంటే?" అంది నాగదేవి.

"రోజూలాగే వున్నారా-లేక ఏదైనా మార్పు కనబడిందా?" అన్నాడు కిల్లర్.

"అప్పుడేం తెలియలేదుగానీ—ఇప్పుడాలోచిస్తూంటే అనిపిస్తోంది—అప్పుడాయన అదోలా వున్నారని."

"అంటే?"

"నువ్వమాయకురాలివమ్మా-ఎలా బ్రతుకుతావో ఏమిటో అన్నారాయన. మీరుండగా నాకేంలోటు నాన్నా అన్నాను. ఆడపిల్లలోటు తండ్రి తీర్చలేడనీ, భర్తే తీర్చాలనీ ఆయ నన్నారు. నేను మాట్లాడకపోతే మళ్ళీ పలకరించి—ఈ లోకంలో ఏ మనిషీ శాశ్వతంకాదు. రేపు నాకేదైనా అయితే నువ్వు నీ బ్రతుకు బ్రతగ్గలగాలి-అన్నారు. ఎప్పటి మాటలే అనుకున్నానుగానీ నిజంగానే ఆయన చనిపోతారని

నేననుకోలేదు" అంది నాగదేవి.

"అంటే తను పోతానని మీ నాన్నగారికి ముందే తెలుసంటారా?"

"ఏమో-చెప్పలేనుకానీ-కొద్దికాలంగా నాన్నగారికి జీవితమంటే విరక్తిగా వుంటోంది. అందుకు మావారు కూడా కొంత కారణం. నాన్నగారు పాతకాలం మనిషి. ఆ పాతకాలం పద్ధతులవల్ల వ్యాపారంలో నష్టపోయారాయన. ఇంట్లో పరిస్థితి అంత బాగోలేదు. ఆ నష్టమంతా పూడ్చడానికి మావారు కొత్తపద్ధతులు చెప్పారు. అదాయనకు నచ్చలేదు. అమ్మకు నచ్చింది. ఈ విషయమై ఇద్దరూ ఘర్షణ పడుతూండేవారు. నాన్నగారు తరచుగా నన్ను పిలిచి జాలి పడుతూండేవారు.

ఆయనకు నా గురించి బెంగ ఎందుకో తెలియలేదు. మావారంటే ఆయనకు సదభిప్రాయంలేదు. కానీ నిజానికి మావారు చాలా మంచివారు. నాన్నగారికి సాయపడాలనే ఆయన తాపత్రయం. నిన్ననే ఇంట్లో మళ్ళీ గొడవకాగా మావారికోపం వచ్చి మద్రాసు వెళ్ళిపోయారు. అక్కడ అన్ని ఏర్పాట్లూ చూసి నన్ను తీసుకుని వెడతానన్నారు."

"చాలా మంచి సమాచారం చెప్పారు థాంక్స్!" అని- "మీ నాన్నగారి శవం పక్కన అగ్గిపెట్టె ఒకటివుంది. దాని గురించి మీకేమైనా తెలుసా?" అన్నాడు కిల్లర్.

"అది చంద్రానిది" అంది నాగదేవి చటుక్కున "ఒకసారి బోట్‌హౌస్‌లో వాడి చేతిలో చూశాను."

చంద్రకాంత్ తలపట్టుకున్నాడు.

* * *

రెండుగ్లాసులలో కాఫీ తీసుకుని వచ్చింది రమణమ్మ. కిల్లర్, చంద్రకాంత్ ఇద్దరూ కాఫీగ్లాసులందుకున్నారు.

"రమణమ్మగారూ! మీరు చాలా మొద్దునిద్ర పోయారు. నిద్రమాత్రలు వేసుకున్నారా?" అన్నాడు కిల్లర్.

"అవును" అంది రమణమ్మ.

"రోజూ వేసుకుంటారా?"

"అప్పుడప్పుడు నిద్ర పట్టనప్పుడు వేసుకుంటాను."

"నిన్న మీకు నిద్రెందుకు పట్టలేదు"

"కారణం—చెప్పలేను."

"మీకు నిద్రపట్టింది. తెల్లవారుఝామున అలికిడికి మెలకువ వచ్చింది. హాల్లోకి వచ్చారు. భూషణరావుగారు హత్య కావించబడడం చూశారు. భయంవేసింది. నిద్ర మాత్రలు వేసుకుని పడుకున్నారు. అవునా?" అన్నాడు కిల్లర్.

రమణమ్మ తడబడుతూ "హత్య నేను చూడలేదు కానీ చచ్చి పడివున్న భూషణరావుగారిని చూశాను" అంది.

"మరి వెంటనే కేకలు వేయలేదేం?"

"ఈ వయసులో నేను వంటచేసుకుంటూ బ్రతకడానికదే కారణం. మంచి వుద్యోగంలో వున్న నా భర్త హత్య కేసులో అన్యాయంగా ఇరుక్కున్నాడు. కళ్ళెదుట జరిగిన హత్యగురించి పోలీసు రిపోర్టివ్వడం ఆయన చేసిన నేరం. యిప్పుడు యావజ్జీవకారాగారశిక్ష అనుభవిస్తున్నాడు. నాకు పిల్లలులేరు. బంధువులు వెలివేశారు" అంది రమణమ్మ.

కిల్లర్ వెంటనే "మీ భర్త వివరాలు పూర్తిగాచెప్పండి. ఆయనకు నేను సాయపడగలనేమో!" అన్నాడు.

రమణమ్మ తన భర్తగురించిన వివరాలు చెప్పింది.

"రమణమ్మగారూ! భూషణరావు హత్యగురించి మీ అభిప్రాయమేమిటి? ఎవరి మీదనైనా మీకు అనుమానముందా?" అన్నాడు కిల్లర్.

"ఈ యిల్లొక తమాషాయిల్లు. అందరూ డబ్బు మనుషులు. తల్లికూడా డబ్బుకోసం కన్నకొడుకుని హత్య చేయడానికి వెనుకాడని యిల్లిది. అన్నకు తమ్ముడవసరంలేదు. చెల్లికి అన్నవసరంలేదు. అందరూ ఒకరినొకరు మోసం చేసుకుందుకు చూస్తున్న యిల్లిది. అందువల్ల ఈ యింట్లో ఎవ్వరైనా భూషణరావుని చంపివుంటే నేనాశ్చర్యపోను."

"భూషణరావెలాంటివాడు?"

"మానసికంగా ఆయనకేవో బాధలున్నాయనిపిస్తుంది. మనిషి మంచివాడు. పనివాళ్ళను కూడా గౌరవిస్తాడు."

"మీ కిచ్చే గౌరవాన్ని బట్టి చెబుతున్నారా—లేక?"

"లేదు—చంద్రాన్నీ, సీతనూ, రాజునూ కూడా ఆయనెంతో గౌరవంగా చూస్తాడు...." అంది రమణమ్మ నమ్మకంగా.

"మాకు పనికివచ్చే సమాచారం ఇంకేదైనా నాకు చెప్పగలరా?"

రమణమ్మ ఒక్కక్షణం ఆలోచించి—"ఆవేవో కొత్తరకం అగ్గిపెట్టెలు....ఆకుపచ్చ రంగులో వుంటాయి. అందులో ఆరే పుల్లలుంటాయి. ఆయన అవి నాకిచ్చి అగ్గిపెట్టెలతో పాటు దాచమంటూండేవాడు. వాటిని వాడవద్దనీ తనడిగినప్పుడిస్తూండమనీ అనేవాడు. అదెందుకో నాకర్థం కాలేదు" అంది.

కిల్లర్ కళ్ళు పెద్దవయ్యాయి "ఇప్పుడు మీ దగ్గర ఇంకా ఆ అగ్గిపెట్టెలున్నాయా?"

"లేవు—ఒకే ఒక్క పెట్టి వుంటే నిన్ననే తీసుకున్నారాయన."

* * *

"నమస్కారమండి—నా పేరు రాజు" అన్నాడతడు దిగు

లుగా.

"భూషణరావుగారిని కత్తితో పొడిచి చంపేశారు. నువ్వే హంతకుడివనడానికి ఆధారాలున్నాయి" అన్నాడు కిల్లర్ చటుక్కున.

రాజు తెల్లబోయి బిక్కమొహం వేశాడు "ఆయన్ను నేనెందుకు చంపుతానండీ?" అన్నాడు.

"అదీ నువ్వే చెప్పాలి. శవంపక్కన ఓ ఆకుపచ్చ రంగు అగ్గిపెట్టె పడివుంది. అది నీదేనని యింటిల్లపాదీ చెప్పారు."

రాజు చటుక్కున—"ఆ అగ్గిపెట్టా?" అన్నాడు.

"అదే—నీ దగ్గరున్న అగ్గిపెట్టె శవం పక్కకెలా వచ్చింది?"

"అది నా దగ్గరలేదు. ఒకసారి అరుణ్‌బాబు దగ్గర చూశాను. సరదాపడి నాకిమ్మని అడిగాను. అది చాలా ప్రమాదకరమైనదని చెప్పాడాయన. అంతే నాకు తెలుసు."

"నీకు అరుణ్‌బాబుతో ఏమైనా గొడవుందా?"

"పెద్దవాళ్ళతో మేమెందుకు గొడవపెట్టుకుంటాం?" అన్నాడు రాజు.

"భూషణరావెలాంటివాడు?"

"ఆయనెంతో మర్యాదస్థుడు."

"ఆయన్నెవరు చంపివుంటారు?"

"నాకు తెలిసినంతవరకూ ఆయన్నెవ్వరూ చంపాలనుకోరు బాబూ! ఆయన చాలా మంచిమనిషి" అన్నాడు రాజు.

* * *

చంద్రంకూడా భూషణరావు నెంతగానో పొగిడాడు. అగ్గిపెట్టె గురించి తనకేమీ తెలియదన్నాడు వాడు.

"నీ దగ్గర అగ్గిపెట్టె చూపినట్లు నాగదేవి చెప్పింది" అన్నాడు కిల్లర్.

చంద్రం వెంటనే—"ఆ అమ్మకు నేనంటే కోపం—" అన్నాడు.

"ఎందుకని?"

"పెద్దింటోళ్ళు—నీతి వుండదు" అన్నాడు చంద్రం.

కిల్లర్ ఆశ్చర్యంగా చంద్రాన్ని చూశాడు. చంద్రానిది మంచి పెర్సనాలిటీ. హీరోలా వుంటాడు. రంగుమాత్రం చామనఛాయ.

"అంటే?" అన్నాడు కిల్లర్.

"ఆ అమ్మ నేనంటే యిష్టపడింది. ఇంట్లో తెలిస్తే చంపేస్తారని భయపడి నేను ఒప్పుకోలేదు. మా యిద్దరిలో తప్పెవరు చేసినా శిక్ష నాకేనని తెలుసు."

చంద్రం వెళ్ళిపోయాక—"వీడు నిజమే చెబుతున్నాడంటావా?" అన్నాడు చంద్రకాంత్.

"నాకు నమ్మకం లేదు. నాగదేవి అమాయకురాలిలా కనబడుతోంది. వీడితో చనువుగా మాట్లాడి వుండవచ్చు. కొంతమంది తమ ఊహలనే అనుభవాలుగా యితరులకు చెప్పుకుంటారు" అన్నాడు కిల్లర్.

సీతనుంచి వారికి పనికొచ్చే సమాచారమేమీ దొరకలేదు.

3

చంద్రకాంత్, కిల్లర్లు కలసి మరికొన్ని చోట్లకు వెళ్ళారు. భూషణరావుకు ఊరిచివర ఓ షుగర్ ఫ్యాక్టరీ, పిగ్మెంట్ ఫ్యాక్టరీ వున్నాయి. అక్కడ వారికి పెద్దగా సమాచారం దొరకలేదు కానీ భూషణరావు పనివాళ్ళతో కఠినంగానూ, అమర్యాదకరంగానూ వుంటాడని తెలిసింది.

ఇద్దరూ కలిసి చంద్రస్వామి ఇంటికి వెళ్ళారు. వాళ్ళ

వెళ్ళే సమయానికి చంద్రస్వామి ఏదో ఉత్తరం చదువు తున్నాడు. ఆయన వీళ్ళవంక ప్రశ్నార్థకంగా చూశాడు.

చంద్రకాంత్ తనతోపాటు కిల్లర్ని కూడా చంద్రస్వామికి పరిచయంచేసి భూషణరావు హత్య గురించి చెప్పాడు.

"అయితే భూషణం అన్నంతపనీ చేశాడన్న మాట!" అన్నాడు చంద్రస్వామి ఆశ్చర్యంగా. కిల్లర్ ఏదో అడిగే లోగానే ఆయన తన చేతిలోని ఉత్తరాన్ని వారికిచ్చాడు.

"డియర్ చంద్రస్వామీ! నీ మాటలు పెడచెవిని పెట్టి స్మగ్లింగులోకి దిగాను. ఆకుపచ్చని అగ్గిపెట్టి, అందులో ఆరు పుల్లలు మా ముఠా సంకేతం. మా యింట్లో వాళ్ళంతా తమకు తెలియకుండానే నాకు స్మగ్లింగులో సహకరిస్తు న్నారు. నా అల్లుడు కరుణేశ్వర్ రావడంతో నా కష్టాలు ప్రారంభమయ్యాయి. అతడు నా రహస్యం కనిపెట్టేశాడు. నేనిది మానకపోతే పోలీసురిపోర్టిచ్చి నా పరువు తీస్తా నన్నాడు.

అయితే ఆ ముఠా వ్యవహారాల్లో పీకెలదాకా యిరుక్కు న్నాను. ఇప్పుడు నే నెదురు తిరిగితే ముఠా నాయకుడు నా కుటుంబాన్నే సర్వనాశనం చేస్తాడు. ఆత్మహత్య మినహా గత్యంతరం లేదు నాకు. నీకీ ఉత్తరం అందే సమయానికి నేనీ లోకంలో వుండను. నువ్వు నా కుటుంబాన్ని ఎప్పటి లాగే ఆదుకుంటావని ఆశిస్తున్నాను. సెలవు.

మరో లోకంలో నీ స్నేహానికి ఎదురుచూసే

భూషణరావు—"

"ఈ ఉత్తరం మీ కెప్పుడొచ్చింది?" అన్నాడు కిల్లర్.

"నిన్నరాత్రే భూషణరావు ఎవరిద్వారానో పంపాట్ట. నేను మాత్రం ఇప్పుడే కవరు చింపిచూశాను" అన్నాడు చంద్రస్వామి.

"ఈ ఉత్తరం మాకు అవసరం" అన్నాడు చంద్రకాంత్.

"కావాలంటే వుంచుకోండి. నేను అర్జంటుగా వెళ్ళి భూషణరావు కుటుంబాన్ని పరామర్శించి రావాలి" అంటూ లేచాడు చంద్రస్వామి.

"మనం స్టేషనుకు పోదాం" అన్నాడు కిల్లర్.

ఇద్దరూ పోలీసు స్టేషనుకు వెళ్ళారు.

"ఆ అగ్గిపెట్టె స్మగ్లింగుకు సంబంధించిన సంకేతమన్న మాట! భూషణరావు ఆత్మహత్య చేసుకున్నాడన్న మాట.. కేసు చాలా సులభంగా తేలిపోయింది" అన్నాడు చంద్రకాంత్.

"అగ్గిపెట్టె స్మగ్లింగుకు సంబంధించినదే కానీ భూషణరావు ఆత్మహత్య చేసుకోలేదు. నిస్సందేహంగా ఇది హత్య. వెరీ వెల్ ప్లాన్డు మర్డర్!" అన్నాడు కిల్లర్.

"ఎలా తెలుసు నీకు?" అన్నాడు చంద్రకాంత్ ఆశ్చర్యంగా.

"చాలా సింపుల్. భూషణరావింట్లో ప్రతి ఒక్కరూ ఎదుటివాళ్ళమీద నేరం చెప్పాలనే చూశారు. ఒక్కరూ సఖ్యంగా వున్నట్లు కనబడదు. కారణం తెలుసా? వాళ్ళందరూ తోడు దొంగలు. భూషణరావు అల్లుడు కరుణేశ్వర్ ఆ యింటి వాతావరణాన్ని కలుషితం చేశాడు. అతడు చంద్రస్వామితో చేతులు కలిపాడు. అంతా కలిపి ఓ స్మగ్లింగ్ గ్యాంగ్‌తో జతపడ్డారు. ఇంట్లో డబ్బుబాగా చేరుతోంది. నెలరోజుల్లో పదిలక్షలు చేరాయనుకో—ఇంటిల్లపాదీ కరుణేశ్వర్ తొత్తులవుతారు. అంతా కలిపి భూషణరావుకి బ్రెయిన్ వాష్ చేయడం మొదలుపెట్టారు.

ఆయన లొంగలేదు సరిగదా వీళ్ళను నిరసించి బెదిరించాడు. స్మగ్లింగ్ ముఠాలతో వ్యవహారమెలా వుంటుందో నీకు తెలియనిదా? కుటుంబమంతా నాశనమవుతుందో,

భూషణరావు నాశనం కావాలో నిర్ణయించుకోమన్న సందేశం అందింది. అప్పుడు కుటుంబమంతా కలిసి భూషణరావుని చంపేసింది" అన్నాడు కిల్లర్.

"వైల్డ్ ఇమాజినేషన్!" అన్నాడు చంద్రకాంత్.

"అలాగనుకోకు. తామందరమూ తోడు దొంగలమన్న విషయం బయటపడకుండా వుండడంకోసం—ఒకరిమీద ఒకరు నేరాలు చెప్పారు. భూషణరావే స్మగ్లింగ్ చేస్తూ, చేయిస్తున్నాడని నమ్మించడంకోసం—అతడికి లేనిపోని కథలంటగట్టారు. ఇంట్లో పనివాళ్ళలో మర్యాదగా వుంటాడన్నారు. బయట పనివాళ్ళతో కఠినంగా వుండే భూషణరావు—ఇంటిలో పనివాళ్ళతో మర్యాదగా వుంటున్నాడంటే అందుక్కారణం స్మగ్లింగేనని మనమనుకోవాలని వాళ్ళ భావన. ఆతర్వాత చంద్రస్వామికి ఉత్తరం. ఇందువల్ల ఎన్నో లాభాలు. ఇంతకాలం జరిగిన స్మగ్లింగంతా—హంతుడికి అంటగట్టబడింది. ఇంట్లోని వారెవ్వరూ నేరస్థులు కారు."

"అయితే హత్య ఎవరు చేశారంటావ్?"

"కరుణేశ్వర్. తెల్లవారుఝామువరకూ అతడీ ఊళ్ళోనే వున్నాడు. అంతా కలిసి అతడికి ఎలిబీ యిస్తున్నారు" అన్నాడు కిల్లర్.

"వాళ్ళందరూ చెప్పిన సాక్ష్యాల్లోంచి నువ్వేర్చి కూర్చిన కథ అద్భుతంగా వుంది కానీ—ఇందుకు ఋజువెక్కడ దొరుకుతుంది?"

"కరుణేశ్వర్‌కోసం పోలీసువేట ప్రారంభించు. భూషణరావు రాశాడన్న ఉత్తరంలోని దస్తూరీ వెరిఫై చేయించు."

చంద్రకాంత్ పెదవి విరిచి—"అది నాకు చాలదు" అన్నాడు.

"అయితే నీ తెలివితేటలన్నీ ఉపయోగించి రమణమ్మ

చేత నిజం కక్కించు" అన్నాడు కిల్లర్.

"రమణమ్మా ...ఇంతమందిలో నిజంకోసం ఆమెనే ఎందుకు పట్టుకోవాలి?" జాలిగా అడిగాడు చంద్రకాంత్.

"ఎందుకంటే ఆమె హత్యను కళ్ళారా చూసింది ..."

* * *

అంతా కిల్లర్ చెప్పినట్లే జరిగింది. రమణమ్మ సాక్ష్యంతో కరుణేశ్వర్ హంతకుడని ఋజువుకావడమేకాక భూషణరావు కుటుంబ సభ్యులపేరు చెప్పి ఓ పెద్ద స్మగ్లింగ్ ముఠా ఆచూకీ కూడా తెలిపింది.

కేసు జయప్రదంగా ముగిసేక చంద్రకాంత్ కిల్లర్‌తో— "నీవంటివాడు పక్కనుంటే ఏ కేసైనా ప్రశ్నలతోనే తేలి పోతుంది. వేరే పరిశోధన అక్కర్లేదు" అన్నాడు.

"ఈ కేసులో అది నిజమే కానీ పిడుక్కీ, బియ్యానికీ ఒకే మంత్రం పనికిరాదని గుర్తించుకో" అని నవ్వాడు కిల్లర్. □

కరాటే బాంబ్!

సైరన్

కర్నాటి నాగభూషణం

రాజు చాలాకాలంగా చిల్లరమల్లర దొంగతనాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈసారి చిన్న దొంగతనాల స్థాయినించి కొంచెం పెద్ద దొంగతనాల స్థాయికి ఎదగాలన్న ఆలోచనలో వున్నాడు.

గత కొద్దిరోజులుగా బంజరా హిల్స్‌లోని ఒక పెద్ద

మేడలో కన్నం వేయడానికి కాపుకాస్తున్నాడు. ఆ మేడలో భార్యాభర్త లిద్దరే వుంటారు. పిల్లలు లేరు.

ఆ మేడతను ప్రతి శనివారం రాత్రి ఏడుగంటలకు బయటికి ఎక్కడికో వెళ్ళి అర్థరాత్రి తర్వాత తిరిగొస్తాడు. అతను బయటికి వెళ్ళిన పది పదిహేను నిమిషాలకు అతని భార్యకూడా బయటికివెళ్ళి భర్తకంటే ఒక గంట ముందే తిరిగి యిల్లు చేరుకుంటుంది.

రాజు నాలుగు వారాలపాటు వాళ్ళ దినచర్యను గమనించాడు. ప్రతి శనివారం రాత్రి క్రమం తప్పకుండా ఆ దంపతులిద్దరు విడివిడిగా ఎక్కడికో వెళ్ళివస్తున్నారు. ఆ ఇంట్లో దూరడానికి ఐదోవారం సాహసించాడు.

మెయిన్‌డోర్‌కు వేసివున్న తాళం అతి సులువుగా తెరిచాడు. లోనికి ప్రవేశించి తిరిగి లోపలినుంచి తలుపుమూసి, హాల్లో నిలబడ్డాడు. ఆ ఇంటివాళ్ళు తిరిగి రావడానికి ఇంకా చాల టైమ్ వుంది. అందుకే రాజు తన పనిని నింపాదిగా పూర్తిచేసుకో దలిచాడు.

హాలులో నిలబడి చుట్టూ కలియజూశాడు. పై గదుల్లోకి వెళ్ళడానికి హాలు మధ్యలోంచే మెట్లున్నాయి. మెట్ల కిరువైపులగూడా గదులున్నాయి. అందులో ఒకటి పూజగదిలా కనిపించింది. బహుశ ఇనప్పెట్టె ఆ గదిలోనే వుందేమో చూద్దామని తాళంకప్ప బద్దలగొట్టి లోనికి అడుగుపెట్టాడు.

ఎదురుగా గోడకి దేవుళ్ళ పటాలు వ్రేలాడుతున్నాయి. లక్ష్మీదేవి పటంక్రింద చిన్న ఐరన్‌సేఫ్ గోడలో అమర్చబడి వున్నది. నంబర్లు ఎడ్జెస్టుచేసి తాళం తీయాల్సి వుంటుంది. ఎడ్జెస్టుమెంట్ తెలియక తనవెంట తెచ్చుకున్న సామానుల బ్యాగ్‌లోంచి ఎలక్ట్రిక్ డ్రిల్‌మిషన్ తీసి, ప్లగ్ దూర్చడానికి సాకెట్‌ని వెతకసాగాడు.

అంతలోనే బయటినుండి మేడవైపు ఒక కారు వస్తున్నట్టు యింజన్ శబ్దం వినిపించింది. ఆ కారు షెడ్‌కి వెళ్తుంది. యింజన్ శబ్దాన్నిబట్టి ఆ కారు ఇంటావిడదని గ్రహించాడు రాజు.

"మైగాడ్: మామూలుకంటే ముందరే వచ్చిందేమిటి?" గొణుక్కున్నాడు రాజు. డ్రిల్‌మిషన్ క్రింద పెట్టేసి, గబగబా హాల్లోకి వచ్చి మెల్లిగా కిటకీలోంచి బయటికి తొంగి చూసాడు.

అతని అంచనా కరక్టే. కారులో వచ్చింది ఆ ఇంటావిడే. షెడ్డులో కారాపి ఇంటి తలుపువైపు రాసాగింది.

రాజు ఆలోచనలో పడ్డాడు. ఇప్పుడేం చెయ్యాలి? దొడ్డిదారిన పారిపోవడమా, లేక ఆవిడ తల బద్దలుగొట్టయినా సరే దోచుకుపోవడమా? రెండోదానికి అతని మనసు అంగీకరించడం లేదు కానీ తన నెలరోజుల ప్రయత్నం బుగ్గిపాలవుతుంది.

బయటనుంచి కీహోల్లో తాళంచెవి దూర్చి తిప్పుతున్న చప్పుడు వినిపించింది.

రాజు తన జేబులోంచి రివాల్వర్ తీసి గోడవారగా తలుపుదగ్గరికి వెళ్ళాడు. ఛళ్ళున తలుపు తెరుచుకొని ఆమె లోపల అడుగుపెట్టింది. గభాల్నా ఆమె చెయ్యిపట్టుకొని తనవైపు లాక్కొని నోరు మూసాడు. వెంటనే మళ్ళీ లోపలినుండి తలుపు మూసాడు.

"జాగ్రత్త అరవడానికి ప్రయత్నిస్తే కాల్చేస్తాను" అని హెచ్చరిస్తూ, రివాల్వర్ గొట్టాన్ని ఆమె కణతకి ఆనించాడు. "నువ్వు గొడవ పెట్టకుంటే నీ ప్రాణాలకేం ముప్పు వాటిల్లదు. నేను కేవలం దొంగతనానికే వచ్చాను. అంతకుమించి ఇంకేం చేయను" చెప్పాడు రాజు.

ఆమె భుజానికి వ్రేలాడుతున్న హాండ్ బ్యాగ్ కింద పడి పోయింది. రాజు ఆమె చెయ్యిని వెనక్కి వొడిసి పట్టు కొని, "పద పూజగదిలోకి" అని హూంకరించాడు.

ఆమె ఏమాత్రం ప్రతిఘటించకుండా, వంగి కిందపడ్డ బ్యాగ్ అందుకొని రాజువెంట పూజగదిలో వెళ్ళింది. రాజు హాల్లోంచి ఓ కుర్చీ లాక్కొచ్చి ఆమెను అందులో కూలేసాడు.

"కుర్చీలోంచి లేవద్దు" ఆజ్ఞాపిస్తూ, రాజు తన సరంజామా వున్న సంచివైపు వెళ్ళాడు. ఆమె కుర్చీలోనే కదలకుండా కూర్చుని రాజుకేసి విభ్రాంతితో చూడసాగింది. రాజు ఒక నైలాన్ తాడు తీసుకొచ్చి, ఆమె రెండు చేతుల్ని దగ్గరికి చేర్చి గట్టిగా కట్టేశాడు. తర్వాత అదే తాడుని కుర్చీ క్రిందకు తీసుకొని ఆమె కాళ్ళనికూడా గట్టిగా బిగించి కట్టాడు. తర్వాత లేచి నిటారుగా నిలబడి ఆమె పైటలాగి ఆమె ముందుకి వంగాడు.

"ఏమిటిది?" కంగారుగా చూస్తూ అడిగింది.

"భయపడకు. నీ గొంతేం నులమను. కొద్దిసేపు నువ్వు నోరు మెదపకుండా చేస్తున్నాను. అంతే!"

"వొద్దొద్దు...." దీనంగా అన్నది. "నేనేం అరవను. నీకు కావల్సింది పట్టుకెళ్ళు!"

రాజు ఒక క్షణం ఆలోచించి, పైటచెంగుని ఆమె ఒళ్ళోకి విసిరాడు. కృతజ్ఞగా నవ్వుతూ ఆమె పెదవులు విచ్చుకున్నాయి.

"ఆఁ! అయితే ఐరన్ సేఫ్ ఎలా దయల్ చేయాలో చెప్పు. దానివల్ల నా టైం పాడవదు. సేఫ్ కూడా పాడవదు"

"సేఫ్‌లో వెయ్యిరూపాయలకంటే తక్కువే ఉంటుంది. మావారు ఎక్కువ డబ్బు ఇంట్లో వుంచరు."

"నేను కళ్ళారచూడాలి" నిక్కచ్చిగా అన్నాడు.

"సరే. నీ యిష్టం!" చెప్పసాగిందామె. "ఏడవ అంకెను ఎడమవైపు తిప్పి, రెండుమూడు అంకెలను కుడి వైపు తిప్పాలి. మళ్ళీ మూడు ఏడు అంకెలను ఎడమ వైపు డయల్ చేయాలి."

రాజు తలూపి, ఆమె చెప్పిన అంకెల ప్రకారం డయల్ చేసి. ఐరన్ సేఫ్ తలుపు తెరిచాడు. అందులోవున్న డబ్బుని చూసి విచారంతో నివ్వెరబోయాడు. నిజంగానే సేఫ్‌లో ఏడువందల యాభై రూపాయలు మాత్రమే వున్నాయి. ఆ నోట్లని తీసుకొని తన జేబులో దోపి, ఆ ఇంటావిడకేసి మింగేలా చూడసాగేడు. ఆమె ముఖంలో భయానికి బదులు తీక్షణత ద్యోతకమవుతోంది.

"నగలు ఎక్కడున్నవి?" కోపంగా అడిగాడు రాజు.

"మేం బంగారు నగలు ఇంట్లో ఉంచం." జవాబిచ్చిందామె, "రోల్డ్‌గోల్డ్‌వి, తక్కువ ఖరీదువి మాత్రమే ఇంట్లో అట్టిపెడతాం. విలువైన బంగారు నగలు బ్యాంకు లాకర్‌లో దాచి, ఏదైనా పెండ్లి పేరంటాలకి వెళ్ళేటప్పుడు వాటిని తెచ్చి ధరిస్తాం."

రాజుకు ఆమె మాటలమీద పూర్తి విశ్వాసం కుదరక అన్నాడు. "అయినా ఒక్కసారి చూడాలి నేను. అవి నిజంగా నకిలీవి, తక్కువ ఖరీదువని నిర్ధారణకావాలి. బహుశ, ఆ నగలు మీ బెడ్‌రూమ్‌లో ఉండొచ్చు!"

"అవును. అక్కడే ఉన్నాయి. కానీ, నేను నిన్నో విషయం అడుగుదామనుకుంటున్నాను." మాట మారుస్తూ అన్నది.

రాజు కనుబొమలు ముడివేసి, ఆమెకేసి తేరిపార చూస్తూ అన్నాడు "అడుగు".

కాసేపు ఆమె రాజు కళ్ళలోకి తీక్షణంగా చూసి ప్రశ్నించింది. "నువ్వింతవరకు ఎప్పుడైనా, ఎవర్నయినా హత్య చేసావా?"

రాజుగుండె ఝల్లుమంది. ఖంగుతింటూ అడిగాడు. "ఏమిటి? ఏ వుద్దేశంతో అడుగుతున్నావో? నా కర్థంకాలా! ఒకవేళ ఎవరినైనా హత్యచేసినా నీకు ఎందుకు చెబుతాను?"

"చెబితే నీకేం హానీ జరుగదు. ఎందుకంటే మనిద్దరికి నష్టం వాటిల్లదు" అంది నిశ్చలంగా.

రాజు గుడ్లప్పగించి చూడసాగేడు. ఆవిడ ముఖంలో ప్రశాంతత కొట్టొచ్చినట్టు కనబడుతోంది. ఆమె వాలకం చూసి అతనికే ఆందోళన కలిగింది ఆమేదో ముఖ్యోద్దేశంతోనే మాట్లాడుతుంది.

"సరే. చెప్పు నీ వుద్దేశం ఏమిటో స్పష్టంగా," అన్నాడు రాజు నిట్టూర్పు వదులుతూ.

ఆమె సాలోచనగా తలూపి చెప్పసాగింది. "ఈ మధ్య మావారు ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. ప్రతి శనివారం రాత్రి ఆమె దగ్గరికి వెళ్ళివస్తాడు. ప్రత్యక్షంగా పట్టుకొని వాళ్ళ భరతం పట్టాలని ప్రయత్నిస్తున్నాను. కానీ. ప్రయోజనం లేకపోతుంది. అవకాశం లభించినా మా వారిని ఎదిరించడానికి ధైర్యం చాలడంలేదు."

"అయితే ఇవ్వాళ తొందరగా తిరిగి రావడానికి కారణం ఇదన్నమాట. మొత్తానికి నీ భర్త ప్రేయసిని నీ దారికి అడ్డురాకుండా చూడాలంటావు. అంతేనా?"

ఆమె తల అడ్డంగా వూపింది. "కాదు అంతటితో సమస్య పరిష్కారంకాదు. ఆమెను అడ్డుతొలిగిస్తే మా వారు వారం తిరక్కుండానే ఇంకో అమ్మాయిని పడతారు. నేను ఆయనకు మూడోభార్యని. నా కంటే ముందు ఇద్దరు

భార్యలకు విడాకులు ఇచ్చారు. ఇప్పుడు నా వంతొచ్చింది."

"నీతో పరిచయం ఏర్పడ్డాకే రెండో భార్యకు విడాకులు ఇచ్చాడా?" అడిగాడు రాజు.

"అవును."

"అంతేమరి. నీకు మల్లేనే ఇంకో స్త్రీ నీ స్థానాన్ని కైవశం చేసుకుంటోంది. నీ భర్త ఎలాగూ తన వ్యసనాన్ని మార్చుకోలేడు. కాబట్టి, అతనికంటే ముందు నువ్వే విడాకులకు కేసుపెట్టు-మీ ఇద్దరికి పొసగడంలేదని. చట్టరీత్యా నీకు చెందాల్సినది పొంది తిన్నగా తప్పుకో; లేకుంటే నిన్ను అధోగతిపాలుచేస్తాడు." సలహాయిచ్చాడు రాజు.

"మా వారు చాల తెలివయినవారు. తన ఆస్తినంత దాచి ఉంచుతారు. విడాకుల మూలంగా నాకేం ముట్టజెప్పడు. ఈ పరిస్థితుల్లోనే అతను చనిపోతే యీ ఆస్తి అంతా నా కైంకర్యం అవుతుంది."

"అంటే, చంపించాలనుకుంటున్నావా?"

అవునన్నట్టు తలూపింది.

"నువ్వు మా వారిని పైలోకానికి పంపితే, నీకు తగు ప్రతిఫలం అందజేస్తాను."

"తగు అంటే ఎంత?"

ఆమె పెదవులమీద చిరునవ్వు వెలిసింది. సూటిగా రాజు కళ్ళలోకి చూస్తూ చెప్పసాగింది. "వచ్చే శనివారం ఫస్ట్‌వీక్ కాబట్టి మా వారికి వ్యాపారంలో రావల్సిన పద్దులన్నీ వసూలు చేసుకొస్తారు. చాల పెద్ద మొత్తమే వుంటుంది. తెల్లవారితే ఆదివారం కాబట్టి, ఒకరోజు కోసం ఆ డబ్బంతా ఐరన్ సేఫ్‌లోనే దాస్తారు. సోమవారం ప్రొద్దున్నే బ్యాంక్‌లో జమకడుతారు."

"ఎంతుంటుంది?"

"లక్ష దాటుతుంది."

"లక్ష రూపాయలా?" రాజు కళ్ళు పెద్దవి చేసాడు.

ఆమె చెప్పడం ఆపలేదు. "అంతేకాదు దానికి ఒక రోజు ముందు శుక్రవారం నాడు మా దగ్గరి బంధువుల పెండ్లికి వెళ్ళాల్సివున్నది. ఆ రోజు నా బంగారు నగలన్నీ బ్యాంక్ లాకర్లోంచి తీసుకొస్తాము. ఏదో ఒక నెపంతో వెంటనే తిరిగి లాకర్లో పెట్టకుండా చూస్తాను. నువ్వు నాకు సహకరిస్తే, ఆ నగలు, నగదు నీ సొంతమవుతుంది."

రాజుకు గుండె దడ హెచ్చింది వొళ్ళంతా చెమట పట్టింది. ఆ పని తన శక్తిని మించినది. కానీ, ఆమె ప్రేరేపిస్తున్న విధానం అతన్ని ఉత్తేజితుడ్ని చేస్తోంది. వృత్తిలో ఒకమెట్టు పైకి ఎక్కవచ్చు అనిపించింది.

"నీ ఆలోచనకు జవాబిచ్చేముందు, నేనొకసారి మీ బెడ్ రూంలో వున్న నగలని తిలకించాలి. ఆ నగల విషయంలో నువ్వు చెప్పింది ఎంతవరకు వాస్తవమో గమనించాలి" అన్నాడు రాజు.

ఆమె అబద్ధం చెప్పడంలేదని తెలుసు. అయినా ఆమె ప్రేరణలో ఏమాత్రం వాస్తవంవుందో గ్రహించడానికి అతనికి కాస్త వ్యవధి కావల్సి వచ్చింది. బెడ్ రూమ్ కెళ్ళబోయి ఏదో గుర్తుకొచ్చి చటుక్కున ఆగాడు. ఆమె వొడిలో పడివున్న పైటచెంగుని అందుకొని ఆమె నోట్లో కుక్కసాగేడు.

"ఈపాటి జాగ్రత్త అవసరం." అన్నాడు రాజు "నేను పైకి వెళ్ళగానే నీకు అరవాలనిపించొచ్చు."

ఆమె అభ్యంతర పెట్టలేదు. పైటచెంగుని ఆమె నోటి నిండా కుక్కాడు. తర్వాత కాళ్ళు, చేతుల కట్లును తనిఖీ చేసి పూజగదిలోనుండి బయటికి వచ్చాడు. హాలు

మధ్యలోవున్న మెట్లగుండా పైనవున్న పడకగదిలోకి చేరుకున్నాడు.

కొద్ది నిమిషాల్లోనే ఆమె అబద్ధం చెప్పలేదని అతడికి పూర్తిగా రూఢీ అయిపోయింది. అక్కడ కొన్ని రోల్డ్ గోల్డ్ నగలు, బంగారువి చిన్నచిన్న నగలు కనిపించాయి. పడగ్గదిలో టీపాయ్‌మీద ఆ దంపతుల ఫోటో ఒకటివుంది. ఫోటోలోని అతని వెంట్రుకలు తెల్లబడుతున్నట్టు స్పష్టంగా కనబడుతున్నాయి. దాదాపు యాభై యేళ్ళకుంటాడు. ఇంత వయసొచ్చినా యింకా స్త్రీ వ్యామోహం తగ్గలేదంటే, ఘటికుడే అనుకోవాలి. ఇలాంటి కామాంధుడ్ని తెగనరికినా పాపం లేదనిపించింది.

మెత్తగా, హాయిగావున్న యీ ఫోమ్ బెడ్‌మీద చతికిల బడి ఆ ఇంటావిడ గురించి ఆలోచించసాగాడు.

ఆమె నిజంగానే తన ముసలి భర్తను 'హారీ'మనిపించ దలిచిందా? లేక తనను మోసపుచ్చి పట్టించదలిచిందా? కాదు. నిజంగానే ఆమె తన భర్తనుండి విముక్తి పొంద దలిచింది. తనకు తానుగా ఆ పని చేయలేక ఒక హంత కుడ్ని ఆశ్రయించ దలిచింది.

హంతకుడితో సంబంధం కల్పించుకోవడం మామూలు విషయం కాదు. పేపర్లో ప్రకటించిగానీ, నలుగురితో చర్చించి హంతకుడ్ని ఎన్నుకోవడం జరగదు. పైగా రాటుదేలిన హంతకుడయితే తర్వాత ఆమెను బ్లాక్‌మెయిల్ చేసే ప్రమాదం కూడా లేకపోలేదు. కాబట్టి, ఆమెకు నిజం గానే తన అవసరం వుంది. తనకు డబ్బు అవసరం వుంది.

రాజు అక్కడినుంచి లేచి పూజగదిలోకి చేరుకున్నాడు. ఆమె నిశ్చింతగా, నిర్భయంగా కూర్చుని వున్నది. అక్కడి

నుండి లేవడానికి కానీ, కట్లు తెంపుకోడానికి ఏమాత్రం ప్రయత్నించలేదు. రాజు ఆమె నోట్లో కుక్కిన పైట చెంగుని బయటికి లాగేసాడు. ఆమె గుండెలనిండా గట్టిగా ఊపిరి పీల్చుకుంది. నాలుకతో పెదవులు తడుపుకుంది. రాజు వైపు ఆశగా చూస్తూ అడిగింది.

"ఏం నిర్ణయించుకున్నావు?"

"నీ ఆఫర్ కాస్త పెంచితే అగ్రియే."

ఆమె నేత్రాల్లో దేదీప్యమైన కాంతి ఛక్ మని ఎగిరి వచ్చింది. నవ్వు ముఖాన పులుముకుంది.

"నువ్వు పని నిర్విఘ్నంగా పూర్తిచెయ్యి. అడిగినంత ఇస్తాను" అంటూ ఐరన్ సేఫ్ వైపు సంజ్ఞచేస్తూ మళ్ళీ అన్నది. "ఇంతకుముందు నువ్వు తీసిన డబ్బు తిరిగి అందులో పెట్టేసెయ్యి. లేకుంటే మావారికి అనుమానం కలుగుతుంది."

"అయితే, నన్ను వుత్తచేతులతోనే తిరిగెళ్ళమంటావా? లేదు. అలా వీల్లేదు. అడ్వాన్స్ పుచ్చుకోందే బేరం కుదరదు."

"ప్రస్తుతం నా పర్సులో ఐదువందలున్నాయి. తీసుకో. రేపు బ్యాంకునుంచి మరో నాలుగున్నరవేలు డ్రా చేసి ఇస్తాను."

"ఐదువేలు చాల తక్కువ. పాతికవేలన్నా డ్రా చెయ్యి!"

"చూడు మిస్టర్, నేరం చేయడానికి కండబలమే కాదు, కాస్త బుద్ధిబలం కూడా వుండాలి. హత్య జరిగాక పోలీసులు రంగంలోకి దిగుతారు. మావారి హత్యకు ముందు వారం రోజుల క్రితం నేను పాతికవేలు డ్రా చేసినట్టు తెలిస్తే, వెంటనే వాళ్ళకు అనుమానం కలుగుతుంది. నువ్వే

చెప్పు. అప్పుడు నేనేం సమాధానం చెప్పాలి, ఆ పాతిక వేలు ఏమయ్యాయంటే?" అడిగింది.

రాజుకు ఆమె మాటలు సముచితమే అనిపించింది. ఆమెను కట్టేసిన కుర్చీకింద పడున్న పర్సులోంచి ఐదు వందలు తీసుకొని మళ్ళీ అన్నాడు. "తర్వాత నువ్వు మాట తప్పవని గ్యారంటీ ఏమిటి?"

"నువ్వు రేపటి ఐదు వేలతోనే వుడాయించవని గ్యారంటీ ఏమిటీ? కాబట్టి ఇలాంటి పనుల్లో ఒకర్నొకరు నమ్మడం చాలా అవసరం" అంది ఆమె.

రాజు అంతకుముందు తన జేబులో దోపుకున్న నోట్లని తీపి ఐరన్ సేఫ్‌లో పడేసి ఆమె కట్లన్ని విప్పదీశాడు.

"సరిగ్గా వున్నాయో, లేవో లెక్కబెట్టుకో. నేను వెళ్తాను" అన్నాడు రాజు.

"మరి రేపు ఎక్కడ కలుస్తావు?" అడిగింది.

"రవీంద్రభారతికి ఎదురుగా వున్న గోపి హోటల్‌కి రా, రేపు ఒంటిగంటకు.... నీ భర్త వచ్చేవేళయింది. నేను వస్తాను... " అంటూ తన సరంజామునంత సర్దుకున్నాడు. వెళ్ళా, వెళ్తూ ఆగి అడిగాడు. "అడగడం మరిచాను. నీ పేరేమిటి?"

"మాధవి....మరి నీ పేరు?" అడిగిందామె.

"ప్రస్తుతం దొంగ అని పిలవచ్చు" అని చెప్పి గబగబ అక్కడినుంచి నిష్క్రమించాడు.

2

మరుసటిరోజు మాధవిని గోపి హోటల్లో గంటసేపు నిరీక్షింపజేసాడు ఆమె పోలీసు సహాయం ఏదైనా పొంది అక్కడికి వచ్చిందేమో నిర్ధారించుకోడానికి, రాజు గోపి హోటల్‌కి ఎదురుగా వున్న ఇరానీ హోటల్ పంచషీల్‌లో

మాధవికంటే యింకో గంటముందే వచ్చి కూర్చున్నాడు. గోపి హోటల్ మెట్లు ఎక్కగానే వరండాలో వున్న టేబుల్స్‌పైలోనే రోడ్డుకెదురుగా, బయటివాళ్ళకు కనిపించేలా కూర్చుంది మాధవి.

రాజు ఇరానీ హోటల్ క్యాష్ కౌంటర్‌లో వున్న ఫోన్ దగ్గరికెళ్ళి ఎదురుగా వున్న గోపి హోటల్‌కి రింగ్ చేసాడు. ఆమె పేరు ఆనవాలు చెప్పి ఫోన్ దగ్గరికి రప్పించాడు.

"ఎక్కడినుంచి మాట్లాడుతున్నావు?" రాజు గొంతు గుర్తుపట్టాక అడిగింది మాధవి.

"నీ ఎదురుగుండా నుంచే....అటు యిటూ చూడ్డానికి ప్రయత్నించకు. నేను నీకు కనిపించను. డబ్బుతెచ్చావా?"

"ఆఁ!"

"నువ్వో పని చెయ్యి. రిసీవర్ పెట్టేసి, నీ కారు ఇక్కడే వుండనిచ్చి, నువ్వు తిన్నగా అసెంబ్లీ హాలువైపు నడువు. విధానమండలి ప్రక్కన వున్న పబ్లిక్ గార్డెన్ గేటుగుండా లోనికి ప్రవేశించి, జవహర్ బాలభవన్ దగ్గర నిలబడు. అక్కడి పార్కులో కలుస్తాను."

"ఏదైనా ప్రయివేట్ స్థలంలో కలవలేవా?"

"ఈ వేళప్పుడు ఎక్కువ జనం వుండరు. బహుశ నిన్ను గుర్తుపట్టే వాళ్ళెవరు వుండకపోవచ్చు. వచ్చేయి ఏం ఫర్వాలేదు."

"సరే" అంది మాధవి.

రాజు రిసీవర్ని పెట్టేసి, ఇరానీ సేఠ్‌కు బిల్లు చెల్లించాడు.

మాధవి గోపి హోటల్‌నుండి బయటికి వచ్చి, రోడ్డు మీద నడవసాగింది. ఆమె కొంచెం దూరందాక నడిచేవరకు చూసి, అప్పుడు రాజు ఇరానీ హోటల్లోంచి బయటపడ్డాడు.

మాధవికి సహాయంగా ఎవరన్నా వచ్చారేమోనన్న అనుమానంతో ఆమె వెనకాల చాలదూరంగా నడుస్తూ వెంబడించసాగాడు.

ఆమె అసెంబ్లీ ఆవరణ దాటి పబ్లిక్ గార్డెన్‌లో అడుగుపెట్టింది. జవహార్ మినీ బాలభవన్ దగ్గర జవహార్ బాలభవన్—ఇందిరా ప్రియదర్శినికి వెళ్ళే మార్గాన్ని సూచించే బోర్డ్ కుడివైపున వుండడంతో మాధవి ఆ దారిన నడిచింది. రాజు ఎడమవైపున వున్న ఇంకో దారిగుండా వెళ్ళాడు.

మాధవి జవహార్ బాలభవన్ చేరుకొని, దానికి ఎదురుగా వున్న పార్క్‌లో నిలబడింది. పచ్చని గడ్డిలో గంతులేస్తున్న పిల్లలకేసి చూడసాగింది.

రాజు ఆమెను సమీపించి "హలో" అన్నాడు.

ఆమె వెనుదిరిగి రాజునిచూసి పలకరింపుగా నవ్వింది.

ఆమె కట్టుకున్న పల్చటి నైలెక్స్ చీర ఆమె అందాల్ని, ఒంపు సొంపుల్ని స్పష్టంగా బహిర్గతం చేస్తున్నాయి. పైగా స్లీవ్‌లెస్ జాకెట్ వేసుకుంది. భుజానికి హాండ్ బ్యాగ్ వ్రేలాడుతోంది.

హెల్త్ మ్యూజియంకు ఎదురుగా గొడుగులా కత్తిరించబడిన చెట్టుకింద ఒక బెంచీ వుంది. అక్కడికి వెళ్ళి కూర్చున్నారు. మాధవి తన పర్సులోంచి ఒక కవరుతీసి రాజు చేతిలో పెట్టింది. "ఇదిగో, మిగతా నాలుగున్నర వేలు."

రాజు కవరు తీసుకొని జేబులో దోపుకున్నాడు. కవరు తెరిచి నోట్లు లెక్కపెట్టే ప్రయత్నం కూడా చేయలేదు.

"నా మీద నమ్మకం ఏర్పడిందన్నమాట!" అంది మాధవి.

"ఏర్పడక తప్పదుగా, బిజినెస్ కుదిరాకా."

మాధవి నవ్వింది. తర్వాత తన చేతుల్ని రాజుకి చూపిస్తూ అన్నది. "చూడు నీ నిర్వాహకం. తాడుగుర్తులు ఎలా పడ్డాయో?"

"నాకు తెలియదు, నీ చేతులు ఇంత సున్నితమని!"

"స్త్రీల చేతులు సున్నితంగా వుండక, మొరటుగా వుంటాయా? చేతులేకాదు కాళ్ళకికూడా పడ్డాయి గుర్తులు. ఈ గుర్తులు మాసిపోయేవరకు దాచుకుతిరగాల్సి వస్తుంది" గోముగా అతని కళ్ళలోకి చూస్తూ అన్నది "నువ్వు తాడు గట్టిగా బిగించి కడుతుంటే విపరీతంగా నొప్పేసింది. చేసేది లేక ఓర్చుకున్నాను."

"మన మిక్కడికొచ్చింది పథకాన్ని రూపుదిద్దుకోడానికి జరిగింది నెమరేసుకోడానికి కాదు!"

"పథకం ఏముంది చాల సింపుల్. శనివారం రాత్రి పదకొండు గంటలకు నువ్వు దొడ్డివారిన కిటికీ అద్దాలు పగలగొట్టి లోనికి ప్రవేశించుతావు. దోపిడిలో వాస్తవికత వుట్టిపడేలా యింట్లోని వస్తువుల్ని, బీరువాలని చిందర వందర చేసేయాలి. తర్వాత నీ పరికరాలతో ఐరన్ సేఫ్ పగలగొట్టాలి."

"డబ్బు సేఫ్‌లో వుంటుందా?" అడిగాడు రాజు.

"అవును. డబ్బు నగలు దోచుకున్నాక. పూజగదిలోనే దాక్కొని మావారికోసం నిరీక్షించాలి."

"పూజగదిలోనే ఎందుకు?"

"పోలీసులు వచ్చి ఐరన్ సేఫ్ తలుపు తెరిచి వుండడం చూసి, అర్ధరాత్రి మావారు ఇంట్లో అడుగు పెట్టగానే దేవుని గదిలో ఏదో అలికిడి విని అక్కడికి చేరుకున్నాడు. అక్కడే దొంగ కంటబడి అతని పిస్తోల్‌కు గురయ్యాడని

గ్రహించాలి!" అని చెప్పింది.

"అప్పుడు నువ్వెక్కడున్నావని చెబుతావు?" రాజు అడిగాడు.

"పని పూర్తయ్యాక నువ్వెళ్ళేముందు నన్ను బెడ్ రూంలో కట్టేసి వెళ్ళు. అర్థరాత్రప్పుడు మావారు వచ్చే ముందు ఒక దొంగ మా ఇంట్లో దూరాడు. నన్ను కొట్టి, కట్టేసి పడకగదిలో వున్న నగలు వగైరా దోచుకొని కింద హాల్లోకి వెళ్ళాడు. నోట్లో బట్ట కుక్కడంతో అరవ లేకపోయాను. కొద్దిసేపటి తర్వాత నాకు క్రిందినుంచి పిస్తోలు పేలిన శబ్దం వినిపించింది, అని చెబుతాను."

"ఒకవేళ నీ భర్త ఆ రోజు ఇంట్లోనుంచి బయటికే వెళ్ళకపోతే?"

"తప్పనిసరిగా వెళ్ళుతాడు. ఒకవేళ అలాంటిది ఏదైనా జరిగితే, నువ్వింట్లో దూరకముందే సైగచేస్తాను" అనిచెప్పి లేచింది మాధవి. "శనివారం నీ కోసం ఎదురుచూస్తూ వుంటాను. చట్టానికి చిక్కకుండా పని నిర్విఘ్నంగా జరిగి పోతే, నువ్వు ఆశించిందానికంటే ఎక్కువే లాభం పొంది మా ఇంట్లోంచి బయటపడతావు."

మాధవి అక్కడినుండి నిష్క్రమించింది.

రాజు గుండెలనిండా వూపిరి పీల్చి నిట్టూర్పు వదిలాడు. రాజు కళ్ళలో కొద్దిక్షణాలు మాధవివల్ల అమరే డబ్బు నగలు మెదిలాయి.

వారంరోజుల్లో తను లక్షాధికారి కాబోతున్నాడు. ఆ డబ్బు చేతికి రాగానే ఒక బంగళా, కారు సమకూర్చుకోవా లని మనస్సులో నిర్ణయించుకున్నాడు.

కానీ, తను ఆ పని సాధించగలడా? తనింతవరకు ఎవ రినీ హత్యచేయలేదు. అలాంటి ఆలోచన కూడా రాలేదు.

ఇప్పుడు మాధవి ప్రేరణవల్ల హంతకుడిగా మారగలడా?

అవసరం లేదు. హంతకుడవకుండా ఆమె కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అనుకున్న ప్రకారం ఆ ఇంట్లో దూరి నగదు, నగలు చేజిక్కగానే మాధవి భర్త ఇల్లు చేరకముందే తుర్రుమనాలి. అవసరమైతే ఆమె పురమాయించినట్టుగానే ఆమెను కాళ్ళు చేతులు కట్టేసి పారిపోవాలి.

3

శనివారం రాత్రి పదకొండుగంటలకు రాజు కిటికీ అద్దాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. మాధవి కంగారుగా హాల్లో తచ్చాడుతూ కనిపించింది. పల్చటి నైట్ గౌన్ ధరించింది.

రాజుని చూస్తూనే అన్నది. "మనం వెంటనే పని మొదలుపెట్టాలి."

వాళ్ళిద్దరు వేర్వేరు గదుల్లోకి వెళ్ళి హడావుడిగా వస్తువుల్ని చిందరవందర చేయసాగారు. కొద్ది నిమిషాల్లోనే ఇల్లంతా పెద్దసుడిగాలికి గురయినట్టుగా మారిపోయింది.

తర్వాత వాళ్ళిద్దరు పూజగదిలోకి ప్రవేశించారు. రాజు ఐరన్ సేఫ్ తెరిచే నంబరింగ్ మరచిపోయాడు. మాధవి ఆ విషయంలో అతనికి సహకరించడానికి ససేమిరా సిద్ధపడ లేదు. "ఐరన్ సేఫ్ ఎవరో దొంగ బ్రద్దలగొట్టినట్టు రూఢీ అనాలి. దాన్ని తెరవడంలో నీ పద్ధతిని అవలంభించు" అని చెప్పింది మాధవి.

"మందందులో డబ్బు వుందో, లేదో చూడాలి" అన్నాడు రాజు. అతను హైరానాపడ్డాడు. ఆమె అన్ని విధాలా సహకరిస్తానని ఎదురు తిరిగిందేమిటి?

"డబ్బు ఐరన్ సేఫ్ తెరిచాకే కనబడుతుంది" నిక్కచ్చిగా చెప్పింది మాధవి. "దాన్ని తెరుస్తావో, బద్దలుగొడుతావో నీ ఇష్టం!"

రాజుకు కోపం వచ్చింది. సేఫ్‌కంటే ముందు మాధవి మూతి పగలగొట్టాలనిపించింది. కాని, పరిస్థితి అనుకూలంగా లేదు. ఇప్పుడు తొందరపడితే తనకే నష్టం!

ఉద్రేకాన్ని అణచుకున్నాడు. తన బ్యాగ్‌లోంచి డ్రిల్ మిషన్ తీసి ఐరన్ సేఫ్ తెరవడానికి పూనుకున్నాడు. మాధవి కుర్చీలో కూలబడి అతని పనితనాన్ని పరిశీలించసాగింది.

పదిహేను నిమిషాల్లో రాజు ఐరన్ సేఫ్ తెరవగలిగాడు. అందులోకి చూసి ఛగ్గున మండిపోయాడు. వెనక్కి తిరిగి మాధవివైపు చూసాడు.

కుర్చీలో ఆమెలేదు. ఐరన్ సేఫ్ బద్దలగొట్టడంలో నిమగ్నంచేసి వెళ్ళింది. 'తనను మోసపుచ్చడానికి ప్రయత్నిస్తుందా' అని ఆలోచనలో పడ్డాడు రాజు. కానీ అంతలోనే మాధవి తిరిగి దేవుని గదిలోకి వచ్చింది. ఆమె చేతిలో ఒక ప్లాస్టిక్ సంచి వున్నది.

"ఈ సంచిలో నా నగలు వున్నవి. తీసుకో" రాజుకు అందిస్తూ అన్నది.

"కానీ, సేఫ్‌లో కేవలం రెండువేల రూపాయలేవున్నవి. మిగతా డబ్బు ఏది? నువ్వు లక్ష దాటుతుందన్నావు."

"మిగతా డబ్బు నువ్వు పని పూర్తిచేశాక దొరుకుతుంది" నిశ్చింతగా చెప్పింది మాధవి. "సొమ్మంతా ముందే అందితే నీ ఉద్దేశం మారే అవకాశం వుంది. యీ నగలు, రెండువేల రూపాయలు నేను మాటతప్ప ననడానికి నిదర్శనం."

రాజు లోలోపలే గొణుక్కున్నాడు. ఆవిడ తను

ఊహించిన దానికంటే ఎక్కువ తెలివిగలది. తనకంటే ముందే ఆ డబ్బు దోచి ఎక్కడో దాచి వుంటుంది అనుకున్నాడు. మొగుడ్నే మట్టుబెట్టదలచిన ఆమెకు తనో లెక్కా? ఆడది దేనికయినా సమర్థురాలే. 'దొరికిందే చాలు ఆ రొంపిలోంచి పారిపో' అని అతని అంతరాత్మ హెచ్చరించింది.

పారిపోదలచితే ఇప్పటికీ మించిపోయిందేమి లేదు. గడియారంకేసి చూసాడు. పన్నెండుకు ఏడు నిమిషాలు తక్కువుంది. ఆ ఇంటాయన వచ్చే సమయం ఆసన్నమైంది. కానీ, అతనిలో మళ్ళీ పేరాశ చోటుచేసుకుంది. ఇంత తెగించివచ్చాక అసంపూర్తిగా తిరిగెళ్ళడం అవివేకం.

అతను వేగంగా ముందుకువెళ్ళి మాధవి రెండుచేతుల్ని ఒడిసిపట్టుకొని కుదించాడు.

"మిగతా డబ్బు ఎక్కడుంది? ఊఁ మర్యాదగా చెప్పు" గద్దించాడు రాజు.

మాధవి విడిపించుకోడానికి వెనుదిరిగి గింజుకోసాగింది. మాధవిని యీడ్చి ఒక చెంపదెబ్బ కొట్టాడు. తర్వాత ఆమె వీపు తన దిక్కుండేలా ఒడిపి పట్టుకొని, ఇంకో చెయ్యిని ఆమె మెడచుట్టు బిగించాడు. తన మోకాలుతో మాధవిని బలంగా కిందికి వంచుతూ అన్నాడు. "త్వరగా చెప్పు. ఎక్కడుంది డబ్బు? లేదా జీవితాంతం గుర్తుండేలా చిత్రహింసపెడ్తాను."

మాధవి పెదవిచిట్లి రక్తం కారుతోంది. చెయ్యితో తుడుచుకొని బిగ్గరగా అరుస్తూ అన్నది. "కొట్టు. నీ యిష్టం వచ్చినట్టు కొట్టు. పోలీసులకి చూపించడానికి ఉపయోగపడేలా గాయపరుచు."

రాజు ఆమె మొండితనాన్ని గ్రహించి, తన పట్టుని

సదలించాడు. "చూడు—నాకు హంతకుడిగా మారడం ఇష్టంలేదు. నాక్కావల్సింది డబ్బు. ఎక్కడుందో చెప్పు" అన్నాడు చిన్నగా.

మాధవి తల అడ్డంగా వూపింది. "నేనంత సులువుగా ఓటమిని అంగీకరించను. అదేం కుదరదు. నువ్వు హత్య చేయాల్సిందే" నిక్కచ్చిగా అంది.

రాజా ఆమెను వదిలేసాడు. జేబులోంచి చేతి రుమాలు తీసి ముఖం తుడుచుకున్నాడు. అంతలోనే బయటినుండి కారు వస్తున్న శబ్దం వినిపించింది.

"మావారు వచ్చేస్తున్నారు" మాధవి అన్నది. "ప్లీజ్ నన్ను నమ్ము. కొద్దిక్షణాలే వున్నాయి. అతను లోపలికి వచ్చేస్తాడు. దేవునిగదిలో అడుగుపెట్టగానే కాల్చేయి. అతను చావగానే నీకు కావల్సిన డబ్బు తీసుకొని, నన్ను కట్టేసి పారిపో—ఏమంటావ్?"

రాజుకు ఇంకోమార్గం తోచలేదు. ఒప్పుకున్నట్టు తలాడించాడు. తన జేబులోంచి రివాల్వర్ తీసి తలుపు వెనక్కి వెళ్ళి దాక్కున్నాడు. మెయిన్‌డోర్ తెరుచుకొని, హాల్లో అడుగుపెట్టాడు ఆ ఇంటతను.

రాజుకు వొళ్ళంతా చెమటలు పట్టాయి. చేతిలోని రివాల్వర్ బరువెక్కుతోంది. పూజగది తలుపు తెరిచి వుండడం చూసి లోనికి ప్రవేశించాడు. ఐరన్‌సేఫ్ తెరిచివుండడం చూసి తెల్లబోయి, భార్య మొహంలోకి చూసాడు.

"ఏమండి. అటుచూడండి" అంటూ రాజా నిలబడివున్న వైపు సైగచేసింది.

అటుచూసి అతని గుండె ఝల్లుమంది. రాజా చేతిలో రివాల్వర్ చూసి ఒక్కఅడుగు వెనక్కివేసాడు. భయంతో అతని ముఖం తెల్లగా పాలిపోయింది. కొద్దిక్షణాలు ఒకరి

మొహాలు ఒకరు చూసుకుంటూ నిర్ఘాంతపోయారు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?" మాధవి రాజుకేసి చూస్తూ అంది బిగ్గరగా. "ఊఁ! కాల్చు."

అది వింటూనే ఆమె భర్తకు మొత్తం అర్థమయి పోయింది. వెంటనే రాజుమీదికి చిఱుతలా లంఘించాడు. రివాల్వర్ వున్న చేతిని ఒడిసి పట్టుకొని కలియబడ్డాడు. మాధవి హాలులోకి పరిగెత్తింది.

మాధవి భర్త వృద్ధుడే అయినా జీవన్మరణ సమస్య ఎదురయ్యేసరికి ఎక్కడలేని బలం పుంజుకున్నాడు. రాజుని సునాయాసంగా ఎదురుకోగలుగుతున్నాడు.

రాజు తన పిడికిల్లోంచి రివాల్వర్‌ని మాత్రం పట్టు జారనీయడంలేదు. ఆ పెనుగులాటలో హఠాత్తుగా ఒక తూటా పేలింది. అప్పుడు రివాల్వర్ గొట్టం హాలువైపు కిటికీకేసి వుంది.

ఆ వృద్ధుడు తన శరీరంలోని శక్తినంత కూడదీసుకుని రాజు చేతిలోని రివాల్వర్ లాక్కోడానికి ప్రయత్నిస్తున్నాడు. రాజు తన పట్టుని ఏమాత్రం సడలించకుండా మెల్లిమెల్లిగా రివాల్వర్ గొట్టాన్ని వృద్ధుడివైపు తిప్పి ట్రిగ్గర్ నొక్కాడు. ఆ వృద్ధుడి శరీరం ఒక్కసారిగా కంపించిపోయి నేలకూలింది. అతని గుండెదగ్గర రంధ్రం పడి రక్తం కారుతోంది.

వెంటనే రాజు హాల్లోకి పరుగెత్తాడు. దిగ్భ్రాంతితో అతనికళ్ళు పెద్దవయ్యాయి. మాధవి ఫోన్‌దగ్గర నిర్జీవంగా పడివుంది. ఆమె తలనుండి రక్తం కారుతోంది మొదట పేలిన తూటాకి మాధవి గురయింది.

రాజు మిగతా డబ్బుకోసం మేడంతా మరోసారి గాలించ సాగాడు. అంతలోనే పోలీసులు రంగప్రవేశం చేసారు.

రాజు రెడ్ హేండెడ్‌గా దొరికిపోయాడు.

రాజు చెప్పిందంతా విని పోలీసులు కూడా మిగతా డబ్బు కోసం బంగళా అంతా వెతికారు. ప్రయోజనం లేక పోయింది. మాధవి శవాన్ని కదిలిస్తే అక్కడ ఒక రివాల్వార్ కనిపించింది.

ఆ రివాల్వర్‌ని చూడగానే రాజుగుండె ఝల్లుమంది.

ఆ రివాల్వర్ తనకోసం సిద్ధంచేసి, పోలీసులకు ఫోన్ చేస్తుండగా తమ ఇద్దరి పెనుగులాటలో పేలిన తూట తగిలి మాధవి చచ్చిపోయింది, అని అర్థం చేసుకున్నాడు. ఆమె భర్తను రాజు చంపగానే, ఆ రివాల్వర్‌తో ఆత్మ రక్షణ నిమిత్తం దొంగనుకాల్చానని చెప్పాలనుకుంది మాధవి. □

పాఠకులకు మనవి:

మీకు గతనెల కాపీలు మార్కెట్లో దొరక లేదా - రు. 16.00 లు మాకు M.O. చేయండి. పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ మీ చిరునామాకు వెంటనే 'రిజిస్టరు పోస్టు'లో పంపగలము.

మేనేజర్,

అపరాధ పరిశోధన

హైదరాబాదు-29.

లాటరీలో లక్ష

భీమవరపు పురుషోత్తం

"భగవాన్ ఇంకా రాలేదా?" గంగాధరంను అడిగాను.

"రాలేదు సోదరా."

"సాధారణంగా లేటుగా రాడే!" మెల్లిగా అన్నాడు.

గంగాధరం ఫైల్లోంచి తలెత్తాడు. "నిజమే నీ స్నేహితుడు, ఇవాళ లేటుగా రాబోతున్నాడంటే చాలా వింతే!

పేపర్లో వేయించాలి" నవ్వుతూ అన్నాడు గంగాధరం. గంగాధరం సున్నిత మనస్కుడు మంచి సెన్సాఫ్ హ్యూమర్ వున్నవాడు సైలెంట్‌గా వుంటూనే, మంచి మంచి జోకులు వేస్తుంటాడు.

గంగాధర్ నవ్వువింటూ నా సీట్లో కూచున్నాను. ఎప్పటిలా గంగాధరం జోక్‌కి నవ్వురాలేదు నాకు. భగవాన్ గుర్తొచ్చాడు భగవాన్ డిస్పాచ్ క్లర్క్. మూడు సంవత్సరాల క్రితం భగవాన్, నేనూ ఒకేసారి ఉద్యోగంలో చేరాం. జాయినయిన రోజునే యిద్దరం మాటామాటా కలుపుకున్నాం. మూడు సంవత్సరాలుగా వర్ధిల్లుతోంది మా స్నేహం. నాకు పెళ్ళయింది. భగవాన్ అవివాహితుడు.

అదొకరకమైన స్వభావం భగవాన్‌ది. ఆఫీసులో నాతో తప్ప, మిగిలినవాళ్ళతో ముభావంగా వుంటాడు. పెద్దగా పరిచయాలు పెంచుకోడు. నాతో అంత స్నేహంగా వున్నా, కొన్ని అతని వ్యక్తిగత విషయాలు నాతోనే చెప్పడు. భగవాన్ స్వభావం ఆఫీసులో అందరికీ అలవాటే.

"ఇదిగో సోదరా మొన్న బాకీ యాభై రూపాయలు. నిన్నే యిచ్చేద్దామనుకొన్నాను. నిన్న ఆఫీసుకు రాలేదుగా నువ్వు" ఆరు ఐదునోట్లు, రెండు పదినోట్లు నిశ్శబ్దంగా నా టేబిల్‌మీద పెట్టి, తిరిగి తన సీట్లోకి వెళ్ళిపోయాడు గంగాధరం.

నోట్లు తీసుకొని జేబులో పెట్టుకొన్నాను.

మా ఆఫీసరు వస్తున్నట్లు గుర్తుగా, బూట్ల చప్పుడయింది. టేబుల్‌పై అందుబాటులో వున్న ఫైలు మొహానికి అడ్డుపెట్టుకొన్నాను.

నెలక్రితం నుండీ భగవాన్ అన్యమనస్కంగా వుండటం గమనిస్తున్నాను నేను. ఆఫీసరు రెండు, మూడుసార్లు

తిట్టాడుకూడా. ఉండబట్టలేక ఓ ఆదివారం అడిగాను సినిమా థియేటర్‌లో. ముందు చెప్పలేదు. చివరికి అతి బలవంతం మీద చెప్పించగలిగాను.

ఓ అమ్మాయితో పరిచయం ఏర్పడిందట వాడికి. పరిచయం ప్రేమగా మారిందట. ఇద్దరూ కనీసం రోజూ ఒక్కసారయినా, కలుసుకొనేవారట. ఎలా తెలిసిందో ఆ అమ్మాయి ఇంట్లో తెలిసిందట. ఇంట్లోవాళ్ళు ఆ అమ్మాయి చుట్టూ కట్టుదిట్టాలు ప్రారంభించారట. ప్రస్తుతం ఆ అమ్మాయిని ఇంతకుముందులా కాకుండా, అతి కష్టంమీద రెండు మూడు వారాలకు ఒక్కసారే కలుసుకోగలుగుతున్నాడట. ఆ అమ్మాయికి పెళ్ళి ప్రయత్నాలుకూడా చేస్తున్నారట.

నవ్వాను భగవాన్ ప్రేమకథ విని. "ఇదేమన్నా కథా? లేకపోతే సినిమా అనుకున్నావట్రా? ప్రేమలూ, దోమలూ అంటున్నావ్."

"ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకోకపోతే లైఫ్ వేస్టరా, పైగా ఆ అమ్మాయీ, నేనూ శారీరకంగా ఏకమయ్యాం కూడా" భగవాన్ నిశ్శబ్దంగా అన్నాడు.

ఉలిక్కిపడ్డాను భగవాన్ రెండవమాట విని.

ఎవరో వస్తున్న శబ్దం అయింది. నారాయణ లోపలికి వస్తున్నాడు.

"ఏరా మీ పంక్చువాలిటీగాడు ఆఫీసర్ రూమ్‌లో వున్నాడా?" తన సీట్‌వైపు నడుస్తూ, అడిగాడు నారాయణ.

"ఇంకా రాలేదు వాడు."

ఆగిపోయాడు నారాయణ. నా ముఖంలోకి చూస్తూ "జోకులెయ్యకు తొమ్మిది ఇరవయి నిమిషాలయింది. వాడు వచ్చి ఇరవయి నిమిషాలపైనే అయ్యుండాలి."

"భగవాన్ రాలేదు సోదరా" చెప్పాడు గంగాధరం.

నావంకే చూస్తూ, తన సీట్లో కూలబడ్డాడు నారాయణ.

"ఎందుకంటావ్?" ఆశ్చర్యంగా అడిగాడు.

"తెలీదు" చిరాగ్గా చెప్పాను.

నారాయణ మరోసారి చూసి, మాట్లాడకుండా తన పనిలో మునిగిపోయాడు. నారాయణది అతి చౌరవ మన స్తత్వం. భగవాన్‌కి, నారాయణకు పెద్ద గొడవయింది, ఆఫీసులో ఓసారి. కొట్టుకోబోయారుకూడా. తర్వాత కలిసి పోయారనుకోండి.

పదయింది భగవాన్ యింకా రాలేదు. ఆలస్యంగా రావడంగానీ, మానడంగానీ, అలవాటులేని భగవాన్ ఆరోజు రాకపోయేసరికి, ఆఫీస్‌లో అందరికీ ఆశ్చర్యం కలిగింది.

మర్నాడుకూడా రాలేదు. మరో రోజు గడిచింది. భగ వాన్ జాడలేదు. లీవ్‌లెటర్‌కూడా పంపించలేదని ఆఫీసర్ శధాకళి చేస్తున్నాడు. ఆ రోజు సాయంత్రం ఆఫీసునుండి రాగానే, బయల్దేరాను భగవాన్ యింటికి. సిటీలో మా యిల్లు ఈ మూలవుంటే, భగవాన్ యిల్లు ఆ మూల వుంది.

భగవాన్ వాళ్ళ నాన్నగారు చెప్పింది విని అదిరిపడ్డాను.

భగవాన్ మూడురోజులనుండి యింటికికూడా రాలేదట. భగవాన్‌కి నేను తప్ప స్నేహితులుకూడా ఎవరూ లేరు. ఇంట్లో చెప్పకుండా సినిమాకికూడా వెళ్ళడు. భగవాన్ నాన్నగారి పేరు పాల్‌గారు. పోలీస్ రిపోర్ట్‌కూడా ఇచ్చా రట ఆయన నిన్ననే! వెంటనే ఆయనా, నేనూ బయల్దేరాం పోలీస్‌స్టేషన్‌కు, మా రిపోర్ట్ సంగతి తేల్చుకోవడానికి. కేసు పోలీస్ రిపోర్ట్‌దాకా వెళ్ళేసరికి ఆశ్చర్యంవేసింది నాకు.

మేం స్టేషన్‌కు వెళ్ళేసరికి రాత్రి తొమ్మిదయింది.

"రండి కూర్చోండి" కుర్చీలు ఆఫర్ చేశాడు ఇన్ స్పెక్టర్.

కూర్చున్నాం. పాల్ గారు లంఖణాల రోగిలా వున్నారు.

"మీ అబ్బాయి కనిపించడంలేదని, మీరు రిపోర్ట్ ఇచ్చారుగదూ విన్న?"

"అవును ఇన్‌సెక్టరుగారూ, వాడి సంగతి ఏమన్నా తెలిపిందా?" పాల్‌గారి కంఠంలో సన్నగా వణుకు.

"మేమూ ఆ ప్రయత్నంలోనే వున్నాం. గంటక్రితమే, ఓ సైకిళ్ళ దొంగవద్దనుండి కొన్ని సైకిళ్ళు స్వాధీనం చేసుకొన్నాం. అందులో మీ అబ్బాయి సైకిల్ వుందేమో చూడండి."

ఇద్దరం వెళ్ళిచూశాం. అక్కడున్న సైకిళ్ళలో భగవాన్ సైకిల్‌ను సులభంగా గుర్తుపట్ట గలిగాం నేనూ, పాల్ గారు.

"సైకిల్ దొరకడంవల్ల ఏమైనా ప్రయోజనం వుంటుం దంటారా?" ఆశగా అడిగాడు పాల్‌గారు.

"ఏమీ వుండదు" చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

పాల్‌గారి మొహంలో నిరాశ.

"ఇతనెవరు?" నన్ను చూపించి అడిగాడు ఇన్స్‌పెక్టర్.

"మా అబ్బాయి స్నేహితుడు."

"మీపేరు, వివరాలు చెప్పగలరా?"

చెప్పాను.

"భగవాన్ మీ స్నేహితుడు గదా. అతని గురించి మీకు తెలిసినవికూడా చెప్పండి?"

"నాకు తెలిసినవి పాల్‌గారే చెప్పివుంటారు. కానీ ఎవ రికీ తెలియని విషయం మరోటి వుంది" ముందుకు వంగి చెప్పాను.

"ఏమిటది?" పాల్‌గారు, ఇన్‌స్పెక్టర్ ఒకేసారి ప్రశ్నిం

వారు.

భగవాన్ ప్రేమ విషయం చెప్పాను వివరంగా.

ఇన్‌స్పెక్టర్ ఆలోచిస్తూ విన్నాడు.

పాల్‌గారు తెల్లబోయి చూస్తున్నారు, నేను చెబుతుంటే.

"అంటే భగవాన్ ఆ అమ్మాయి పేరుగాని, తల్లి దండ్రుల పేర్లుగాని చెప్పలేదా మీకు?" అడిగాడు ఇన్స్పెక్టర్.

"లేదండి."

"ఆ విషయం తెలిస్తే కేసు చాలావరకూ క్లియరైపోను" ....నిరాశగా అన్నాడు ఇన్స్పెక్టర్.

2

మర్నాడు ఇన్‌స్పెక్టర్, ఇద్దరు కానిస్టేబుల్స్ వచ్చారు మా ఆఫీసుకు. ప్యూను దగ్గరనుండి ఆఫీసరు వరకూ, అందర్నీ రకరకాలుగా ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

ఆఫీసు బయట కుక్కల అరుపులు వినిపిస్తున్నాయి. పోలీసు కుక్కలు చెప్పారెవరో.

ఇక్కడ మా ఆఫీసు వాతావరణం గూర్చి కాస్త చెప్పాలి. మా ఆఫీసు అటవీ సంరక్షణశాఖకు సంబంధించింది. ఆఫీసు కూడా పేరుకుతగ్గట్టు అడవిలోనే ఉంటుంది. ఆఫీసునుండి టౌన్‌కు, రెండున్నర మైళ్ళు తారురోడ్డు కిరుప్రక్కలా గుబురుగా పెరిగిన ఫారెస్ట్. గంగాధరానికి లూనా ఉంది. ఆఫీసరుకు స్కూటర్ వుంది. మిగిలినవాళ్ళంతా సైకిళ్ళ మీదే అటునుంచి ఇటూ, ఇటునుంచి అటూ ప్రయాణం చేయాలి. అందరూ కారియర్‌లు తెచ్చేసుకొంటారు.

మర్నాడు గంగాధరం ఆఫీసుకు శెలవు పెట్టాడు.

అర్జెంట్ ఫైలు ఉండిపోయింది అతనివద్ద. సమయానికి ప్యూన్ లేదు. తప్పేదిలేక నన్ను పంపించాడు మా ఆఫీ

సరు, గంగాధరం యింటికి వచ్చినట్టు సైకిల్ తొక్కుకుంటూ వెళ్ళాను.

గంగాధరానికి జ్వరమట. డాక్టర్ దగ్గరకు వెళ్ళాడట. ముందర గదిలో కూర్చుని ఉన్న వాళ్ళ నాన్నగారు చెప్పారు. ఫైలు గురించి చెప్పాను. ఇంతలో లోపలినుండి ఎర్రగా అందంగావున్న, ఓ ఇరవయ్యేళ్ళ అమ్మాయి వచ్చింది ముందు గదిలో టేబుల్‌మీదవున్న పుస్తకాలు సర్దుతూంది. కూతుర్ని లోపలికి పొమ్మని కేకలేస్తూ, ఫైలుకోసం తనూ లోపలికి వెళ్ళిపోయాడాయన.

అప్పుడు గమనించాను. ఆ అమ్మాయి సన్నగా ఏడుస్తూందని. ఏదో యింట్లో గొడవ అయ్యుంటుందనుకొన్నాను. అక్కడే టేబుల్‌పైవున్న కొన్ని పుస్తకాలు సర్దుకొని లోపలికి వెళ్ళిపోయిందా అమ్మాయి.

చిన్నఫోటో పుస్తకాల్లోంచి జారిపడడం గమనించలేదామె.

కుతూహలంగా చూశాను ఆ ఫోటోవంక.

అంతే! అదిరిపడ్డాను.

భగవాన్....భగవాన్ ఫోటో అది. అది ఆ అమ్మాయి దగ్గరెందుకుంది.

గబగబా ఫోటో తీసి షర్ట్ జేబులో దాచేశాను.

ఇంతలో లోపల్నుండి, గంగాధరం తమ్ముడు చలపతి ఫైలుపట్టుకొని వచ్చాడు.

3

మర్నాడు మామూలుగా ఆఫీసుకు వచ్చేశాడు గంగాధరం.

లంచ్ అవర్‌లో కారియర్ భోజనం చేస్తున్నాం, నేనూ గంగాధరం ఎదురెదురుగా కూర్చుని.

"గంగాధర్ పదవతారీఖు పేపరు చూశావా?"

"ఏం?"

"చూశావా?"

"లేదు."

"అందులో రెడ్‌క్రాస్ సొసైటీ లాటరీలు పడ్డాయి తెలుసా?"

"ఏవేవో లాటరీ ఫలితాలు, ప్రతిరోజూ పేపర్లో పడుతూనే ఉంటాయిగదా."

"కావచ్చు కానీ ఈ ఫలితాలకు ఓ ప్రత్యేకత ఉంది."

"విషయం వినరంగా చెప్పు సోదరా విసిగించక."

"ఇదేం ఆషామాషీ విషయంకాదు కులాసాగా చెప్పేయడానికి."

"లాట్రీ తగిలిందా నీకు."

"లాట్రీ తగిలినంత వరకూ నిజమే, కాని నాకు కాదు."

"మరెవరికీ?"

"భగవాన్‌కి."

"భగవాన్‌కా!?!"

"భగవాన్‌కే, వాడికి లాటరీల పిచ్చి ఉందన్న సంగతి నీకు తెలిపిందేగా రెడ్‌క్రాస్ సొసైటీ టిక్కెట్లు నాలుగు కొన్నాడు. వింటే ఆశ్చర్యపోతావ్. అందులో ఓ టిక్కెట్‌కి లక్షరూపాయలు ప్రైజు తగిలింది."

"ఆఁ!!" అంతవరకు అనాసక్తిగా వింటున్నవాడల్లా, నోరు తెరుచుకొని ఉండిపోయాడు గంగాధరం.

"అవును ఆరోజు పొద్దున్నే చెప్పాడు ఈ విషయం నాకు ఉప్పొంగిపోతూ. డబ్బు తెచ్చుకోడానికి మర్నాడే వెళ్తానన్నాడు. ఇదిగో నెంబరు కూడా నోట్ చేసుకొన్నాను."

చిన్న కాగితం ముక్క అందించాను, షర్ట్ జేబులోంచి తీసి.

ప్యూన్‌చేత పదవ తారీఖు పేపరు తెప్పించాడు గంగాధరం. నేనిచ్చిన కాగితంలో నెంబరును, పేపర్లో రెడ్ క్రాస్ లాటరీ ఫలితాలకు టాలీచేసి చూశాడు.

అతని మొహంలో ఆశ్చర్యం!

"ఒకవేళ డబ్బు తెచ్చుకోవడానికి గానీ వెళ్ళాడేమో అనుకొంటున్నాను. అయినా అలా వెళ్ళినవాడు ఇంత వరకు తిరిగి రాకుండా ఉంటాడా?" అన్నాను.

"పోలీసులకు ఈ విషయం చెప్పావా."

"లేదు అక్కడికే వెళ్ళాడని గ్యారంటీ లేదుగా."

"భలేవాడివే లక్షరూపాయలు క్యాష్ తెచ్చుకోవడానికి, ఒక్కడు వెళ్ళాడంటే చుట్టూ ఎన్నో ప్రమాదాలు పొంచి ఉంటాయి. అసలు ఇలాంటి విషయాల్లోనే నేరాలు జరుగుతుంటాయి, నా మాటవిని వెంటనే ఈ విషయం పోలీసులకు చెప్పు" కంగారు పడుతూ చెప్పాడు గంగాధరం.

"అలాగే."

అని, మౌనంగా ఉండిపోయాను.

"టిక్కెట్ ఎవరిదగ్గిరన్నా దాచాడా, లేకపోతే తనవద్దే వుంచుకొన్నాడా?" అరనిమిషం తర్వాత అడిగాడు గంగాధరం.

"వాడి దగ్గరే వుంటుంది" నెమ్మదిగా చెప్పాను.

4

రాత్రి ఒంటిగంట అవుతోంది.

చీకటిలో ఫారెస్ట్‌లో, చెట్లు ఆయుధాలు ధరించిన రాక్షసులవలె కనిపిస్తున్నాయి.

మా ఆఫీసుకు రెండు కిలోమీటర్ల ముందుగా పొడూగ్గా

సన్నగా వున్న ఓ ఆకారం నడుస్తూంది, తొందర తొంద రగా. ఆ ఆకారం వెనకే ఫాలో అవుతున్నాను నేను. నా వెనుకగా కొద్దిదూరంలో, మరో ఆకారం మౌనంగా అనుసరిస్తుంది నన్ను. వెనుక ఆకారాన్ని గమనిస్తూ, ముందు ఆకారాన్ని అనుసరిస్తున్నాను.

ముందు ఆకారం ఆగింది.

కాసేపు అటూ ఇటూ వెదికి, ఓ చోట మోకాళ్ళమీద కూలబడింది. అంతవరకు చేతిలోవున్న పొడుగాటి వస్తువును క్రింద పడేసి అక్కడ పొదల్ని గట్రా పక్కకిలాగి, క్రిందపడేసిన వస్తువు తీసి త్రవ్వసాగింది.

ఊపిరి నొక్కిపట్టి, దృష్టి కేంద్రీకరించి చూస్తున్నాను.

కాసేపటికి త్రవ్వడం పూర్తిచేసింది ఆ ఆకారం. తరువాత లోపలికి వంగి, లోపలినుండి దేన్నో బయటికి లాగుతుంది. మరి కాసేపటికి గోతిలోంచి ఓ ఆకారాన్ని బయటకు లాగింది.

చటుక్కున వెనక్కి తిరిగాను.

నాకు కాస్త దూరంనుండి ఈ చోద్యం చూస్తున్న వెనుక ఆకారంకేసి చూపి, గట్టిగా అర్చాను.

"కమాన్ ఇన్‌స్పెక్టర్."

దాంతో వెనుకనున్న ఇన్‌స్పెక్టర్ కూడా, కర్కశంగా అర్చాడు.

"లైట్స్ ఆన్."

నాముందు ఆకారం ఈ కేకలు విని పైకిలేచే లోపలే, ఆ ప్రదేశం అంతా వెలుగుతో నిండిపోయింది.

ఆరుగురు కానిస్టేబుల్స్, లైట్స్ వెలుగులో స్పష్టంగా కనిపిస్తూ చెమట్లు కక్కుతున్న, ఆ వ్యక్తిని చుట్టుముట్టారు.

గోతిలో వికృతంగా కనబడుతోంది భగవాన్ శవం.

కళ్ళనీళ్ళు తిరిగాయి నాకు భగవాన్ శవాన్ని చూసి.

పాలిపోయిన మొహంతో నావంక చూస్తున్న ఆ వ్యక్తి కేసి చూసి హేళనగా నవ్వాను. "లాటరీ టిక్కెట్ కోసం వెదుకుతున్నావా?"

తలదించుకొన్నాడు గంగాధరం, ఇన్స్పెక్టర్ చేతులకు బేడీలు వేస్తుంటే.

5

కోర్టువారి కథనం ప్రకారం:

భగవాన్, గంగాధరం చెల్లెలిని ప్రేమించాడు. మతానికీ, సాంప్రదాయానికీ ప్రాణమిచ్చే రకం గంగాధరం కుటుంబం. అందుకే విషయం బయటికి పొక్కకుండా ప్రేమికు లిద్దరికీ నయానో, భయానో చెప్పిచూశారు. ప్రయోజనం లేకపోయింది. ఇంతలో ఆ అమ్మాయి గర్భవతి అన్న పిడుగులాంటి వార్త తెలియడంతో, భగవాన్ని అంతం చేయడానికి పూనుకొన్నారు గంగాధరం కుటుంబం వాళ్ళు.

పదవ తారీఖున నేను శలవు పెట్టడంతో ఆఫీసు వదిలేశాకా, భగవాన్ ఒక్కడే వస్తున్నాడు. సమయం రాత్రి ఎనిమిదవుతుంది. అంతా చీకటిగా వుంది. మధ్యాహ్నం కారియర్ తెచ్చే నెపంతో, గంగాధరం తమ్ముడు చలపతి కూడా ఆఫీసుకి వచ్చాడు. భగవాన్ వెనకాలే లూనా మీద బయలుదేరారు గంగాధరం, చలపతి. వచ్చేటప్పుడు వాచ్ మేన్కు తెలియకుండా ఆఫీసు స్టోర్ రూమ్లోంచి గడ్డపారను తీసుకొచ్చారు.

చలపతి లూనా వేగంగా డ్రైవ్ చేస్తుంటే, వెనకాల కూర్చున్న గంగాధరం సైకిల్పై వెళుతున్న భగవాన్ని,

గడ్డపారతో కొట్టి చంపాడు. తర్వాత భగవాన్ శవాన్ని అక్కడే అడవిలో పాతిపెట్టారు.

పాతిపెట్టేటప్పుడు శవం జేబులో వున్న ఎనభై రూపాయలు తీసుకొన్నాడు గంగాధరం. తరువాత, గడ్డపారను శుభ్రంగా తుడిచి, దాన్ని లూనా మీద తిరిగి వెనక్కి తీసి కెళ్ళి, వాచ్‌మేన్‌కు తెలియకుండా, ఆఫీసు వెనుక భాగంలో వుండే స్టోర్ రూమ్‌లో యధాస్థానంలో వుంచేశాడు. భగవాన్ సైకిల్‌ను పిటీ మొదలుదాకా తీసుకొనివచ్చి, అక్కడ రోడ్ ప్రక్కన పడేశారు.

కోర్టులో నేరాన్ని ఒప్పుకొన్న తర్వాత, గంగాధరానికి యావజ్జీవ శిక్ష పడింది. చలపతికి రెండేళ్ళు వేశారు.

"థాంక్స్యూ రాజాగారూ! మీ సహాయ సహకారాలతో మా పని కాస్త సులభం చేశారు. మరోలా చెప్పాలంటే హంతకుణ్ణి మీరే పట్టిచ్చారు." నన్ను అభినందించాడు ఇన్‌స్పెక్టర్.

"థాంక్యూ సర్" చిన్నగా నవ్వాను.

ఇన్‌స్పెక్టర్ శెలవు తీసుకొన్నాడు నవ్వుతూ.

కోర్టు ఆవరణలో నడుస్తున్నాం నేనూ, పాల్‌గారు.

"ఈ గంగాధరం గాడి సంగతి ఎలాతెలుసుకో గలిగావ్ బాబు?" ఆత్రంగా అడిగారు పాల్‌గారు.

నవ్వాను నేను మెల్లిగా. "చాలా సింపుల్ సార్! భగవాన్ అభిమాన రచయిత ఆనంద్ సంతకంవున్న ఐదు రూపాయల నోటు, ఎప్పుడు భగవాన్ జేబులో ఉంటుంది. భగవాన్ కనిపించని రోజున, గంగాధరం నాదగ్గర తీసు కొన్న బాకీ యాభై రూపాయలు తిరిగి యిచ్చాడు. అందులో, ఆనంద్ సంతకం ఉన్న ఐదు నోటుంది. అది భగవాన్‌దే! నాకు బాగా గుర్తు. వెంటనే గంగాధరం మీద అనుమానం

వచ్చింది నాకు. తర్వాత గంగాధరం ఇంట్లో భగవాన్ ఫోటో చూపిన తర్వాత, నా అనుమానం బలపడింది.

ఇన్‌స్పెక్టర్‌గారితో ఈ విషయాలన్ని చెప్పాను. అతను మా ఆఫీసుకు పోలీసు కుక్కలను తీసుకొచ్చినప్పుడే, భగవాన్ సమాధి తెలిసిపోయింది. కానీ గంగాధరంమీద అనుమానం బలంగా ఉండటంవల్ల హంతకుణ్ణి రెడ్ హేండడ్‌గా పట్టుకోవాలని, సమాధిని యధాతదంగా ఉంచేశారు పోలీసులు. ఇన్‌స్పెక్టర్‌గారి అనుమతితో, గంగాధరానికి లాటరీ టిక్కెట్ కథ చెప్పి, చీకట్లోకి రాయి విసిరేను. రాయి సూటిగా తగిలింది దోషులు దొరికారు...."

"నిజంగా స్నేహితుడి ఋణం తీర్చుకున్నావు బాబు" కళ్ళొత్తుకున్నారు పాల్‌గారు.

భగవాన్ గుర్తుకు రాగానే, నా కళ్ళు కూడా చెమర్చాయి. □

అశుభ శకునం



నిద్రదోపిడి

బి. రాజేశ్వరి

"పట్టుకోండి, పట్టుకోండి" వెనక గుంపు దగ్గరయ్యేకొద్దీ వేణు పిక్కబలం చూపించాడు.

అదృష్టవశాత్తు రోడ్డున యెవరూలేరు ఆ సమయంలో. రాత్రి తొమ్మిదిన్నర అయింది. జనం యిళ్ళలో వెచ్చగా పడుకుని వుండే నమయం. అసలే చలికాలం. ఎనిమిది

గంటలకే సద్దుమణిగిపోయింది

వేణు కెదురుగా ఆటో వస్తోంది. ఆపాడు. వెనకాల వస్తున్న గుంపును ఆటోవాడు గుర్తించేలోపల, "ఖైరతాబాద్ చౌరస్తా!" అని చెప్పి కూచున్నాడు.

ఆటో వెనక్కి తిరిగి దూసుకుపోయింది. వెనక గుంపు బాగా దూరమయిపోవటం చూశాక "హమ్మయ్య!" అంటూ సీటుకి జారగిలబడి హాయిగా వూపిరి పీల్చుకున్నాడు వేణు.

"ఏం భయ్. ఆళ్ళుగట్ల తరుముకొస్తుంన్రేం. ఏం గొట్టేసినా వేంది?" అన్నాడు ఆటోడ్రయివర్.

వేణు గతుక్కుమన్నాడు. వీడి అసాధ్యం కూలా, అంతా గమనించినట్టున్నాడు! ఏ పోలీస్ స్టేషన్‌కో తీసుకుపోడుకదా! భయంతో అతని గుండె వేగంగా కొట్టుకుంటోంది. చెమట్లుపోసి గుడ్డలు తడిసిపోతున్నాయి. ఊపిరాడనట్టు యిబ్బందిగా, అనీజీగా ఫీలయ్యాడు.

"ఛ, కొట్టేయ్యటం కాదు.ఏంకాదు, నా స్నేహితురాలిని అర్జంటుగా కల్సుకోవాలని వాళ్ళింటికి వెళ్ళాను. నేనంటే వాళ్ళ పెద్దాళ్ళకు యిష్టంలేదు. అందుకని అవకాశం దొరకగానే, నన్ను పట్టుకోవటానికి వెంటపడ్డారు. నేనంత తేలిగ్గా దొరుకుతానా? పరుగెత్తుకొచ్చేశాను. ఇక ఏం చెయ్యగలరు?" చెప్పాడు వేణు.

"ఆ అమ్మాయి పెద్దోల్ల యిజ్జత్ ఖరాబవుతాది గదా, నువ్ గట్ల పోద్దోయినాంక పోవచ్చునా!" హితవు చెప్పాడు ఆటోడ్రయివర్.

"నేను చెప్పాల్సిన కబురు చాలా ముఖ్యమైనది. రేపటిదాకా ఆగటానికి వీల్లేదు. చాలా అర్జంటు విషయం. అందుకే యింటికి వెళ్ళాల్సి వచ్చింది." ఆటోడ్రయివర్‌కి సంజాయిషీ చెప్పుకోవలసి వచ్చినందుకు గుర్రుగా వుంది

వేణుకి.

ఖైరతాబాద్ చౌరస్తా దగ్గరపడింది. "ఎక్కడ రుకా యించమంటవ్ సాల్లి?" అనడిగాడు డ్రైవర్.

"ఇక్కడ ఆపెయ్యి" అంటూ ఆటో దిగి మీటరు చూశాడు డబ్బు చెల్లించటానికి. నాలుగు రూపాయల నలభై పైసలయింది. అయిదురూపాయల నోటు అందించాడు.

డ్రైవర్ అందుకోలేదు. ఐదు నోటువంక ఏదో అంటరాని వస్తువును చూసినట్టు చూశాడు.

"పదిరూపాయలు!" అన్నాడు పొగరుగా.

"అదేంవిటి, యింకా పదికూడా దాటలేదు. పదకొండు దాటాకకదా డబుల్‌ఛార్జి?!"

"నాకు చీకటిపడితే డబుల్‌ఛార్జి యివ్వాల్సిందే! నాతో తకరార్లు జేస్తానై."

"ఆ సంగతి నువు చెప్పలేదు."

"నువ్ అడిగినవా సాల్లి?"

వేణు లోలోపల గొణుక్కుంటూ పదినోటు తీసి డ్రైవర్‌కిచ్చాడు. డ్రైవర్ దాన్ని చేబులో పెట్టుకొని, "ఇది ఆపదలో నీ ఇజ్జత్ దక్కించినందుకు. మీటర్ చార్జి మరో దస్‌రుపయ్యా దేవ్!" అన్నాడు చిద్విలాసంగా కాళ్లు వూపుతూ.

"ఇవ్వకపోతే ఏం చేస్తావు?"

"ఇవ్వకుంటేనా సాల్లి? నిన్నిప్పుడెక్కడ్నించి తీసొక్చ్చినానో ఆడనే వొదిలేసి ఆ పిల్ల బందుగుల్కి అప్పగించేస్తను."

వేణు గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి.

ఇదెక్కడి గొడవనుకుని, జేబులో చెయ్యిపెట్టి మిగిలి

వున్న ఒకేఒక యిరవై నోటుతీసి ఆటో డ్రయివర్‌కిచ్చాడు.

డ్రయివర్ యిరవై నోటందుకుని బర్రున ఆటో స్టార్టు చేసుకుని దూసుకుపోయాడు. వేణు నివ్వెరపోయి చూస్తూ వుండిపోయాడు. ఇరవై యిస్తే పదినోటు చిల్లర యిస్తా డనుకున్నాడు. కాని డ్రయివర్ అన్నివిధాల మోసంచేసి పోయాడు. పాతికరూపాయలు నష్టపోయాడు తను!

* * *

వేణు కాళ్ళీడ్చుకుంటూ ఆనందనగర్ కాలనీకి బయల్దే రాడు. చౌరస్తా దాటి నాలుగడుగులు వేశాడో లేదో, ఇద్దరు బీట్ కానిస్టేబుల్స్ అటకాయించారు.

వేణు తడబడ్డాడు. ధైర్యం తెచ్చుకున్నాడు.

"ఏడకిబోయి వొస్తుండవ్?" అనడిగారు వాళ్ళు చటు క్కున "సినిమాకి!" అన్నాడు.

"టికెట్ చూపించు" అన్నాడు వాళ్ళలో ఒకడు.

వేణు హడావుడిగా జేబులన్నీ వెతికేసి, "పడిపోయి నట్టుంది!" అన్నాడు.

"ఊహూ. అట్టాగా? ఏం సిన్మాజూపినవ్?"

వేణు నోటికొచ్చిందేదో చెప్పేశాడు.

రెండోవాడు "ఏ థియేటర్ల జూపినవ్?" అనడిగాడు. సన్నగా, రివటలా పొడుగ్గా వున్నాడతను.

"అమరావతి!" దగ్గర్లో వున్న థియేటర్ పేరు చెప్పే శాడు.

ఆ యిద్దరు పగలబడి నవ్వారు. వాళ్ళెందుకు నవ్వు తున్నారో వేణుకి అర్థంకాలేదు. తెల్లమొహం వేసి వాళ్ళ వైపే చూస్తూండిపోయాడు.

ఇద్దర్లో పొడవుగా కర్కశంగా వున్నవాడు ముందు కొచ్చి, లాఠీతో వేణు పొట్టమీద పొడిచి, "చూడు బిడ్డా,

నువ్ జెప్పిన పిన్మా అమరావతిలో నేగాదు, ట్విన్ పిటీసుల ఎక్కడ అట్టంలేదు. అదిటోయి రొండు దినాలయింది. పేపర్జూడవా మల్లీ?'' అన్నాడు.

వేణుకి తనెంత పొరపాటు చేశాడో అర్థమయింది. అబద్ధ మాడటం తనకి చేతకాదు. అనవసరంగా నెత్తికి తెచ్చుకున్నాడు. ఇప్పుడేం చెప్పి వాళ్ళను నమ్మించగలడు? తనని దొంగో హంతకుడో అనుకొంటారు వాళ్ళు! పైగా, తనెవరో నిరూపించుకునే అవకాశం కూడా యివ్వకుండా లాకప్‌లో తోసేస్తారు. ఎలాంటి విపత్కర పరిస్థితి వచ్చిందిః?

అసలు, దీనంతటికీ కారణం ఆ రాధ! ఆమెకు ఆ 'కబురు' అందించాలనే ఆత్రంలో తను సమయాసమయాలు కూడా గుర్తించకుండా వెళ్ళి చిక్కుల్లో పడిపోయాడు. చావు తప్పి కన్ను లొట్టపోయి తప్పించుకొని వచ్చాడనుకుంటే యిక్కడ వీళ్ళచేతుల్లో చిక్కుకుపోయాడు. ఇప్పుడెలా?

మొరటు కానిస్టేబిల్ వేణు జబ్బ పుచ్చుకుని, "ఏం మాతో పరాచికాలాడ్తున్నావా? అసలు నువ్వెవరో, ఏందో తెలిసేదాకా లాకప్పులో అరాం తీస్కుందువ్ పద బిడ్డా!'' అన్నాడు.

వేణు ప్రాణం గిలగిల్లాడిపోయింది.

"చూడండి కనిస్టేబుగారూ! నేను మా ఫ్రెండును కల్సుకోవటానికి చిక్కడపల్లి పోయివస్తున్నాను. ఆటోలో దిగి నడిచి యింటికిపోతున్నాను'' అని ఏదో చెప్పబోయాడు.

కానిస్టేబిల్సు యిద్దరు మరోసారి ఫకాల్మని నవ్వారు.

మోటు కానిస్టేబిలు వేణు మొహంలోకి గుచ్చిచూస్తూ. "చూడు బిడ్డా, ఆటోలో వొచ్చే అమీర్‌బోయ్ నీలా నడి

రోడ్డు మద్దెన దిగిపోడు. మఖాన్ దాకా ఆటోలపోతడు. నువ్వెందుకు నడిమద్దెన రుకాయించినవ్ మల్ల? నమ్మేటందుకి మేం దిమాకు లేనోల్ల మనుకున్నవా మల్ల?" అంటూ కొట్టినంత పనిచేశాడు.

వేణుకి కళ్ళనీళ్ళు తిరిగాయి. ఆటోవాడికి తన యిల్లు తెలియటం యిష్టంలేక నడిరోడ్డుమీద చౌరస్తాలో దిగిపోవటం ఎంత ప్రమాదానికి దారితీసింది? ఈ పోలీసులు తననిక నమ్మరుగాక నమ్మరు.

చివరి ప్రయత్నంచేశాడు. "కానిస్టేబులుగార్లూ! దయచేసి నాతో నాలుగడుగులు ముందుకొచ్చారంటే మీకంతా అర్థమైపోతుంది. మా యిల్లు చూడొచ్చు, నా మాటలు నిజమో అబద్ధమో మీకే తెలిసిపోతుంది. మా చుట్టుపక్కల యిళ్ళలో కూడా నా గురించి ఎంక్వయిరీ చేయవచ్చు. కాస్త రండి!" బతిమాలాడు వేణు.

"నో, నో!" అన్నాడు సన్నటివాడు.

"నై, నై!" అన్నాడు మొరటువాడు.

"నీ దగ్గిర పైసలెంతున్నయ్ భయ్?" అన్నాడు మళ్ళీ మొరటువాడు.

"నా దగ్గిరవున్న డబ్బంతా ఆటోవాడు పట్టుకుపోయాడు. చిల్లర యివ్వలేదు. చిల్లర అంటే చిల్లర పైసలుకాదు— పదిరూపాయలు"

"ఆటోవాడు పదిరూపాయలు ఎక్కువ పట్టుకుపోయాడంటే నువ్వు యిరవై యిచ్చి వుంటావ్! ఇరవై ఎందుకిచ్చావు చిక్కడ్‌పల్‌నుంచి? ఇదేదో గడబిడ్‌గానే వుండింది." అన్నాడు సన్నటివాడు.

మొరటువాడు క్రూరంగా చూశాడు వేణువంక. వేణు పూర్తిగా నీరుగారిపోయాడు.

"వల్ససురాల్ కూ! పొద్దుగాల తేలుస్తుం, నీ సంగతి!" అన్నాడు మొరటువాడు.

వేణు చేతులు రెండూ జోడించి, "నన్నొదిలెయ్యండి సార్! నేను దొంగను కాను, నేరస్తుడ్ని కాను! ఏనాడు జైలు మొహం చూసి వాడ్ని కాను, ప్లీజ్...." అన్నాడు ప్రాధేయపడుతూ.

వాళ్ళిద్దరు కిసుక్కున నవ్వారు.

"అసలెప్పుడూ జూళ్ళేదా? అయితే చూపిస్తుంరా! అవ్ ఖాయ్!" అన్నాడు మొరటువాడు వేణు జబ్బపట్టుకుని. చిగురుటాకులా వణికిపోయాడు వేణు ముచ్చెమట్లు పోశాయి. ఆనాటితో తన పరువు మర్యాదలూ, తమకుటుంబ పరువు ప్రతిష్ఠలు రచ్చకెక్కాయని అతని కర్థమయి పోయింది. వాళ్ళు వదలరని తెలిసిపోయింది.

వేణుకి అకస్మాత్తుగా గుర్తొచ్చింది—పోలీసులని మంచి చేసుకునే చిట్కా!

జేబులో చేయిపెట్టాడు కాని ఏం లాభం? ఉన్నదంతా అలోవాడు ఊడ్చుకుపోయాడే! సన్నవాడు కొంచెం మంచి వాళ్ళా వున్నాడని, ఆ కానిస్టేబిల్ వంకచూసి "చూడండి గురూగారూ, నా దగ్గిర పైసల్లేవు. మనం మనం ఫ్రెండ్స్! నా వెంట మాయింటికొస్తే అక్కడ ఏదో....ఏమంటారు?" అన్నాడు పైసలు అనే అర్థం అభినయించి చూపించి.

సన్నవాడు చటుక్కున వేణు ఎడమచేయి మణికట్టును పట్టుకున్నాడు. వేణు ఆశ్చర్యంగా చూశాడతనివంక. ఇతను మంచివాడనుకుంటే యితను కూడా యిలాగే....!?

సన్నవాడి అంతర్యం వేణుకి వెంటనే అర్థమైపోయింది. వేణు చేతినున్న వాచీ వూడి సన్నవాడి చేతిలోకి వచ్చింది.

"సీకోవాచ్ అంటే నాకెంతో మనసుగావుంది శానాళ్ళ

మంచి. మనం మనం దోస్తిలంటున్నవ్ గదా, దీన్ని నజరానాగా వుంచుకొందునా?" అన్నాడు పళ్ళు యికిలిస్తూ సన్నవాడు.

వేణు నిర్ఘాంతపోయాడు. నాలుగువందల ఏభై రూపాయల ఆటోమాటిక్ యింపోర్టెడ్ వాచ్ అది! దాన్ని ఆ పోలీసులకి యిచ్చేయటమా? ఎంత దుర్భరం!

మొరటువాడు కూడా స్నేహపూర్వకంగా నవ్వి, "పద బాబూ! బాగా చీకటయిపోయినాది. ఇంటికెళ్ళు. ఫిర్ మిలింగే?" అన్నాడు వేణుతో షేక్ హేండిస్తూ.

వేణు తనున్న పరిస్థితిలో వాళ్ళనేమీ అనలేనని అప్పటికే గ్రహించాడు. తనేమైనా మొరాయిస్తే వాచ్ దక్కకపోగా తనని తెల్లార్లూ సెల్ లోపడేసి కుళ్ళబొడిచేయగలరని డౌట్ వచ్చేసింది.

వాళ్ళవైపు ఏడుపులాంటి నవ్వు విసిరేసి వాళ్ళ బారి నుంచి తప్పించుకోవటమే గొప్ప అదృష్టంలా చకచక అడుగులు వేసుకుంటూ ముందుకు పరుగులాంటి నడకతో వెళ్ళిపోయాడు.

* * *

సందు మలుపు తిరుగుతుండగా యిద్దరు వ్యక్తులు వేణు ముందు అకస్మాత్తుగా ప్రత్యక్షమయ్యారు. నాటుసారా వాసన గుప్పున కొట్టింది. వాళ్ళిద్దరి చేతుల్లోను అడుగు పొడుగున్న చాకులు చీకట్లో కూడా మిలమిల మెరుస్తూ కనిపించాయి.

వేణు ప్రాణాలు గుప్పిట్లోకి వచ్చాయి. నోటమాట రాలేదు. నాలిక పొడారిపోయింది. చెమట్లతో ఒళ్ళంతా తడిసిపోయింది. ఎవరు వీళ్ళు? మళ్ళ విద్రోహాలా?

దొంగలా?

"ఏం....ఏం కావాలి? నేను." మాటలు నోటినుంచి బయటికి రావటం చాలా కష్టంగావుంది వేణుకి

"నీ పాకెట్లో ఎంతుందో నికాల్ బే!" అన్నాడొకడు చాలా పొగరుగా. వాడి కత్తి వేణు పీకకి కేవలం ఓ అంగుళం దూరంలో మాత్రమేవుంది.

"నా జేబుల్లో డబ్బులు అదే పైసలు ఏంలేవు. ఖాళీ." వాళ్ళు నమ్మరేమోనని, పాంటు రెండు జేబులు గుడ్డల్తో సహా బయటికిలాగి చూపించాడు. బాక్ పాకెట్లు రెండూ అలాగే లాగి చూపించాడు. షర్టు జేబుకూడా తిరగేసి చూపించాడు.

వాళ్ళిద్దరికీ బాగా కోపం వచ్చేసింది. రెండోవాడు వేణు దగ్గరగా వచ్చి లాగి చెంపమీద కొట్టాడు. ఆ దెబ్బతో గింగిరాలు కొడుతూ నేలమీద పడిపోవలసినవాడే, నిలదొక్కుకున్నాడు వేణు.

"పైసల్లేకుండా రోడ్ల ఎందుకు తిరుగుతుండవ్ బే! ఇంట్ల కూచుండకపోయినవా?" అన్నాడు. వాడూ తెలుగువాడే. మత విద్రోహులుకారు!

రెండోవాడు మీదికొచ్చి "గుడ్డలు నికాల్ బే!" అన్నారు.

వేణుకి వెంటనే అర్థంకాలేదు. "జేబులు ఖాళీ! చూపించాను కదా!" అన్నాడు అమాయకంగా.

మొదటివాడు విశదపరిచాడు "తుమ్ తొడుక్కున్న గుడ్డల్ తీసెయ్యిబే!" అన్నాడు.

వేణు విస్తుపోయి చూశాడు. "తీసెయ్యాలా? దేనికి?" అన్నాడు తన పాలిష్టర్ షర్టువంక, ఉలెన్ పాంటువంక చూసుకుంటూ.

రెండోవాడు అతని షర్టు గుండీలు టపటప తీసేశాడు.

మొదటివాడు అతని పాంటుజిప్ మీద చెయ్యి వేయ బోయాడు. వేణూ అదిరిపడ్డాడు.

"ఉండుండు, నేను తీపిస్తాను" అంటూ షర్టు, పాంటు తీసి వాళ్ళకిచ్చేశాడు. తను మొండికేస్తే నిలువునా ప్రాణాలు తీసేస్తారు. తనని చంపటం మానరు, గుడ్డలు ఒలుచుకు పోవటమూ మానరు. ముందే యిచ్చేస్తే ఏ గొడవా లేదను కున్నాడు వేణు.

ఉత్త అండర్ వేర్ మాత్రం మిగిలింది. వాళ్ళిద్దరూ దయగా వేణువంక చూసి, "అది వుంచుకో భాయ్!" అన్నారు.

అదే పదివేలనుకున్నాడు వేణు.

వాళ్ళిద్దరూ మరుక్షణం మాయమైపోయారు. వేణు అడుగు ముందుకు వెయ్యలేకపోయాడు. ఎలా యింటికి పోవటం? ఈ అవతారంతో యింకా రెండు ఫర్లాంగులు నడిచి వెళ్ళాలి. ఆటోవాడ్ని యింటిదాకా పోనివ్వకుండా మధ్యలో ఆపి దిగటంవల్ల కదా యిన్ని కష్టాలు?

అసలు యింటిదాకా వెళ్ళివుంటే, వాడు యిష్టం వచ్చి నట్టు డిమాండ్ చేసి తన దగ్గర్నుంచి డబ్బులు ఊడగొట్టే వాడేనా? నాన్నగారితో చెప్పి వాడి తోలు తీయించేసి వుండే వాడు కదా! ఛీ ఛీ, తను చాలా తెలివితక్కువగా ప్రవ ర్తించాడు.

ఎవరైనా తెలిసినవాళ్ళు కనిపిస్తారేమోనని హడలి పోతూ నాలుగడుగులు వేశాడు. ఇప్పుడు పోలీసులకి, ఈ దొంగలకి యేమిటి తేడా అనుకున్నాడు. వాళ్ళు వాచ్ లాక్కుంటే వీళ్ళు గుడ్డలు ఊడ్చుకున్నారు. వాళ్ళు వాచ్ లాక్కుని వుండకపోతే దొంగలు వాచ్‌తో సంతృప్తి పడి పోయేవారు, గుడ్డల జోలికి పోకుండా. ఏం దొరక్క

గుడ్డలు లాక్కున్నారు.

ఇప్పుడు టైం యెంతయిందో! అలవాటు ప్రకారం ఎడమచెయ్యి తిప్పి చూసుకుని నాలిక్క్కరచుకున్నాడు. వాచీ లేదుగా!

* * *

వేణు ఓ ఫర్లాంగు నడిచాడు.

రోడ్డు నిర్మానుష్యంగా వుంది. ఎవరూ ఎదురుపడటం గాని, వెనుకనుంచి రావటంగాని జరగలేదు. మరో ఫర్లాంగు నడిస్తే చేరిపోతాడు యిల్లు!

సరిగ్గా అప్పుడే ఊహించని సంఘటన జరిగిపోయింది. రోడ్డు పక్కగా పడుకుని వున్న ఊరకుక్క అతన్ని చూసి 'భౌ భౌ' మంది. అంతే, ఒక్కసారిగా సార్జంటు పిలుపు విన్న సైనికుల్లా ఎక్కడెక్కడినుంచో అరడజను కుక్కలు అరుచుకుంటూ వచ్చేశాయి.

వేణు ప్రాణం గాల్లో లేచిపోయింది. కుక్కలు తనను పట్టుకుని చీల్చేయకముందే పారిపోయి యింట్లోపడిపోవాలి!

ఒక్కసారిగా పరుగందుకున్నాడు. పదిగజాలు పరుగెత్తేసరికి కుక్కలు బాగా దగ్గరైపోయాయి. వాటి అరుపులు కఠోరంగా వున్నాయి వేణు, తన యిల్లు చేరుకునే లోపల అవి తనను ఖచ్చితంగా పీకేస్తాయని దృఢంగా నిర్ణయించుకున్నాడు.

అటు ఇటు చూశాడు. గేటు వేసివున్న ఇళ్ళే అన్నీను. లోపలకు వెళ్ళటానికి అనువుగా వున్న యిళ్ళేవీ కనిపించ లేదు. అందరూ గేటులోపలివైపు తాళంవేసేసుకుని వున్నారు.

వేణు అదృష్టవశాత్తు ఓ గేటు ఓరవాకిలిగా తీసివున్నట్టు కనిపించింది! వెంటనే గేటు తోసుకుని లోపలికి వెళ్ళి గేటు లోపలిగడియ పెట్టేశాడు. కుక్కలు లోపలికి రాలేక

గేటు బయట్నుంచే కర్ణకఠోరంగా అరవసాగాయి.

వేణు బిక్కు బిక్కుమని కాంపౌండ్ వాల్ కానుకుని నించున్నాడు. కుక్కలు పోతాయని చూశాడు గాని, అవి పట్టు వదలకుండా శక్తివంచన లేకుండా అరుస్తూనే వున్నాయి.

లైట్లు వెలిగాయి. ఇంట్లోవాళ్ళు లేచారు. వేణుకి కొంత ధైర్యం వచ్చింది. వాళ్ళకి తన దుస్థితి చెప్పుకుని వాళ్ళ సాయంతో యిల్లు చేరుకోవచ్చునని ఆశించాడు.

కిటికీలో నుంచి యెవరో తొంగిచూసి "దొంగ.... దొంగ...." అంటూ కీచుగా అరిచారు.

వేణు బిక్కచచ్చిపోయాడు. అప్పుడు గుర్తొచ్చింది అతనికి, తను కేవలం అండర్ వేర్ లోనే వున్న సంగతి! ఆ పరిస్థితిలో తను దొంగలాగే కనిపిస్తున్నాడు మరి!

ఎవరో తలుపు తెరిచారు. ఓరవాకిలిగా తెరిచి వేణును చూశాడా వ్యక్తి! అతను వేణుతో చదువుకుంటున్న సురేంద్ర. వేణుకి సంతోషానికి బదులు అవమానం బాధ, దుఃఖం ఒక్కసారిగా వచ్చేశాయి!

అతను—సురేంద్ర—కాలేజిలో తన బద్ధ శత్రువు! చూడక చూడక తన నీ అవతారంలో తన శత్రువు చూడటం 'దొంగ' అని అనిపించుకోవటం కన్న బాధకరంగా పరిణమించింది వేణుకి.

రేపు కాలేజి అంతా టాం టాం వేస్తాడు తన గురించి. ఆ అవమానం భరించి తను జీవించలేడు!

సురేంద్ర తల్లి కాబోలు, "తలుపులు తెరవకు. దొంగాడు లోపలికొచ్చేస్తాడు" అంటున్నది.

సురేంద్ర—ఏం చెప్పాడో ఆమె తలుపులు తెరిచి బయ

టికి చూపింది. వేణు ఆ వీధి కు్రరాదేనని తన కొడుకు క్లాస్‌మేటని ఆమెకు తెలుసు. అయితే వాళ్ళిద్దరి మధ్య శ్రతుత్వ మున్నట్టు ఆమెకు తెలీదు.

"అయ్యో, నువ్వా బాబూ! లోపలికి రా. అదేమిటి యింత రాత్రిపూట...." ఆమె మాటలు పూర్తి చెయ్య లేదు. వేణుకి అవమానంతో తల భూమిలోకి ఒరిగి పోయింది.

చటుక్కున గేటు తోసుకుని బయటికి రోడ్ మీది కొచ్చే శాడు—అప్పటికి కుక్కలు తమ ప్రయత్నం విరమించు కుని ఎటో పోయాయి.

అయిదు నిమిషాల్లో తమ యిల్లు చేరుకున్నాడు వేణు. లైట్లు వెలుగుతున్నాయి ఇంట్లో. తల్లి గుమ్మంలో నించుని ఆత్రంగా ఎదురుచూస్తోంది.

వేణు ఒక్క అంగలో లోపలికొచ్చి పడ్డాడు. మొదట ఆమె కూడా కంగారు పడింది—ఎవరో అనుకుని.

"నాయనా, నువ్వట్రా! నీ కోసం నాన్నగారు స్కూటర్ మీద వెతుకుతూ వెళ్ళారు" అని ఆమె కొడుకు కనిపించిన ఆనందం, ఆ అవతారంలో కనిపించినందుకు విస్మయం, యింకా యెన్నో భావాలు ముఖంలో ప్రతిఫలిస్తుండగా అడిగింది.

వేణు ఆమెకు చెప్పలేకపోయిన రహస్యం ఏమిటంటే, వేణు గర్ల్‌ఫ్రెండ్ రాధ మెడికల్ ఎంట్రన్స్ పరీక్షకు హాజ రవుతోంది. ఆ మర్నాడే ఎంట్రన్స్ టెస్ట్ హైద్రాబాద్‌లో 'సెంటర్' వున్నా ఆమె అన్నయ్య కావాలని 'గుంటూరు' సెంటర్లో రాయటానికి ఏర్పాటు చేశాడు.

అందుక్కారణం లేకపోలేదు. గుంటూర్లోని ఓ

ట్యుటోరియల్ కాలేజి తమ కాలేజి ద్వారా ఎంట్రన్స్ పరీక్షకు కూచున్నవాళ్ళకు ప్యాస్ గ్యారంటీయే కాక, రేంక్ ప్లస్ సెలెక్షన్ గ్యారంటీ కూడా యిస్తోంది హెచ్చు మొత్తంలో ఫీజు వసూలు చేసి. ఆ కాలేజి వాళ్ళకు, పరీక్ష నిర్వాహకులకు మధ్య 'అండర్‌స్టాండింగ్స్' వున్నాయట!

ఆ టెక్నిక్ తెలిసిన రాధ అన్నయ్యా 'పాస్ కమ్ సెలెక్షన్' కోసమని రాధచేత గుంటూర్లో పరీక్ష రాయించబోతున్నాడు. ఆమె వెంట ఆ రాత్రి గుంటూరు వెళ్ళబోతున్నాడు కూడా! రాత్రికి బయల్దేరే వీడియో బస్‌కి ప్రయాణం!

అయితే అనుకోకుండా పరీక్ష పేపర్లు బయటపడినాయనే కారణంచేత ఎంట్రన్స్‌పరీక్ష నిరవధికంగా వాయిదా పడింది ఆ విషయం తెలిసిన వెంటనే, ఆ సంగతి తెలియచెయ్యకపోతే రాధ అనవసరంగా గుంటూర్ వెళ్ళిపోతుందనే తొందర్లో ఆ సంగతి ఆమెకు తెలియచేయటానికి రాధ వుంటున్న చిక్కడపల్లికి అర్జంటుగా వెళ్ళిపోయాడు వేణు.

రాధ కూడా ప్రాంతీయ వార్తలు వింటుందని, ఆమె వినకపోయినా ఆమె అన్నయినా వినివుంటాడని వాళ్ళకూడా పరీక్షలు వాయిదా పడిన సంగతి తప్పక తెలుస్తుందనీ ఊహించకపోవటమే వేణు చేసిన పెద్ద పొరపాటు!

వేణు బెదుర్తూ బెదుర్తూ రాత్రిపూట రాధ యింటిదగ్గర ఆమె కోసం తచ్చాడటం గుర్తించిన వీధిలోని వాళ్ళు వేణును అనుమానించి వెంటబడ్డారు. అదీ జరిగిన సంగతి! □

సీరియల్

(గత సంచిక తరువాయి)

"మరి - నీకు నాతో సుఖం పంచుకోవాలని లేదా?"

"లేదు-ఇక్కణ్ణించి బయటపడడమే నాకు ముఖ్యం."

ఈ గది తలుపులు తీస్తాను. లోపలకో మనిషి వస్తాడు.

నువ్వతడి కంటబడకుండా బయటకు వెళ్ళు. ఆ మనిషి పరమ క్రూరుడు. రోజూ నాకోసం ఎదురుచూస్తూంటాడు. అయితే నా అనుమతి లేనిదే నా వంటిమీద చేయివేసే అధికారం వాడికిలేదు. నీకోసం నేనీరోజు వాడి నిక్కడ కాసేపు ఆపుతాను. ఈలోగా నువ్విక్కణ్ణించి పారిపో. నువ్వీగదిలో ప్రవేశించినా ఆకుపచ్చ తలుపు కోసం చూడు. అవే నీకు బయటకు దారిని చూపిస్తాయి...."

నందనరావు భయంగా "నా కోసం నువ్వు శ్రమపడవద్దు" అన్నాడు.

"శ్రమ నాకేమీ లేదు. ఇదే నా జీవితం. ఈ జీవితం నుంచి నాకు విముక్తిలేదు!" అని "కనీసం నీవంటివాడికి విముక్తిని ప్రసాదిస్తే అదో తృప్తి నాకు..." అందా యువతి.

నందనరావులో మానవత్వం పీకుతోంది, వివేకం హెచ్చరిస్తోంది. చివరకు వివేకమే జయించింది.

అతడు తలుపుల పక్కకు వెళ్ళాడు.

"ఎప్పుడయినా అవకాశం వస్తే నన్ను రక్షించడానికి ప్రయత్నించు" అందామె.

నందనరావు అనుమానంగా "పారిపోయే దారి తెలిసినప్పుడు నువ్వెందుకిక్కణ్ణించి పారిపోలేదు?" అన్నాడు.

"ఈ నగ్నదేహంతో బయటి ప్రపంచంలోనికి ఎలా వెళ్ళగలను?" అందామె.

"అవును-నిజమే!" అని ఒక్క నిమిషం ఆలోచించి "పోనీ నువ్వు బయటకు వెడతానంటే నా బట్టలు నీకిస్తాను" అన్నాడు నందనరావు.

ఆ యువతి అతణ్ణి సమీపించి కౌగలించుకుని పెదాల మీద ముద్దు పెట్టుకుంది. నందనరావామె చేష్టల కాశ్చర్య

పోయాడు.

"ఏమిటిది?"

"నువ్వు నిజంగా మంచివాడివి. దేవుడు నిన్ను తప్పక రక్షిస్తాడు."

"ఎందుకని?"

"నన్ను రక్షించాలనుకున్నావు- నీ ఆపదను మరచి! అదీ మానవత్వం....మానవత్వానికి దేవుడు కూడా జోహారనక తప్పదు."

"అయితే వెడతావా?"

"ఎలా వెడతాను? దుస్తులొక్కటే నా సమస్య కాదు. ఈ తలుపులు తెరుచుకోగానే ఒక క్రూరుడీ గదిలో అడుగు పెడతాడు. వాడికి నేను కాక నువ్వు కనబడితే నా కోసం వెతుకుతాడు. తప్పించుకునే అవకాశం నీకే వుంది. ఎందుకంటే ఆడదానిగా వాడిని నేనీ గదిలో కాసేపు ఆపగలను."

"ఇలా ఇంతవరకూ ఎవరయినా తప్పించుకున్నారా?"

"ఇంతవరకూ నేనీ విధంగా అయిదుగురికి సాయపడ్డాను. అయిదుగురూ శవాలుగా మారిపోయారు. ఆ శవాలు నాకు చూపబడ్డాయి."

నందనరావు శరీరంలో మళ్ళీ వణుకు ప్రారంభమయింది.

"భయపడకు, ఇక్కణ్నించి పారిపోవడం యించుమించు అసాధ్యం. అయితే అందుకు ప్రయత్నించడం వల్ల నష్టం లేదు. ప్రాణం పోయిందీ-రెడ్ పెల్ లోని క్రూర శిక్షల నుంచి తప్పించుకోగల్గుతావు. ప్రాణం పోలేదూ - అంటే తప్పించుకున్నావన్నమాట!"

"థాంక్స్....మిస్...." అని "నీ పే రడగలేదు నేను.

నా పేరు నందనరావు” అన్నాడతడు.

“నా పేరు చెప్పుకోవడం నా కిష్టంలేదు. ఏదో ఒక పేరు అవసరమనుకుంటే నన్ను మిస్ అజ్ఞాతగా గుర్తుంచుకో!” అందామె.

“నిన్ను తప్పకుండా గుర్తుంచుకుంటాను” అన్నాడతడు.

“నేను నీకు నా పేరు మార్చి చెప్పడానికి కారణముంది. మిస్ అజ్ఞాతలీ భవనంలో నాతోపాటు ఇంకా చాలామంది వున్నారు. నీ కవకాశం వస్తే అందర్నీ రక్షించాలి.”

“తప్పకుండా రక్షిస్తాను” అన్నాడు నందనరావు.

“థాంక్స్ ఫర్ ది ప్రామిస్” అందా యువతి. ఆమె అతడినలా తలుపు పక్కగా వుండమని సైగచేసి ఆ పక్కనే వున్న బటన్ నొక్కింది. తను తలుపులకు ఎదురుగా నిలబడింది. చూస్తుండగా తలుపులు తెరచుకున్నాయి.

నందనరావు తలుపుల పక్కనే నిలబడి వూపిరి బిగబట్టాడు.

మిస్ అజ్ఞాతగా అతడికి పరిచయమైన యువతి గుమ్మం వద్ద ఎవరినో చూసినదానిలా వెనకడుగు వేస్తోంది. ఇప్పుడామె పాదాలు మెత్తటి సవ్వడి చేయడం లేదు. గుమ్మం వద్ద కఠోరమయిన పదధ్వని వినబడుతోంది.

నందనరావును భయం, వుత్కంఠ ఆవహించాయి.

తలుపులు దాటుకుని ఓ మనిషి లోపల ప్రవేశించాడు. అతడి చూపులు సూటిగా అజ్ఞాతపైనే వున్నాయి. అతడు నెమ్మదిగా ముందడుగు వేస్తున్నాడు. అతడి ప్రతి అడుగు విచిత్రమైన చప్పుడు చేస్తోంది.

ఆ మనిషి ఆరడుగుల ఎత్తు రంగు నల్లటి నలుపు.

పళ్ళు కాస్త ఎత్తు. తలపైన మధ్యగా నిలువుగా పొడవుగా దట్టంగా జుత్తు అటూ యిటూ సన్నగా గీయబడి వుంది. అతడి కళ్ళు లేడిని చూస్తున్న పులిలా వున్నాయి.

అతడిని వెనుక నుంచి చూసిన నందనరావుకీ వళ్ళు భయంతో జలదరించింది.

అజ్ఞాత అతడిని ముందు నుంచి చూస్తోంది.

అతడు పూర్తిగా లోపలకు రాగానే తలుపులు తిరిగి మూసుకుంటాయని నందనరావుకు తెలుసు. అతడిలా గుమ్మం దాటి వెళ్ళగానే చప్పుడు చేయకుండా పిల్లిలా అక్కణ్నుంచి బయటపడ్డాడతడు. అతడు బయటకు రాగానే తలుపులు మూసుకున్నాయి.

నందనరావు ఛాతీమీద చేయి వేసుకున్నాడు. గుండె చప్పుడు అతడికి వినపడుతోంది. తనిప్పుడేం చేయాలీ అన్నదానికి మించి లోపల అజ్ఞాత ఏమవుతుందీ అన్న ఆలోచన అతడి నెక్కువగా భయపెడుతోంది.

అయితే అతడికున్న వ్యవధి తక్కువ. అతడు తన పరిసరాలను పరీక్షించాడు. తనున్నదొక చిన్న హాలు. తగుమాత్రం వెలుతురుంది. హాలుచుట్టూ ఆరు గుమ్మాలు వున్నాయి—అతడు వచ్చినది కాక... దూరానికి తలుపుల రంగులు స్పష్టంగా తెలియడంలేదు.

నందనరావు ఒకో గుమ్మందగ్గరకే వెళ్ళి తలుపుల రంగులు చూస్తున్నాడు. అతడు వచ్చిన తలుపు రంగు ఎరుపు. ఆ పక్కనే నీలం. అటుపైన కనకాంబరం. తర్వాత పసుపు. తర్వాత ఊదా. ఆ తర్వాత నలుపు.

ఇంకొక్కటే ఒక్క గుమ్మం మిగిలింది.

అది ఆకుపచ్చ కాకపోతే... అప్పుడు తనే గుమ్మం గుండా బయటకు పోవాలి? అజ్ఞాత తనకిచ్చిన సూచనలో

ఏదైనా పొరపాటుందా?

ఆఖరి గుమ్మంవద్దకువెళ్ళడానికి నందనరావుకు భయం వేసింది. ఆ తలుపుల కాకుపచ్చ రంగులేకపోతే ఏంచేయాలో అన్నది అతడి బెంగ! అతడు ధైర్యాన్ని కూడగట్టుకునేం దుకు కాసేపు పట్టింది. అతడిలా కదలాలనుకున్నాడో లేదో చటుక్కున ఆఖరి గుమ్మం తలుపులు తెరుచు కున్నాయి.

అప్పుడు నందనరావు స్పష్టంగా చూశాడు. ఆ తలుపుల రంగు ఆకుపచ్చ. అయితే అతడి సంతోషం ఎంతోసేపు నిలవలేదు.

ఆ ద్వారంలోంచి బలిష్టుడూ, ఆజానుబాహుడు అయిన ఒక వ్యక్తి వచ్చి గుమ్మందగ్గరే కాళ్ళు ఎడంగా పెట్టి చేతులు చారచాపి నిలబడ్డాడు. అతడు నిలబడ్డ తీరునుబట్టి గుమ్మం లోంచి ఎవరూ బయటకు పోకుండా ఆపడానికే అతడలా నిలబడ్డాడనిపిస్తుంది.

అతడెందు కక్కడికి వచ్చాడు? అప్పుడే అక్కడికెందు వచ్చాడు?

అతడికి తను పారిపోబోతున్నట్లు తెలిసిందా?

ఇప్పుడు తనేం చేయాలి?

నందనరావా వ్యక్తిని పరీక్షించి చూశాడు. అతడింకా నందనరావును చూడలేదు.

ఆకారాన్నిబట్టి ఆ మనిషి తనను చేత్తో ఎత్తి బంతిలా విసిరి ఆడుకోగల సమర్థుడని నందనరావు గ్రహించాడు.

"అయిదుగురికి సాయంచేశాను. అయిదుగురూ శవాలుగా మారారు" అన్న అజ్ఞాత మాటలతడి చెవిలో గింగురు మంటున్నాయి.

6

కాలింగ్‌బెల్ చప్పుడు విని త్రుతగా పరుగున వెళ్ళి తలుపుతీసింది చంప. ఎదురుగా కనపడిన వ్యక్తిని చూసి- "మీరా?" అంది నిరుత్సాహంగా.

"ఎవరికోసమమ్మా ఎదురుచూస్తున్నావు?" అన్నాడు జగపతిరావు అభిమానంగా.

చంప చటుక్కున ఆయనకు నమస్కరించి—"డాక్టర్ని తీసుకొస్తానని వెళ్ళారు. బాబుకు వంట్లో బాగోలేదు...." అంది.

"ఎవరూ? నందనరావా?" అన్నాడు జగపతిరావు.

"అవును. బయల్దేరుతూంటే ఏదో కారొచ్చింది. అందులో వెళ్ళారు. వెళ్ళి రెండుగంటలు దాటింది. ఇంత వరకూ ఆయన ఐపులేరు...." అంది చంప. ఆపుకుందా మన్నా దుఃఖం ఆగడంలేదు.

"ఏదీ పద—నేను వచ్చి చూస్తాను" అంటూ జగపతి రావు లోపలకు వచ్చాడు. ఆయన వెళ్ళి చూసేసరికి బాబింకా మూసిన కన్ను తెలియకుండా పడుకుని ఉన్నాడు. జగపతిరావు బాబు వళ్ళుచూసి—"నువ్వు బాబును తీసుకుని నాతో పద. వెంటనే డాక్టరు దగ్గరకు వెడదాం" అన్నాడు.

మారు మాట్లాడకుండా బాబును భుజాన వేసుకుంది చంప. జగపతిరావు ముందు నడవగా ఆయన్ననుసరించి బైటకు వచ్చి యింటికి తాళంపెట్టింది. తర్వాత ఆయనతో పాటే కారెక్కింది. కారు రివ్వున దూసుకుంటూ పోయి ఒక నర్సింగ్‌హోం ముందాగింది. జగపతిరావు కారు దిగి లోపలకు వెళ్ళి ఏదో మాట్లాడివచ్చాడు.

"నర్సింగ్‌హోంలో బాబును అడ్మిట్ చేసుకుంటా నన్నారు. ఇక్కడున్న సదుపాయాలీ ఊళ్ళో మరెక్కడా

వుండవు. బాబు ఆరోగ్యానికి నేను గ్యారంటీ. ఎటొచ్చీ నువ్వు బాబుదగ్గర వుండకూడదు" అన్నాడు జగపతిరావు చంపతో.

"అంటే?" అంది చంప.

"బాబుకు సంపూర్ణారోగ్యం చేకూరేదాకా నువ్వు బాబు దగ్గరుండకూడదు. అది ఈ నర్సింగ్‌హోం నియమం...." అన్నాడు జగపతిరావు

"కానీ బాబు నేను లేకుండా వుండలేడు...."

"ఇక్కడలాంటి బాధేమీ లేదు. బాబును వాళ్ళు మరిపించగలరు."

చంప ముందు ఒప్పుకోలేదు. జగపతిరావు నెమ్మదిగా ఆమెకు నచ్చచెప్పి—"బాబుకు నయమయ్యేవరకూ నువ్వు మా యింట్లో వుందువుగాని. ఎప్పటికప్పుడు బాబు గురించిన సమాచారం ఫోన్లో తెలుసుకుందువుగాని. నీ కే యిబ్బందీ వుండదు. అదీకాక నేనసలు నీతో పనుండి వచ్చాను. మా యింటికి కొందరతిథులు వచ్చారు. ఇంట్లో సంబాళించుకునేందుకు నా భార్య ఒక్కతే వుంది. నిన్న సాయంగా పిల్చుకుని రమ్మనమని చెప్పింది. నీకోసం పని వాళ్ళను పంపడం మర్యాద కాదని పిలవడానికి నేనే స్వయంగా వచ్చాను" అన్నాడు.

చంప చివరికి ఒప్పుకుంది. బాబునక్కడ నర్సింగ్ హోంలో జాయిన్‌చేశాక బరువెక్కిన హృదయంతో ఆమె జగపతిరావు ఇల్లు చేరుకుంది. అయితే అక్కడ వాతావరణం పూర్తి భిన్నంగా వుంది

హాల్లో డిస్కో సంగీతం. దానికి అనువుగా కొన్ని జంటలు నృత్యం చేస్తున్నాయి. కొందరు కుర్చీల్లో కూర్చొని సంగీతం వింటున్నారు.

జగపతిరావామెను లోపలకు తీసుకుని వెళ్ళాడు. అతడి భార్య ఐశ్వర్యలక్ష్మి చంపను చూడగానే సంతోషంగా—

"వచ్చేవా అమ్మా!" అంది.

వారిరువురికీ తగుమాత్రం పరిచయముంది.

చంప నామెదగ్గర దిగవిడిచి జగపతిరావు పక్కనే వున్న ఓ గదిలోకి వెళ్ళాడు. అందులో మొత్తం పదిమంది పురుషులున్నారు.

జగపతిరావు తనే తలుపులు మూసి—"ఇప్పుడొక యువతి ట్రేలో టీ తీసుకుని మీ వద్దకు వస్తుంది. ఆమెను నఖశిఖ పర్యంతం గమనించండి ఆమె మనకేవిధంగా పని కొస్తుందో చెప్పండి" అన్నాడు.

ఆయన చెప్పినది వారందరికీ అర్థమయింది

ఆ యువతిని చూసి—ఆమె స్మగ్లింగ్ ఆపరేషన్సుకు పనికొస్తుందా, వ్యభిచారిణిగా రాణిస్తుందా అన్నది తేల్చాలి. ఈ రెంటికీ పనికిరానివాళ్ళు రెడ్ సెల్‌లో "అజ్ఞాత" స్థానానికి పంపబడతారు.

అక్కడ చేరిన పదిమందీ సామాన్యులుకారు. ఆవులిస్తే ప్రేగులు కనిపెట్టగల నిష్ఠులు. ముఖ్యంగా స్త్రీలను అంచనా వేయడం వారి ప్రత్యేకత. తన వ్యవహారాల్లో కొత్త యువతులను ప్రవేశపెట్టబోయే ముందు జగపతిరావు వారినిలా పిలుస్తాడు.

"ఇంతకూ ఎవరామె? పెళ్ళయిందా?" అన్నాడొకడు.

"పెళ్ళయింది" అన్నాడు జగపతిరావు.

"భర్తేమయ్యాడు?"

"బహుశా రేపటిదాకా ఉండడు...."

"అర్థమయింది ..." అన్నాడు వాళ్ళలో ఒకడు.

జగపతిరావు బయటకు వెళ్ళిపోయాడు.

"మళ్ళీ మనకు కొత్త పిట్టదొరికిందన్న మాట...."
అన్నాడు వాళ్ళలో ఒకడు. అందరూ పకపకా నవ్వారు.

కొత్త యువతిని ఎన్నికచేశాక మొదట ఆమె అక్కడ చేరిన పదిమందితోనూ అనుభవం పంచుకోవలిసి వుంటుంది. ఎవరికి ముందు అవకాశం వస్తుందీ అన్నది లాటరీ పిస్టం మీద తేలుస్తారు. ఇప్పు డీమె అందరికీ టీ యివ్వడానికి వస్తోంది కాబట్టి—ఆమె టీ యిచ్చిన వరుసక్రమాన్ని అనుభవంలో పాటించాలని అప్పటికప్పుడు వారందరూ ఒప్పందానికి వచ్చేశారు. ముందుగానే పేర్లు నోట్ చేసుకునేందుకు అందరూ కాగితం, బాల్ పెన్ను తీశారు.

సరిగ్గా అప్పుడే గదిలో చంప ప్రవేశించింది. ఆమె చేతిలో ట్రే వుంది. పది చిన్న చిన్న కప్పులున్నాయి.

గదిలో వున్న పదిమందీ ఒక్కసారిగా ఆమెవైపు తిరిగారు. వారందరి ముఖాలకూ నల్లద్దాల కళ్ళ జోళ్ళున్నాయి.

వారి కళ్ళు తన్ను నఖశిఖ పర్యంతం పరీక్షిస్తున్నాయనీ తన శరీరపు వంపుసొంపుల్ని అంచనా వేస్తున్నాయనీ—ఆ కళ్ళే తన భవిష్యత్తుకు భయంకరమైన బాటను వేయనున్నాయనీ ఆమెకు తెలియదు.

అందుకే చంప వారందరి వంకా చూసి చిరునవ్వు నవ్వింది.

"వాటే స్వీట్ స్మైల్....!" అనుకున్నారు వారందరూ.

ఆ నవ్వులో పసితనం వుంది. అమాయకత్వం వుంది. స్వచ్ఛత వుంది. అందముంది.

అంత మంచి నవ్వులో ఆ పదిమందీ యింకేమేమో వెతుకుతున్నారు.

చంప ట్రేతో వారిని సమీపించింది.

అందరూ ఆత్రుతగా ఆమెవంకే చూస్తున్నారు.

తానివ్వబోతున్న టీ స్వయంవర మంటపంలోని వర మాల వంటిదని ఆమెకు తెలియదు. ఆ భావనకే ఆమె సిగ్గుతో కుంచించుకుపోయేది

చంప టీ యిచ్చేలోగా పదిమందీ ఆమెవైపు చేతులు చాచారు.

ఆమెకేం చేయాలో తోచలేదు. మొహమాటం కూడా వేసింది చూడ్డానికందరూ పెద్దమనుషుల్లా గున్నారు. టీ కోసం యింత ఆత్రపడుతున్నారేమిటి—అనుకుందామె.

చంప మరోసారి వారివంక చూసింది. వారి చేతులింకా చాపబడే వున్నాయి. వాళ్ళ కళ్ళలోని భావాలామెకు తెలియడంలేదు....నల్లద్దాల మాటున వుండడంవల్ల!

కాసేపు తటపటాయించినా చంప చివరకు ఒకడికి టీ యిచ్చింది. అతడు వెంటనే—"థాంక్యూ! థాంక్యూ వెరీ మచ్!" అన్నాడు.

కృతజ్ఞత అతడి గొంతులో స్పష్టంగా ధ్వనించింది. మామూలు టీ కోసం అతడంతలా థాంక్స్ చెప్పడం ఆమె కాశ్చర్యాన్ని కలిగించినా అది పెద్దిళ్ళ సంప్రదాయమేమో అనుకుని సరిపెట్టుకొంది.

తర్వాత ఒక్కొక్కరికీ ఆమె వరుసగా టీ యిచ్చింది. ఆ వరుసక్రమాన్ని అక్కడున్న పదిమందీ వెంటనే నోట్ చేసుకున్నారు.

టీ కోసం అంతగా ఆత్రపడినవారు టీ అందిన వెంటనే కాగితంమీద ఏదో రాసుకోవడం కూడా ఆమెకు విచిత్రంగానే అనిపించింది.

ట్రే తీసుకుని చంప బయటకు వెళ్ళగానే జగపతిరావు

లోపలకు వచ్చి తలుపు మూశాడు.

"సో—వాటీజ్ యువర్ ఒపీనియన్ జంటిల్మెన్...." అన్నాడాయన నవ్వుతూ.

"టూ పింపుల్ ఏ గర్ల్...." అన్నాడొక వ్యక్తి.

"ఆమెకు అనువైన చోటు రెడ్ సెల్!" అన్నాడింకొకడు.

అతడి అభిప్రాయంతో అందరూ ఏకీభవించారు.

"థాంక్యూ—" అన్నాడు జగపతిరావు—"రెడ్ సెల్‌లో ఓ యువతి ఆరోగ్యం పాడయింది. ఇక ఆమె ఎందుకూ పనికిరాదు. భిక్షేశ్వర్ కమ్మేద్దామనుకుంటున్నాను. ఆ స్థానంలో ఈమెను పంపవచ్చు ..."

భిక్షేశ్వర్ అసలు పేరు వేరే వున్నా పెద్దలందరూ అతడి నా పేరుతోటే వ్యవహరిస్తారు. కొందరతడిని భిక్ష బ్రహ్మ అనీ. భిక్ష విష్ణు అనీ కూడా అన్నప్పటికీ బాగా వాడుకతో వున్నది భిక్షేశ్వర్ అన్న పేరే. బిచ్చగాళ్ళకు సంబంధించినంతవరకూ అతడు సృష్టి స్థితి లయకారకుడు. ఆ విషయం అంతా ఒప్పుకుంటారు.

"అయితే ఆమెను మా కెప్పుడప్పగిస్తారు?"

"రేపే!" అన్నాడు జగపతిరావు.

"ఈ రోజే అయితే బాగుండేది!"

జగపతిరావు నవ్వి—"మనిషన్నాక కొంత మానవత్వముండాలి. ఆమెకో బాబున్నాడు. వాడి ఆరోగ్యం బాగో లేదు. నర్సింగ్‌హోంలో చేర్పించాను. రేపటికి వాడి ఆరోగ్యం చక్కబడుతుంది. ఒక్కసారి ఆమెను తన బాబును ఆరోగ్యంగా చూసుకోనిచ్చేక—అప్పుడు మీ కప్పగిస్తాను...." అన్నాడు.

"యూ ఆర్ రైట్...." అన్నాడో పురుషుడు.

మరొకడి కింకో సందేహం కలిగింది—"మరి ఆమె బాబు ఏమౌతాడు?"

జగపతిరావు వికటంగా నవ్వి—"భిక్షేశ్వర్ ఉండగా చంటిపిల్లల గురించి మనకేమీ బెంగలేదు:" అన్నాడు.

అక్కడున్న వారందరూ ఆయన నవ్వుతో జతకలి పారు. వారిలో ఒక్కరికి కూడా తమ వ్యవహారంలో క్రూరత్వ మున్నదన్న స్పృహలేదు.

7

నందనరావు చాలాసేపు తలుపు పక్కనే నిలబడి ఆ మనిషినే చూడసాగాడు ఆ మనిషి కదలడు, మెదలడు. కొయ్యబొమ్మలా అలాగే నిలబడి వున్నాడు. అతడు తన నెక్కడ కనుగొంటాడోనని నందనరావు ఊపిరి కూడా బిగబెట్టాడు.

టైము పరుగెడుతోంది.

సమయం వృధాచేస్తే అవతల ఎర్రతలుపులు తెరుచు కుంటాయి. అజ్ఞాత తనకిచ్చిన అవకాశం వృథా అయి పోతుంది.

నందనరావు ధైర్యం చేశాడు. నెమ్మదిగా వంగి గుమ్మాన్ని సమీపించాడు. అక్కడ మరీ నేలమీదకు వంగాడు.

ఆజానుబాహుడు కాళ్ళు ఎడంగా పెట్టటడంవల్ల ఆ మధ్యనుంచి వెళ్ళడానికి దారి వుంది. ఆజానుబాహుడి చూపులు పైకి వున్నాయి.

నందనరావు చేతులపై ఆనుకున్నాడు. నాలుగు కాళ్ళ జంతువులా పాకనారంభించాడు.

తను చాలా పెద్ద రిస్కు తీసుకుంటున్నానని నందన రావుకు తెలుసు. కానీ అప్పుడతడి కంతకు మించి దారి

లేదు. అంతా తన అదృష్టంపై ఆధారపడి వుంది.

నందనరావు పాకుతూ ఆజానుబాహుడి రెండు కాళ్ళ మధ్యకు వచ్చాడు. అతడి వళ్ళు జలదరిస్తోంది కానీ ముందుకు వెడుతూనే వున్నాడు. క్షణమొక యుగంలా గడిచినందువల్ల యెంతోసేపు అనిపించినా అతడికి గది లోంచి బయటపడడానికి యెంతోసేపు పట్టలేదు. అప్పు డతడు చటుక్కున లేచి నిలబడి తేలికగా నిట్టూర్చాడు.

సరిగ్గా అప్పుడే అతడి భుజంమీద బలమైన చేయి పడింది.

నందనరావుకు పై ప్రాణాలు పైనే పోయినట్లనిపించింది. అతడు భయం భయంగా వెనక్కు తిరిగాడు.

ఇప్పుడు ఆజానుబాహుడిటువైపు తిరిగి వున్నాడు. అప్పుడాజానుబాహుడు మృత్యుదేవతలా ఉన్నాడు.

నందనరావేదో చెప్పాలనుకున్నాడు. నోరు పెగలలేదు.

"నేను నిన్ను చూడలేదనుకున్నావా? తిన్నగానే నిలబడి నేను పైకీ, కిందకూ, పక్కలకూ ముందుకూ, వెనక్కూ కూడా చూడగలను." అన్నాడా ఆజానుబాహుడు.

నందనరావు రెండుచేతులూ జోడించి అతడికి నమస్కరించి "నన్ను వదిలిపెట్టు జీవితమంతా నీకు ఋణపడి ఉంటాను" అన్నాడు

ఆజానుబాహుడు జవాబివ్వకుండా అతణ్ణి ఒకచేత్తో ఎత్తి అవలీలగా భుజంమీద వేసుకుని అక్కణ్ణించి నడవసాగాడు. నందనరావు గింజుకోవాలని ప్రయత్నించాడు. ఆజానుబాహుడతడి వీపుమీద అరచేతిలో ఒక్కటివేసి "నీకంతగా సరదాగా ఉంటే నాతో ఫైటింగుకు సిద్ధపడు. నెగ్గితే నిన్ను వదిలపెడతాను. నెగ్గడమంటే తెలుసా? నేను చావడం" అని ఒక్క నిముషం ఆగి "ఇంతవరకూ నాతో ఫైటింగుకు

పిద్ధపడ్డవారు తొమ్మండుగురు. అందర్నీ నేనే ఓడించాను. ఓడించడమంటే తెలుసుకదా!” అని తమాషాగా నవ్వాడు.

నందనరావు ఆజానుబాహుండి భుజంమీద గింజుకోవడం మానేసి “ఇప్పుడు నన్నేంచేస్తావ్?” అనడిగాడు.

“ఓ మనిషికోసం చూస్తున్నాను. నువ్వు దొరికావు. వెతకబోయిన తీగ కాలికి తగలడమంటారూ అది యిదే!” అన్నాడు ఆజానుబాహుండు.

నందనరావు మాట్లాడలేదు. అతడికి బుర్ర పనిచేయడం లేదు.

కాసేపటికి ఆజానుబాహుండతణ్ణింకో గదికి చేర్చి భుజం మీంచి దింపాడు. “ఇక్కడ కాసేపు బుద్ధిగావుండు...” అని చెప్పి గదిలోంచి బయటకు వెళ్ళి బయటనుంచి తలుపులు వేశాడు.

ఒక్కనిముషం నందనరావలాగే నిస్త్రాణగా కింద కూర్చుని వుండిపోయాడు. తర్వాత నెమ్మదిగా తేరుకుని చుట్టూ చూశాడు. అంతే. ఉలిక్కిపడ్డాడు

గదిలో ఒక మూలగా ఓ మనిషి వెల్లకితలాపడి వున్నాడు. అతడు గళ్ళలుంగీ, అడ్డచారల బనీయన్ ధరించి ఒకటో తరగతి గూండాలా వున్నాడు. నందనరావులిక్కిపడడానికి కారణం అతడు గూండాలా వుండడంకాదు.

వెల్లకితలాపడివున్న అతడి గుండెలో ఒక పొడవాటి కత్తి దిగివుంది. అంటే అతడు హత్య చేయబడ్డాడన్న మాట! హత్యజరిగి ఎంతోసేపు కాలేదనడానికి సూచనగా చుట్టుపక్కల చిందిన రక్తం గడ్డకట్టినా యింకా తాజాగానే కనపడుతోంది.

నందనరావు గదిలోంచి బయటపడాలని చూశాడు.

ఆ గదిలోంచి ఒక్కటేదారివుంది. ఆ దారి ఆజాను

బాహుడు మూసేశాడు. ఎంతలాగినా బలమైన ఆ తలుపులు కదలడంలేదు.

నందనరావులో క్రమంగా భయం పేరుకుంది.

గదిలో శవం. శవం పక్కగా తను.

ఇప్పుడేమవుతుంది?

భయం. భయం. భయంతో అతడి బుర్ర పనిచేయడం లేదు. ఎలాగో ఆ గదిలోంచి బయటపడాలి. అదెలాగో తెలియడంలేదు.

అతడు గదంతా కలయతిరిగాడు. కాసేపు జుత్తు పీక్కున్నాడు. కాసేపు ఏడ్చాడు. కాసేపు ఎలుగెత్తి అరిచి రక్షించమని బయటనున్నవారికి విన్నపాలు చేశాడు.

అలా ఎంతసేపున్నాడో తెలియదు.

వున్నట్లుండి తలుపులు తెరుచుకున్నాయి.

నందనరావు కింకేమీ తోచలేదు. అక్కణ్ణించి ఎలాగో బయటపడాలన్నదే అతడికోరిక. ఒక్క వుదుటున గది లోంచి పారిపోవాలని చూశాడు.

అతడు గుమ్మం దాటకుండానే రెండు ఇనుప హస్తాలతణ్ణి పట్టుకొని ఆపాయి.

"రాస్కెల్ తప్పించుకుని పారిపోదామను కుంటున్నావా?" అన్న మాటలు అతడికి వినిపించాయి. తలెత్తి చూశాడతడు.

వాళ్ళు మొత్తం అయిదుగురు. ఒకడు ఇన్‌స్పెక్టరు. నలుగురు కానిస్టేబుల్సు. అంటే తను పోలీసుల చేతిలో పడ్డాడన్నమాట. అంటే తన కష్టాలు గట్టెక్కినట్లే!

"సార్! హతుడు, హంతకుడు ఒక గదిలోనే దొరికారు. మనకు మంచి సమాచారం అందింది. మీకు ప్రమో

షన్ ఖాయం. మాకూ ఇంక్రిమెంట్లొచ్చేలా చూడండి సార్." అన్నాడో కానిస్టేబుల్.

"అదంత సులభమా? నేరస్థుడేమేమో అబద్ధాలు చెబుతాడు. తనీ నేరం చేయలేదనీ ఏ పాపమూ ఎరుగననీ అంటాడు." అన్నాడింకో కానిస్టేబుల్.

ఇనస్పెక్టర్ నవ్వి "చెయ్యని వాడిచేతకూడా నేరం ఒప్పించగలను నేను. తెల్లారేసరికి నేనే హంతకుణ్ణని వీడిచేత అనిపిస్తాను" అన్నాడు.

నందనరావు సంతోషమంతా ఇగిరిపోయింది. అతడి పై ప్రాణాలు పైనేపోయాయి. అతడు భయం భయంగా ఇనస్పెక్టర్ వంక చూశాడు.

"ఇతడూ రెడ్ సెల్‌లో వుండడానికి తగినవాడే!" అనుకున్నాడు నందనరావు ఇనస్పెక్టర్ కళ్ళలోని క్రూరత్వాన్ని అంచనా వేస్తూ.

8

"మీ బాబుకు నయమైపోయింది. కానీ ఇంకొక్కరోజు మా దగ్గరే వుండాలి" అంది డాక్టర్.

"ఒక్కసారి బాబును చూస్తాను" అంది చంప.

"మీరు బాబును చూడొచ్చు. కానీ బాబు మిమ్మల్ని చూడకూడదు. వాడిని మరిపించడానికి మేమెంతో కష్టపడాల్సొచ్చింది" అంది డాక్టర్.

చంప తల ఊపి డాక్టరుతో వెళ్ళింది లోపలకు.

ఒక గదిలో మంచంమీద వున్నాడు బాబు. వాడిచుట్టూ బొమ్మలు. ఆ బొమ్మలతో వాడు చక్కగా ఆడుకుంటున్నాడు. ప్రస్తుతానికి వాడికీ ప్రపంచంతో నిమిత్తం లేదన్నట్లుంది.

వాడి ఆటలు, నవ్వు చూస్తుంటే చంప వుండబట్టలేక

పోయింది. ఆమె చటుక్కున వాడి ముందుకు వెళ్ళి "బాబూ!" అంది.

పరిచయమైన ఆ గొంతు విని బాబు అటు చూశాడు.

అంతే!

వాడు తన చేతిలోని బొమ్మను పక్కకు విసిరేశాడు "అమ్మా!" అని అరిచి మంచంమీంచి వేగంగా తల్లివైపు పాకాడు.

బాబు మంచంమీంచి పడిపోకుండా చటుక్కున తీసి ఎత్తుకుంది చంప. వాడిని దగ్గరగా హత్తుకుంది. ఆ కౌగిలిలో బాబు చంప—ఈ ప్రపంచాన్నే మరిచిపోయారు

బాబు మాటి మాటికీ అమ్మ. అమ్మ అంటున్నాడు. వాడా మాటలనడంలోనే తెలుస్తోంది—అమ్మకోసం వాడు బాగా తపించిపోయాడని. ఇప్పుడు వాడికే బొమ్మా అక్కర్లేదు. పిల్లలకి ప్రపంచంలో అమ్మను మించిన బొమ్మలేదు.

"ఎంత పని చేశారమ్మా?" అంది డాక్టర్.

"డాక్టర్—నా బాబును నేను తీసుకుని పోతాను—" అంది చంప.

"అలా కుదరదు. అందుకు మా నర్సింగ్‌హోం రూల్సు ఒప్పుకోవు ..."

"వీడు లేందే నేనుండలేను. నేను లేనిదే వీడుండ లేడు ..." అంది చంప.

"రేపు మీకు బాబును పువ్వుల్లో పెట్టి అప్పగిస్తాం. ఈ రోజుకు వీణ్ణి తీసుకొని వెళ్ళడానికి వీల్లేదు...."

చంప కోపంగా—"తల్లినీ బిడ్డనూ వేరు చేస్తారా? ఇదేం నర్సింగ్‌హోం—ఇదేం డాక్టర్లు!" అంది.

"ఇంతవరకూ యెన్నో కేసులు చూశాం. ఇలా అడి

గిన వారెవ్వరూ లేరు. మీరనేది మధ్యతరగతి మాటలా ఉంది —" అంది డాక్టరు.

అప్పుడు చంపకు గుర్తుకొచ్చింది. బాబు నా నర్సింగ్ హోంలో చేర్చినది జగపతిరావు. ఆయన హైక్లాసు మనిషి. హైక్లాసు వాళ్ళలో తల్లీబిడ్డల అనుబంధాలు వేరేగా వుంటాయేమో! తనిప్పు డనవసరంగా ఆయన పరువుతీయబోతోంది.

కానీ బాబును వదలడం ఎలా?

"ఒక్క రోజమ్మా.... ఒక్క రోజు....ఎలాగో ఓర్చుకోండి" అంటోంది డాక్టరు.

కానీ ఒక్క రోజంతా తను జగపతిరావింట్లో కొత్త వాతావరణంలో గడిపింది అయినా బాబు ఆలోచనలు తనని వదల్లేదు.

అయితే బాబుగురించి ఈ డాక్టరుతో వాదించడం అసహ్యంగా వుంటుంది. విషయం జగపతిరావుకు చెప్పి ఆయనద్వారా ఇన్‌ఫ్లుయెన్స్ చేస్తే బాగుంటుందని ఆమె అనుకుంది.

అందుకే బాబును క్రిందకు దింపింది. వాడామెనో పట్టాన వదల్లేదు. డాక్టరు ఓ నర్సును పిలిచింది. చంపనుంచి బాబును ఆ నర్సు తీసుకుంది.

"ఎలాంటి మొండిపిల్లల్నయినా మరిపించడంలో ఎక్స్‌పర్ట్!" అంది డాక్టర్ నర్సుగురించి మెచ్చుకోలుగా.

చంప కా మాటలు వినిపించలేదు. బాబు తల్లిని వదిలి నర్సుదగ్గరకు వెళ్ళడాని కిష్టపడలేదు. తన అయిష్టాన్ని వాడేడుపు రూపంలో వ్యక్తపరిచాడు. ఆ ఏడుపొక్కటే ఆమె చెవుల్లో గింగురుమంటోంది.

నర్సు బాబును తీసుకుని అక్కణ్నించి వెళ్ళిపోయింది.

అయినా చంప చెవుల్లో ఆ ఏడుపే వినబడుతోంది.

డాక్టరామె భుజం తట్టి—"మనమిక వెడదాం" అంది. ఇద్దరూ అక్కణ్ణించి కదిలారు.

జగపతిరావు కింద కార్లోనే వుండి ఆమె కోసం ఎదురు చూస్తున్నాడు. చంపను చూస్తూనే ఆయన—"బాబు కులాసాగా వున్నాడా?" అన్నాడు.

చంపకా మాటలు వినిపించలేదు. ఆమె చెవుల్లో ఇంకా బాబు ఏడుపే మోగిపోతోంది.

"బాబు కులాసాగా వున్నాడా?" జగపతిరావు మళ్ళీ అడిగాడు.

"ఊఁ" అని ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది చంప. జగపతిరావు నామె కళ్ళు గుర్తించగానే ఆయనలో ఆమెకు ఆత్మీయుడు కనిపించాడు. ఆమె జరిగిందాయనకు వివరించి—"బాబు లేకుండా క్షణం వుండలేను. వాడి కోసం ఏమైనా చేస్తాను" అంది.

"ఈ పాయింటొకటి గుర్తుంచుకోవాలి" అని మనసులో అనుకున్నాడు జగపతిరావు. పైకిమాత్రం సౌమ్యంగా—"బాబును బాగా చూసుకున్నావా?" అనడిగాడు. అవే ఆమెకు ఆఖరి చూపులని తెలుసు కాబట్టి ఆయనలా అడిగాడు. ఆ విషయం తెలియని చంప ఇంకా అమాయకంగా బాబు ఈరోజే తనను చేరేమార్గం చూడమని చెబుతోంది.

"డాక్టర్లు — అంతా మన మేలుకోరే చెబుతారు. నువ్వొక్క రోజు ఆగక తప్పదు...." అన్నాడు జగపతిరావు.

చంప ఏమీ అనలేకపోయింది. ఆయనతో ఆమెకు మరీ అంత చనువులేదు. అందుకని భారంగా నిట్టూర్చి కారెక్కింది.

కారు స్టార్టయింది. కొంత దూరం వెళ్ళి జగపతి హార్డ్‌వేర్ షాప్—ముందాగింది. జగపతి చంపతో—అప్పుడే వస్తానని చెప్పి కారుదిగి లోపలకు వెళ్ళాడు.

అది చాలా పెద్దషాపు. అందులో జగపతిరావుకోసం ప్రత్యేకంగా ఎయిర్‌కండిషన్డు గది వుంది. షాపులోని పని వాళ్ళ సలాములందుకుంటూ ఆయన ఆ గదిలోనికి వెళ్ళాడు. ఓ నంబర్ తిప్పాడు ...“హలో! నేను జగపతిరావును మాట్లాడుతున్నాను” అన్నాడు.

“చెప్పండి సార్!” అంది అవతలిగొంతు.

“మీరు పదిమందీ అక్కడే వున్నారా?”

“లేదుసార్....ఇక్కడ నలుగురున్నాం. మిగతావాళ్ళు కాసేపట్లో వస్తారు.”

జగపతిరావు క్షణం ఆగి—“నేనిప్పుడు హార్డ్‌వేర్ షాపులో వున్నాను. మీరు కారు పంపిస్తారా? నా కార్లో పంపనా” అన్నాడు.

“మీకాెందుకు సార్—నేనిప్పుడే కారు పంపుతాను” అని—“కారు నంబర్ చెప్పాలా?” అన్నాడు.

“ఊఁ”

అతడు చెప్పగా జగపతిరావు కారు నంబర్ నోట్‌చేసుకున్నాడు.

“సరిగ్గా పావుగంటలో మా కారక్కడ ఉంటుంది.”

“కార్లో మీరెవరూ రావద్దు. డ్రైవర్ వుంటేచాలు...”

“నాకు తెలుసు. చాలా చాలా థాంక్స్‌సర్!”

“సరిగ్గా రెండురోజుల తర్వాత మళ్ళీ జాగ్రత్తగా నాకు అప్పగించాలి ...” అన్నాడు జగపతిరావు

“పువ్వుల్లో పెట్టి అప్పగిస్తాం. ఆ సంగతి మీరు చెప్పాలా సర్!”

జగపతిరావు ఫోన్ పెట్టేసి—"ఇంక భిక్షేశ్వర్‌కు ఫోన్ చేయాలి...." అనుకుని రిసీవర్ తీసి నంబరు తిప్పాడు. ఒక్క నిముషం ఆగి—"ప్రైమ్ మినిస్టర్ నంబరైనా దొరుకుతుందేమో కానీ ఈ భిక్షేశ్వర్ నంబర్ ఎప్పుడూ ఎంగేజ్డ్...." అనుకున్నాడు.

మరోనిముషమాగి మరో నంబర్ తిప్పాడు. మళ్ళీ ఎంగేజ్ రింగే వచ్చింది.

"అయినా రేపటిదాకా టైముందిగా—భిక్షేశ్వర్ విషయంలో తొందరలేదు...." అనుకుంటూ అక్కణ్ణించి బయటకు వచ్చాడు.

కార్లో చంప ఆయనకోసం ఆత్రుతగా ఎదురుచూస్తోంది.

"నీకో శుభవార్త!" అన్నాడు జగపతిరావు చంపతో.

ఏమిటన్నట్లామె ఆయనవంక ప్రశ్నార్థకంగా చూపింది.

"నందనరావు ఊళ్ళోనే వున్నాడు. అనుకోకుండా వ్యాపారం పనిమీద మధ్యలో బయటకు వెళ్ళాడట. అతగాడు నాకు నమ్మకస్థుడులే! నా పని అనేసరికి బాబు ఆరోగ్యం గురించి కూడా మర్చిపోయాడు. ఇప్పుడు షాపుకి ఫోన్ చేసేసరికి సమయానికి నేనున్నాను. బాబు ఆరోగ్యం గురించి చెప్పాను. తనప్పుడే ఇక్కడికి రాలేట్ట. నీ కోసం కారు పంపిస్తానన్నాడు."

ఒక్కసారి గాల్లో తేలినట్లయింది చంపకు. ఉన్నపళంగా ఒంటరినైపోయానన్న భావనలో వున్న ఆమెకీ మాటలతో వెయ్యి ఏనుగుల బలం వచ్చింది.

"చాలా మంచికబురు చెప్పారు" అందామె.

కొద్దిసేపట్లో అక్కడకో కారువచ్చి ఆగింది. జగపతిరావా కారు నంబరు చూపి సంతృప్తిగా తలాడించి—"నీ భర్త పంపిన కారు వచ్చిందమ్మా!" అన్నాడు.

చంపు వురికినట్లుగా కార్లోంచి దిగి—ఎరిగినట్లుగా ఆ కార్లోకి వెళ్ళింది ఇప్పుడామె ఊహల నిండా నందనరావే వున్నాడు.

జగపతిరావు టాటా చెప్పడాన్నామె గమనించలేదు. కారెప్పుడు కదిలిందీ ఆమె గమనించలేదు. ఆమె మనసెప్పుడో నందనరావును చేరుకుంది.

ఆ కారు తనను నందనరావు వద్దకు చేర్చదని ఆమెకు తెలియదు.

9

సైంటిస్టు జయరాజ్ ఫోన్‌తీసి ఓ నంబరు తిప్పి— "హలో మిస్టర్ ప్రకాష్! నేను మళ్ళీ ఫోన్ చేసేవరకూ ఎవరూ నన్ను డిస్టర్బ్ చేయవద్దు" అని చెప్పి ఫోన్ పెట్టేశాడు. తర్వాత అతడు తన కోటు జేబులోంచీ ఒక పాకెట్ సైజు కాల్క్యులేటర్ వంటి వస్తువు తీశాడు. అది కార్డులా పలచగా వుంది.

ఎదురుగా అతడి టేబిల్‌మీద పోర్టబుల్ టెలివిజన్ వుంది.

జయరాజ్ చేత్తో టీవీమీద ఒక మీటతాకగానే-స్క్రీన్ ప్రకాశవంతమైంది. అప్పుడాయన తన చేతిలోని వస్తువుపై ఒక మీట నొక్కాడు.

టెలివిజన్లో వెంటనే ఒక దృశ్యం.

అది ఒక హోటలు. అందులో ఒక బల్లదగ్గర కూర్చుని ఉన్నాడోవ్యక్తి. అతడి ముఖం గంభీరంగావుంది. సర్వర్ తెచ్చే టిఫిన్‌కోసం ఎదురు చూస్తున్నవాడిలాగున్నాడతడు.

జయరాజ్ చూస్తూండగా సర్వరతడి ముందో ప్లేటు పెట్టాడు. అందులో యిడ్లీలున్నాయి.

"కారప్పొడి తేలేదేం?" అన్నాడతడు.

అపరాధ పరిశోధన పోటీ-208

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో రూ. 1.00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1-00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-11-'85 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు జనవరి '86 నెల సంచికలో ప్రచురిస్తాము.

1. ఇటీవల తీవ్ర భూకంపానికి గురైన నగరం—?
(మెక్సికో, జలిస్కో)
2. శ్రీలంక క్రికెట్ టెస్టులో ఘోర పరాజయం పొందిన జట్టు—? (శ్రీలంక, ఇండియా)
3. నేడు అనేకమంది విలువైన నగలను ఇక్కడ దాచుకుంటారు—? (బీరువా, బ్యాంకు లాకరు)
4. ఈ ఏడాది రాష్ట్రంలో దీనికి కరువు తప్పేటట్లు లేదు—? (త్రాగేనీరు, విద్యుచ్ఛక్తి)
5. ప్రజాసేవయే వీరి కర్తవ్యం—?
(ఆర్టీసి, పోలీసు శాఖ)

"నెయ్యి లేదుసార్" అన్నాడు సర్వరు.

"ఫరవాలేదు—తీసుకురా"— అన్నాడతడు.

"నరసింహానికి యిడ్లీకారప్పొడి యిష్టం.... వెరీగుడ్.. ప్రొసీడ్ యంగ్‌మాన్." అన్నాడు జయరాజ్ ఉత్సాహంగా.

అతడింకా యిడ్లీతినడం ప్రారంభించలేదు. కారప్పొడి కోసం ఎదురు చూస్తున్నాడు సర్వరో నిముషంలోవచ్చి—

"కారప్పొడి కూడా లేదుసార్!" అన్నాడు.

అతడి ముఖంలో అసంతృప్తి స్పష్టంగా కనబడింది. "సరేలే!" అని ఊరుకున్నాడు.

"మిష్టర్ నరసింహం! నీ కింత శాంతం పనికిరాదు. నీ క్కోపం రాకపోతే నేను తెప్పిస్తానుగా...." అంటూ జయరాజ్ తనే చేతిలోని వస్తువుపై ఓ మీట నొక్కాడు. అంతే!

ఇడ్లీ తినబోతున్న నరసింహం వెళ్ళిపోతున్న సర్వరు నుద్దేశించి "ఏయ్—ఇలారా—" అని పిలిచాడు.

సర్వరు వెనక్కు తిరిగి—"ఏం కావాలిసార్!" అన్నాడు.

"ఇలా దగ్గరగా రా—" అన్నాడు నరసింహం.

సర్వ^ తణ్ణి సమీంచి—"చెప్పండిసార్!" అన్నాడు.

"హోటల్లో నెయ్యెందుకు లేదు?"

సర్వరు ఆశ్చర్యంగా— "దొరకడంలేదు సార్!" అన్నాడు.

"అంటే ఈ ఊళ్ళో ఎవ్వరూ నెయ్యేసుకుని తినడం లేదా?"

సర్వరు కేం చెప్పాలో తెలియక— "నెయ్యిండి మాత్రం ఏం లాభం సార్—కారప్పొడికూడా లేదుగదా!" అన్నాడు.

"హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు—వారికి పత్రికలన్నీ 'రిజిష్టరు పోస్టు' లో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే-జనవరి మరియు జూలై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్థ సంవత్సర చందా చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ (ఏడాదికి రు. 49/-లు) మేమే భరిస్తాము. పత్రికల ఖరీదుకు మించి మీరు పైసా చెల్లించనవసరం లేదు.

3. 'అపరాధ పరిశోధన' మాసపత్రిక మరియు సప్లిమెంట్‌కు కలిపి అర్థ సంవత్సర చందా రు. 78/-లు మాత్రమే. మధ్యలో సభ్యులుగా చేరినవారికి మాత్రం తర్వాత నెలలకు లెక్కవేసి మొదటి వి.పి. పంపబడుతుంది.

4. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మీరు వెంటనే **M. O.** చేయాలి. లేనిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియజేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై-మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోరాము.

5. సభ్యులకు ప్రతి నెలా V.P. ద్వారా పత్రికలు తెప్పించుకునే సౌకర్యంకూడా వుంది. అయితే వి.పి. ఖర్చులుకూడా వారే భరించవలసి వుంటుంది. ఈ పద్ధతిలో పత్రికలను ఏ నెలకానెల రు. 16-60 లు చెల్లించి పొందవచ్చును. యీ సౌకర్యం కావలసిన వారు మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

హోమ్ డెలివరీ! —పత్రికలకు గ్యారంటీ!!

నరసింహం సర్వర్ని సాచి లెంపకాయకొట్టి—"ఏం. వేళాకోళంగా ఉందా?" అన్నాడు.

సర్వర్ వెంటనే కళ్ళుతిరిగి పడిపోయాడు. దూరాన్నుంచి ఈ దృశ్యం చూసిన మేనేజరు పరుగున అక్కడికి వచ్చి—"ఏమిటి గొడవ?" అన్నాడు.

"ఇడ్లీలోకి కారప్పొడి, నెయ్యి కావాలి...." అన్నాడు నరసింహం.

"లేవుసార్!" అన్నాడు మేనేజరు.

సర్వరింకా లేవలేదు.

నరసింహం చిరాగ్గా—"లేకపోతే తెప్పించు" అన్నాడు.

మేనేజరు కోపంగా — "ఇష్టంలేకపోతే యింకో హోటలుకు వెళ్ళండి. ఇలా జబర్దస్తీ చేస్తే వ్యవహారం చాలా దూరం వెడుతుంది—" అన్నాడు.

"వ్యవహారమెందుకూ — నీ సర్వర్ని దూరంగా పంపిస్తే—నెయ్యీ, కారప్పొడీ తెస్తాడు...."

జయరాజ్ ఆశ్చర్యంగా ఈ దృశ్యం చూస్తూ—"అరే నేనూహించిన కంటే తెలివిగా మాట్లాడుతున్నాడే...." అనుకున్నాడు.

"నువ్వు మామూలుగా లొంగేలా లేవు. మర్యాద యిచ్చి పుచ్చుకోవాలని తెలియదా?" అన్నాడు మేనేజరు.

"అవును—ఇడ్లీ కారప్పొడిచ్చి మర్యాద పుచ్చుకో-" అన్నాడు నరసింహం.

మేనేజరు వంగుని సర్వర్ని తట్టి—"లేరా—లే" అన్నాడు.

సర్వర్ కదలలేదు.

మేనేజర్ అతణ్ణి కదిపాడు. కుదిపాడు. అయినా సర్వర్ కదలలేదు. అప్పుడు మేనేజరతణ్ణి వెల్లకితలా

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-11-'85 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు జనవరి '86 నెల సంచికలో ప్రకటిస్తాము.

సెప్టెంబరు '85 పోటీ ఫలితాలు:

(1) సెప్టెంబరు '85 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

ఆగిపోయింది అతని శ్వాస!
గురిచూడడం వృథా ప్రయాస!!

పంపినవారు: శ్రీ డి. దామసోదర్ రెడ్డి, సరబిరియాల్, ఆర్మూర్—తాలూకా, (నిజామాబాదు జిల్లా).

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

మంటల్లో మాంత్రిక పిశాచి!
మెరుపుల్లో నగర సంచారి!!

పంపినవారు: శ్రీ బి. రాజేశ్వర మూర్తి, కో-ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్, 20/213, ఫ్రెంచిపేట, మచిలీపట్టణం - 2.

తిప్పాడు.

సర్వర్ ఊపిరి పీలుస్తున్నాడు. గుండె కొట్టు కుంటోంది.

అతడి చెంపమీద నరసింహం వేలిముద్రలు స్పష్టంగా పడ్డాయి.

"ఎవడ్రా నువ్వు — మనిషివేనా?" అన్నాడు మేనేజర్ కోపంగా.

అప్పటికి చుట్టూ జనం పోగయ్యారు.

"నేను మనిషినికాదు. దెయ్యాన్ని ...." అన్నాడు నరసింహం.

"తప్పు తప్పు — నరసింహావతారం అనాలి" అన్నాడు జయరాజ్.

టెలివిజన్లో దృశ్యం కొనసాగుతోంది.

"దెయ్యానివైతే నీకు ఇడ్లీ కారప్పొడెందుకూ?"

"ఇక్కడ దెయ్యాలు ఇడ్లీ కారప్పొడి తినకూడదు.... అని నువ్వు బోర్డు కట్టేవా?" అన్నాడు నరసింహం.

చుట్టూ చేరిన జనాలు నవ్వారు.

మేనేజర్ కోపంగా "సర్వర్ని అమానుషంగా కొట్టావు. నిన్ను పోలీసుల కప్పగిస్తాను" అన్నాడు

"ఈ హోటల్లో ఇడ్లీ కారప్పొడి ఉంచే తప్పు పోలీసుల వద్దకూడా వెళ్ళను నేను....నువ్వు పోలీసుల్ని పిలిచావో వాళ్ళొచ్చేలోగా హోటల్లో బల్లలు, కుర్చీలు, ప్లేట్లు—అన్నీ విరగ్గొట్టి వెడతాను...." అంటూ—"నా బలం చూస్తావా?" అన్నాడు నరసింహం.

మేనేజరు తెల్లబోయి చూస్తుండగా అతడు పక్క టేబిలు దగ్గర ఒకాయన తింటున్న సెనరెట్ ప్లేటులాక్కుని రెండు చేతులమధ్యా గట్టిగా నొక్కి కిందపడేశాడు. ఆ

Blank Page

Regd.no: H/HD-48